అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 01-11-2023
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50
సంపుటి : 9 సంచిక : 301 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar







ఎన్నికల్లో ప్రజలు గెలవాలి

కాంగ్రెసోల్ల మాటలు నమ్మొద్దు

సీఎం కుర్చీ కోసం 11 మంది పోటీనా?

- వాళ్లు కోర్టుకెళ్లడం వల్లే 'డిండి' పనులు ఆలస్యం
- రాహుల్‌కు ఎద్దుఎవసం ఉంటే ధరణి వద్దనడు
- అధికారులతో మాట్లాడి సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల : ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-మఠంపల్లి/మిర్యాలగూడ/దేవరకొండ

"ఎన్నికలు వస్తుంటాయి... పోతుంటాయి. నాయకులు కాదు ప్రజలు గెలవాలి. ఓటు వేసేటప్పుడు అభ్యర్థి వ్యక్తిత్వం, మనస్తత్వం గుర్తుంచుకోవాలి. అతను ఏ పార్టీ నుంచి పోటీ చేస్తున్నాడో ఆ పార్టీ చరిత్ర, దృక్పథం, సరళిని దష్టిలో ఉంచుకోని ఓటు వేయాలి' అని సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, దేవరకొండ పట్టణకేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం ప్రసంగించారు. కాంగ్రెస్ వాళ్లకు పదవులు వస్తే చాలు ప్రజలు ఎటుపోయిన వారికి అవసరం లేదన్నారు. వారి పాలనలో ప్రజలు ఎన్ని కష్టాలు పడ్డారో మీరే ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత ప్రజల కష్టాలు ఒక్కొక్కటి తీరుస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్నికలు వస్తే గోల్మాల్ చేసి ఓట్లు వేయించుకోవాలని చూస్తారు. వారిని నమ్మకండి అని పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును కట్టవలసిన చోట కాకుండా ఆంధ్ర పాలకులకు అవసరం ఉన్న చోట కట్టారని, అనాడు తెలంగాణ ...9లో

ప్రజాప్రభుత్వాన్ని నిర్మిద్దాం

బీఆర్ఎస్, బీజేపీని బొందపెట్టాలి

చివరి నిమిషంలో ప్రియాంక పర్యటన రద్దు

- మేం కట్టిన ప్రాజెక్టులు చూడండి..కాళేశ్వరాన్ని చూడండి
- ఆరు గ్యారంటీల అమలుకు ఇందిరమ్మ రాజ్యం రావాలి
- కౌలు రైతులకూ రైతుబంధు ఇస్తాం
- ప్రజాబలం కలిగిన ఓటర్లంతా గబ్బర్‌సింగ్‌లే..
- మనది రాజకీయబంధం కాదు..కుటుంబ బంధం : కొల్లాపూర్ సభలో రాహుల్ గాంధీ

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని నిర్మించాలి. కేంద్రంలో బీజేపీకీ బీఆర్ఎస్, ఎంఐఎం జతకట్టి మతతత్వ విధానాలకు ఆజ్యం పోస్తున్నాయి.. పాలకుల తప్పిదాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగింది.. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ ప్రజలను దోపిడీ చేశాయి. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను పాతరపెట్టాలి. సీఎం కేసీఆర్ కుటుంబం ఒకవైపు.. ప్రజలు ఒకవైపు ఉన్నారు.. దోచుకున్నదాన్నంతా కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక కక్కిస్తాం.." అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం పాలమూరు ప్రజాపోరు సభ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది. సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి, అమ్మ సోనియమ్మకు రాష్ట్ర ప్రజలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆరు ...9లో

బాబుకు బెయిల్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదల

- మీ అభిమానాన్ని మరిచిపోలేను : టీడీపీ అధినేత నారా చంద్రబాబు



రాజమహేంద్రవరం : 'నాపై మీరు చూపిన అభిమానం ఎప్పటికీ మర్చిపోలేను' అని టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 52 రోజుల పాటు ఉన్న ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది.చంద్రబాబు ఆరోగ్యం రీత్యా నాలుగు వారాల పాటు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మంగళవారం సెంట్రల్ జైలు నుంచి చంద్రబాబు విడుదలయ్యారు. బెయిల్ మంజూరు కావడంతో ఉదయం నుంచే టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నగరంలోని లోకేశ్ క్యాంపు కార్యాలయంతోపాటు జిల్లాలో పలుచోట్ల బాణసంచా కాల్చుతూ, స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. బెయిల్ నేపథ్యంలో సెంట్రల్ జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో సెంట్రల్ జైలుకు తరలి వచ్చిన టిడిపి శ్రేణులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసుల ఆంక్షలను దాటుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. టీడీపీ జెండాలు చేతబూని చంద్రబాబుకు జేజేలు పలికారు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, ఆయన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, సినీనటుడు, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ, టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

ప్రతిపక్ష నేతల ఫోన్లు హ్యాక్ !

కేంద్రంపై పలువురు ఎంపీల ధ్వజం

మోడీని బహిరంగంగా విమర్శించేవారే లక్ష్యమంటున్న నేతలు

- వివరణ ఇచ్చిన యాపిల్ ...దర్యాప్తు మొదలెట్టామన్న కేంద్రం

ప్రజలపై నిఘా ప్రజాస్వామ్య విరుద్ధం. పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడమే. కానీ నేడు మోడీ ప్రభుత్వానికి నిఘా పెట్టడమే పనిగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిన్న ఇజ్రాయిల్ కు చెందిన పెగాసెస్ స్పైవైర్ వినియోగించి మరీ ప్రజలు, ప్రతిపక్షనేతలు, పాత్రికేయుల వ్యక్తిగత గోప్యతకు తూట్లు పొడిచింది. తాజాగా యాపిల్ కంపెనీతో ప్రతిపక్ష నేతల ఫోన్లు హ్యాక్ చేయటానికి ప్రయత్నించినట్టు జాతీయ మీడియా కథనాలు కలకలంరేపుతున్నాయి. — వివరాలు 6లో..



ప్రజాస్వామ్య విధ్వంసం

ప్రధాని మోడీకి ఏచూరి లేఖ

భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిన చేసి ప్రధాని నరేంద్ర మోడీ పదవిని చేపట్టారని, కానీ తాజా హ్యాకింగ్ వ్యవహారంతో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ప్రజాస్వామ్య హక్కులను దారుణంగా ధ్వంసం చేస్తున్నారని, ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టుల ఫోన్లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని యాపిల్ సంస్థ నుండి వచ్చిన అలర్ట్‌ల నేపథ్యంలో ఏచూరి ప్రధాని మోడీకి లేఖ రాశారు. తనకు వచ్చిన అలర్ట్ మెసేజ్‌ను కూడా ఆ లేఖతో జత చేసి పంపారు. తన ఫోన్‌ను హ్యాక్ ...6లో



కమ్యూనిస్టులే ప్రజాపక్షం

బీజేపీని అధికారానికి దూరం చేయాలి

- దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి
- దానికోసం ప్రజల్ని జాగృతం చేస్తాం : 'ప్రజాపక్షం' వార్షికోత్సవ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా — వివరాలు 6లో..

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం..

ఈసీ నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 7 నుంచి మొదలుకొని నవంబర్ 30 వరకు పలు దఫాల్లో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి నవంబర్ 30 సాయంత్రం 6.30గంటల వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని తెలిపింది.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం, ప్రచారం చేయడం, ఫలితాలు ప్రచురించడం వంటివి చేయరాదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎవరైనా నిబంధనల్ని ఉల్లంఘిస్తే చట్టప్రకారం ...9లో

నేడు రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం

- ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం...
- 3 నుంచి నామినేషన్లు షురూ

9లో..





ఇజ్రాయిల్ దురహంకార దాడులు ఆపాలి

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలి

- ప్రపంచమంతా అండగా నిలబడాలి : వామపక్షాల సంఘీభావ సభలో ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్
- ఎస్వీకే నుంచి అంబేద్కర్ కాలేజీ వరకు ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురహంకార దాడులను వెంటనే ఆపాలని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ అన్నారు. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలనీ, దాని సార్వభౌమత్వాన్ని కాపాడాలని కోరారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభను మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్వీకే)లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ సాగిస్తున్న జాత్యాహంకార విధానాన్ని తీవ్రంగా ఖండించారు. పాలస్తీనాపై జరుగుతున్న దాడిని మానవతా కోణంలో చూస్తామా?, రాజకీయ కోణంలో చూస్తామా?అని అన్నారు. అక్కడ మహిళలు, పిల్లలు, వృద్ధులు చనిపోయారనీ, వారికి ప్రపంచమంతా సానుభూతి వ్యక్తం చేయాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలంటూ ఐక్యరాజ్యసమితిలో 140 దేశాలు తీర్మానం చేశాయని గుర్తు చేశారు. అయితే ఇందులో భారత్ పాల్గొనలేదనీ, ఇది అవమానకరమని చెప్పారు. గతంలో న్యాయం పట్ల, బాధితుల పక్షాన భారత్ నిలబడేదని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. అయితే పాలస్తీనా ఉనికి లేకుండా చేసేందుకు ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతున్నదని అన్నారు. బాధితుల పక్షాన నిలబడాలనీ, వారికి అందరూ సంఘీభావంగా ఉండాలని ...9లో

బీఆర్ఎస్‌కు బంధుల గోల...

ఊర్లల్ల సమాధానం చెప్పలేకపోతున్నం || దళిత, బీసీ, మైనారిటీ బంధుపై బీఆర్ఎస్ లీడర్ల గోస

- ఇప్పటి మ్యానిఫెస్టోలో వాటిని చేర్చితే బావుండేదంటూ ఆవేదన
- హుజూరాబాద్ కోసం ముందే కూసిన 'దళితబంధు' కోయిల

బీవీఎన్ పద్మరాజు



'ఆ చుట్టుకునేదేదో కాలుకో.. చేతికో చుట్టుకుంటే.. ఎట్లో గట్ల ఇడిపించుకుంటోల్లం. అవిప్పుడు ఏకంగా మెడకే చుట్టుకుంటున్నయ్.. ఊపిరాడక చస్తున్నాం...' ఇదీ క్షేత్రస్థాయిలోని బీఆర్ఎస్ లీడర్ల గోస. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న దళిత, బీసీ, మైనారిటీ బంధు పథకాలు ఇప్పుడు అధికార పార్టీని ఇబ్బందులోకి నెట్టేస్తుండటమే వారి గోసకు కారణం. ఈ ఎన్నికల్లో ఓట్లు గుమ్మరిస్తాయనుకున్న ఆయా పథకాలు తమకు ఫలితాలను తెచ్చిపెట్టకపోగా.. ప్రతిబంధకాలుగా మారుతున్నాయంటున్నారు క్షేత్రస్థాయిలోని లీడర్లు. సీఎం కేసీఆర్ గత రెండు వారాల నుంచి రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి సభలు, సమావేశాల్లో ఆయన ప్రసంగిస్తున్నారు. ఆ క్రమంలో ఆ మీటింగులకు ప్రజలు భారీగానే వస్తున్నట్టు అనిపిస్తున్నప్పటికీ, జన సమీకరణ సమయంలో అనేక తలనొప్పులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా దళిత బంధు పథకం అమలైన గ్రామాల్లో లబ్దిదారులు పది మందో, పదిహేను మందో ఉంటే... లబ్దిపొందని వారు వందల్లో ఉన్నారు. కొద్ది నెలల క్రితం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బీసీ, మైనారిటీ బంధు పథకాల పరిస్థితీ అదే. వాటికోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. ఇప్పుడు జన సమీకరణ కోసం నియోజకవర్గ నేతలు గ్రామాల్లోకి ...9లో

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలి

న్యాయవ్యవస్థపై నమ్మకముంది

- ప్రభాకర్ రెడ్డిని పరామర్శించిన మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలనీ, తమకు న్యాయవ్యవస్థపై నమ్మకముందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభాకర్ రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందనీ, వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కడుపులో చిన్న పేగు నాలుగు చోట్ల రంధ్రాలు పడితే, 15 సెంటి మీటర్లు ఓపెన్ చేసి, సర్జరీ చేసి పేగు కట్ చేసి తొలగించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో కోడికత్తి రాజకీయాలంటూ ప్రతిపక్షాలు చిల్లర మాటలు మాట్లాడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఆ అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకట్రెండు రోజుల్లో పోలీసులు కుట్ర కోణం ఛేదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పనితనం తప్ప పగ లేని నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రతిపక్షాలు అల్లర్లు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాయని తెలిపారు.

ఇదిలా ఉండగా కొత్త ప్రభాకర్ రెడ్డి మరో 24 నుంచి 48 గంటల పాటు క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స తీసుకుంటారని యశోద ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌లో తెలిపింది.



సచివాలయంలో ఏక్తాదివస్

- ఉన్నతోద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన సీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఏక్తాదివస్‌ను నిర్వహించారు. సచివాలయ ఉన్నతోద్యోగులు, సిబ్బందితో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రీయ ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఈ.ఓ. ప్రత్యేక కార్యదర్శి, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ సమస్యల పరిష్కార హామీని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పర్చాలని తెలంగాన యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ (సిఐటియు) కోరింది. మంగళవారం ఈ మేరకు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని సుమారు 10 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని చెప్పారు. వాటి నిర్వహణకు ఈ సిబ్బంది కృషి చాలా కీలకమన్నారు. వారి వేతనాల్లో తీవ్ర వ్యత్యాసాలున్నాయని తెలిపారు. అరకొర వేతనాల్లోనూ ఏజెన్సీలు, ప్రభుత్వం ఇచ్చే పర్సంటేజీలు తీసుకుంటూనే కార్మికుల జీతాల్లో కూడా కోతలు విధిస్తున్నారని చెప్పారు. పది గంటల పని విధానం అమల్లో ఉన్నదని తెలిపారు. జీవో నెంబర్ 63 ప్రకారం వారికి కనీస వేతనాలివ్వాలనీ, జీవో నెంబర్ 16 ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. రిటైరైన వారికి రూ.5 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలని విన్నవించారు. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, బస్‌పాస్ సౌకర్యం, మహిళలకు వేతనంతో కూడిన ఆరు నెలల సెలవు ఇవ్వాలని కోరారు.

బీఆర్ఎస్‌కు బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం మద్దతు

- తీర్మానం లేఖను వినోద్ కుమార్‌కు అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతిస్తామని రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం ప్రకటించింది. ఈ మేరకు తీర్మానం లేఖను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్‌కు సిరిసిల్లలో అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టేకేదారులు, బీడీ కార్మికులు, ప్యాకర్లు, చేకర్లు, భట్టి వాల, తునికి ఆకు సేకరణ దారులు కలిపి మొత్తం ఆరు లక్షల మంది కుటుంబాలున్నాయనీ, వీరంతా బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఇప్పటికే అందరికీ సూచించామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుంపల నారాయణ, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి ఐలా రెడ్డి వెల్లడించారు. తమకు ఆసరా పింఛన్లు ఇస్తూ ఆర్థికంగా అండగా నిలిచిన సీఎం కేసీఆర్ రుణ పడి ఉంటామన్నారు. రానున్న రోజుల్లో ఐదు వేల రూపాయల పింఛన్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. టేకేదారుల నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.



ఎంపీలోని 230 అసెంబ్లీ స్థానాలకు 3,832 మంది అభ్యర్థుల నామినేషన్లు



ఇండోర్ : 230 మంది సభ్యుల మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న జరగనున్న ఎన్నికల కోసం మొత్తం 3,832 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అక్టోబర్ 21న నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైందని ఎన్నికల ప్రధాన అధికారి అనుపమ్ రాజన్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గడువు అక్టోబర్ 30 సోమవారంతో ముగిసింది. సోమవారం వరకు 3,832 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 4,359 నామినేషన్లు వచ్చాయని తెలిపారు.

నామినేషన్ పత్రాల దాఖలు చివరి రోజున 2,489 మంది అభ్యర్థులు 2,811 నామినేషన్లు దాఖలు చేసినట్టు అధికారి తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ మంగళవారం నామినేషన్ పత్రాల పరిశీలన జరుగుతుందని, అభ్యర్థులు నవంబర్ 2వ తేదీ వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. ఈ అభ్యర్థుల్లో రాష్ట్ర రాజధాని భోపాల్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి చివరి రోజు 121 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అదే సమయంలో, భోపాల్‌లోని 121 మంది అభ్యర్థులు, బెరాసియా అసెంబ్లీ స్థానానికి 17 మంది , భోపాల్ నార్త్ సీటుకు 22 మంది, నరేలా స్థానానికి 14 మంది, భోపాల్ సౌత్-వెస్ట్ సీటుకు 16 మంది, భోపాల్ సెంట్రల్ స్థానానికి 21 మంది అభ్యర్థులు, 19 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గోవింద్‌పురా అసెంబ్లీ స్థానానికి చివరి రోజు 12, హుజూర్ అసెంబ్లీ స్థానానికి 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ ఒకటి. రాష్ట్రంలో నవంబర్ 17న ఒకే దశలో ఓటింగ్ జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. 230 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలను ఓటర్లు ఎన్నుకుంటారు.

మార్పు కోసం ఓటేయండి



మిజోరాంలో కొత్త పార్టీ జెపీఎం పిలుపు

- రాష్ట్రంలో అధికార ఎంఎన్ఎఫ్‌కు పోటీనిస్తూ ముందుకు
- ఇప్పటికే మునిసిపల్ ఎన్నికల్లో సత్తా

ఐజ్వాల్ : ఈశాన్య రాష్ట్రం మిజోరాం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నది. అక్కడి పార్టీలు ఎన్నికల ప్రచారాల్లో మునిగి తేలుతున్నాయి. అయితే, ఇక్కడ ఐదేండ్ల క్రితం పుట్టుకొచ్చిన ఒక కొత్త పార్టీ ఆ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. ఈ ఏడాది ప్రారంభంలో మిజోరాంలోని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. 2018లో రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్(జెపీఎం) పార్టీ హడావుడిగా ఏర్పడింది. అయితే, ఈ ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లా అయిన లుంగ్లీలో మొత్తం 11 స్థానాల్లో జెపీఎం సత్తా చాటింది. రెండు ప్రధాన పార్టీలైన అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్), ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌లకు గట్టి పోటీనిచ్చింది. ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లలో దాదాపు సగం ఓట్లను జెపీఎం సాధించటం విశేషం.

ఈ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి మానసికంగా బలాన్ని కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. అంతేకాదు, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార ఎంఎన్ఎఫ్ పార్టీ నుంచి వెలువడే ప్రకటనలే ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోరంతంగా.. తమకు పోటీగా ఉన్న కాంగ్రెస్ స్థానంలో జెపీఎం రావచ్చని ఒప్పుకోవటం గమనార్హం. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలలో నవంబర్ 7న మిజోరాంలో ఓటింగ్ జరగనున్నది.

జెపీఎం 2018లో ప్రారంభమైంది. దాని బ్యానర్ క్రింద అనేక మంది స్వతంత్ర అభ్యర్థులు 2018లో ఎన్నికలలో పోరాడారు. ఎన్నికల్లో మొత్తం ఓట్లలో 22 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. 40 సీట్లున్న మిజోరాం అసెంబ్లీకి ఎనిమిది మంది అభ్యర్థులు కూడా ఎన్నిక కావటం గమనార్హం. ముఖ్యంగా, ఈ పార్టీ అరంగేట్రం కాంగ్రెస్‌కు నష్టాన్ని తీసుకొచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై ప్రభావం పడింది. 2019లో జెపీఎం రాష్ట్ర పార్టీ హోదాను పొందింది. నెమ్మదిగా రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన ప్రతిపక్ష శక్తిగా ఉద్భవించింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మిజోరాంలో పోటీ ఆసక్తికరంగా మారనున్నదనీ, జెపీఎం కీలకంగా మారనున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

"మార్పు కోసం ఓటు వేయండి. ఈ కొత్త పార్టీకి అవకాశం ఇవ్వండి" అని జెపీఎం అక్కడి ఓటర్లకు పిలుపునిచ్చింది. ప్రస్తుతం 40 అసెంబ్లీ స్థానాలకు గానూ ఆ పార్టీ 37 మంది అభ్యర్థులను ప్రకటించింది. వారిలో ఎవరికీ ఎన్నికల అనుభవం లేకపోవటం గమనార్హం. "మిజోరాం గత 36 సంవత్సరాలుగా ఇద్దరు వ్యక్తుల క్రింద ఉంది" అని జెపీఎం పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్దుహోమా అన్నారు. ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్‌లను లక్ష్యంగా చేసుకుంటూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రజలు కొత్త ముఖాలు, కొత్త నినాదాలు, కొత్త నాయకత్వం, కొత్త విధానాలను చూడాలనుకుంటున్నారు. వారు పాత పాలనా విధానంతో విసిగిపోయారు" అని ఆయన తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో హిందూత్వ అంశం

రామ మందిర నిర్మాణం పేరుతో ప్రచారం

- కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పిస్తూ లబ్ధి పొందే యత్నం
- బీజేపీ తీరుపై ప్రజలు, విశ్లేషకుల ఆగ్రహం



భోపాల్ : ఎన్నికలు ఎప్పుడొచ్చినా అభివృద్ధికి బదులు మతం పేరు చెప్పుకొని ఓట్లు అడగటం బీజేపీకి అలవాటు. పరిస్థితులు తనకు అనుకూలంగా లేకపోతే.. మతాల మధ్య గొడవలు సృష్టిస్తూ రాజకీయంగా లబ్ధి పొందటం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. ఈ దేశంలో అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న లక్ష్యంతో ఆ పార్టీ హిందూత్వ రాజకీయాలకు తెరలేపింది. రామ మందిర అంశంతోనే 90వ దశకం నుంచి ఆ పార్టీ రాజకీయంగా ఎదిగింది. ఇప్పుడు కూడా మధ్యప్రదేశ్‌లో అదే చేస్తోంది. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరానికి సంబంధించిన బిల్‌బోర్డ్‌లు, పోస్టర్‌లను బీజేపీ మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసింది. "భవ్య రామ మందిర్ బంకర్ హెూ రహా హై తైయార్, ఫిర్ ఇస్ బార్ బీజేపీ సర్కార్ (భవ్యమైన రామ మందిరం సిద్ధం అవుతున్నది. ఈసారి మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఉంటుంది)" అని ఆ పోస్టర్లు ప్రకటిస్తున్నాయి.

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.. గతనెల 28 నుంచి మూడు రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన హిందూత్వ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారు. గతంలో అయోధ్యలో ఆలయాన్ని నిర్మించాలనే బీజేపీ ఉద్దేశ్యాన్ని అనుమానించినందుకు కాంగ్రెస్‌ను ఆయన తప్పుబడుతూ ఆరోపణలు చేశారు. చింద్వారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో షా మాట్లాడుతూ.. "రామమందిర శంకుస్థాపన తేదీ ఖరారైంది." అని ప్రకటించారు. అయితే, కేంద్ర హెూంమంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించలేదు. అయితే బీజేపీ తన పోస్టర్లలో అయోధ్య రామమందిరానికి సంబంధించిన ఫోటోలను ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. రామ మందిరం చుట్టూ ప్రచారం జరుపుతూ మధ్యప్రదేశ్‌లోని ఓటర్లలో మతపరమైన ఉద్వేగాన్ని రెచ్చగొట్టడానికి బీజేపీ యత్నిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు ఆరోపించారు. అయితే, బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల నుంచి అంతగా స్పందన లేదనీ, ఆ పార్టీ తీరు ఓటర్లకు పూర్తిగా అర్థమైందని అంటున్నారు. యూపీలోని రామజన్మ భూమి అంశాన్ని ఇక్కడకు తీసుకురావటం ఏమిటనీ ఓటర్లు మాత్రమే కాదు.. బీజేపీలోని నాయకులే పార్టీ అధిష్టానం తీరును ప్రశ్నిస్తున్నారు. నియోజక వర్గాలకు టిక్కెట్ల విషయంలో జరిగిన అంతర్గత పోరుతో చాలా మంది నేతలు అయోమయంలో ఉన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి వంటి అంశాలు యువత, సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు కావాల్సింది ఉద్యోగ, ఉపాధి కల్పన వంటివనీ, ఇలాంటి మతపరమైన భావోద్వేగ అంశాలు కాదని చెపుతున్నారు. ఎన్నికల కోసమే అయినా బీజేపీకి భిన్నంగా కాంగ్రెస్ ఇలాంటి అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించిందనీ, ఆ పార్టీకి ప్రజల మద్దతు ఉండే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కుల గణన కోసం కాంగ్రెస్ మండల్ వర్సెస్ కమండల్‌ను తెరపైకి తెచ్చిందన్నారు. రాష్ట్రంలో బీజేపీపై కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సర్వేలు సైతం అంచనా వేసాయి. జీ-సీ4 నిర్వహించిన తాజా సర్వేలో కాంగ్రెస్‌కు 132-146 సీట్లు, బీజేపీకి 84-98 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఒపీనియన్ పోల్ కాంగ్రెస్‌కు 46 శాతం ఓట్లు, బీజేపీకి 43 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. 230 మంది సభ్యులున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న ఎన్నికలు జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.



ఐదు రాష్ట్రాల ఎన్నికలకు 1,700 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు

- అదనంగా ఆయా రాష్ట్ర పోలీసులతో భద్రతా



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం దాదాపు 1,700 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలు , రాష్ట్ర పోలీసు బలగాలను మోహరించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరంలలో నవంబర్ 7 నుంచి 30 వరకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. నక్సల్స్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులోభాగంగా నవంబర్ 7న 20 స్థానాలకు, నవంబర్ 17న 70 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రధాన అంతర్గత భద్రతా దళం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) బలగాల మోహరింపును సమన్వయం చేస్తుందని వర్గాలు తెలిపాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సశాస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఆర్ఎఫ్) ,సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) వంటి కొన్ని ప్రత్యేక పోలీసు విభాగాలతో పాటు స్థానిక పోలీసులు బలగాలు ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) యూనిట్లకు అదనంగా 400 అదనపు కంపెనీలను మోహరిస్తుంది. ప్రధానంగా మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల కోసం ఛత్తీస్‌గఢ్‌లో సీఆర్‌పీఎఫ్ శాశ్వతంగా 25-30 బెటాలియన్‌లను మోహరించింది.

ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) , రాష్ట్ర బలగాలు భాగస్వామ్యం చేయడం ద్వారా ఇతర విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా మొత్తం 6,000 కంటే ఎక్కువ కంపెనీలు వచ్చే నెలలో ఐదు రాష్ట్రాల్లో మోహరించడానికి అందుబాటులో ఉన్నాయి. మొత్తం 1,700 కంపెనీలను మోహరిస్తున్నామని, ఇందులో దాదాపు 1.5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. మరికొన్ని యూనిట్లను సిద్ధంగా ఉంచుతామని, అక్టోబర్ నెలాఖరులోగా వాటిని తరలించనున్నారు.సీఏపీఎఫ్ యూనిట్‌లో దాదాపు 70-80 మంది సైనికులు ఉంటారు. ఒక బెటాలియన్‌లో ఈ సంఖ్య దాదాపు 1,000 ఉంటుంది.

మిజోరంలో 5,000 మందికి పైగా సిబ్బంది

మిజోరాం అసెంబ్లీకి నవంబర్ 7న జరిగే ఎన్నికల కోసం కనీసం 3,000 మంది పోలీసులు మరియు 450 సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) సెక్షన్‌లను మోహరిస్తారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని మిజోరం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మధుప్ వ్యాస్ తెలిపారు. సీఏపీఎఫ్ యొక్క ఒక విభాగం 12 మంది సిబ్బందిని కలిగి ఉంటుంది. ఇలా 450 విభాగాల్లో 5,400 మంది సీఏపీఎఫ్ సిబ్బంది ఉంటారు. ఓటింగ్ రోజు ఐజ్వాల్‌లో హెలికాప్టర్‌ను కూడా ఉంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు వ్యాస్ తెలిపారు.

క్లీన్ గంగా అనుమతుల్లేవ్

- క్లియరెన్స్ లేకుండా వారణాసి టెంట్ సిటీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
- జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : గంగా నది పరిశుభ్రత విషయంలో ఉపన్యాసాలు ఇచ్చే మోడీ సర్కారు.. వాస్తవానికి వచ్చే సరికి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. యూపీలోని వారణాసి టెంట్ సిటీ ప్రాజెక్టు ప్రారంభమే దీనికి నిదర్శనం. క్లీన్ గంగా క్లియరెన్స్ లేకుండానే ఈ ఏడాది జనవరి 13న ఈ ప్రాజెక్టును ప్రధాని మోడీ జెండా ఊపి ప్రారంభించారు. తన స్వంత నియోజకవర్గమైన వారణాసిలోని గంగా నది వరద మైదానాల్లో విలాసవంతమైన టెంట్ సిటీని ఆవిష్కరించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనితో పాటు గంగా నది క్రూయిజ్‌ను కూడా జెండా ఊపి ప్రారంభించారు.



అయితే పది నెలల తర్వాత నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (ఎన్ఎంసీజీ) నోడల్ ఏజెన్సీ స్పందించింది. వారణాసి డెవలప్‌మెంట్ అథారిటీ(వీడీఏ) అనుమతి తీసుకోకపోవడంతో ఇప్పుడు ప్రాజెక్ట్ క్లియరెన్స్ లేదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు తెలిపింది. గంగా నది (పునరుజ్జీవనం, రక్షణ మరియు నిర్వహణ) అథారిటీస్ ఆర్డర్ 2016 నోటిఫైడ్ నిబంధనల ప్రకారం.. గంగా లేదా దాని ఉపనదుల వరద మైదానాలపై తాత్కాలిక లేదా శాశ్వతమైన నిర్మాణాలు అనుమతించబడవు. కొన్ని సందర్భాలలో తాత్కాలిక నిర్మాణాలకు కూడా ముందస్తు అనుమతులు తప్పనిసరి. అయితే, ప్రాజెక్ట్ అమలులోకి వచ్చిన మూడు నెలల తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 21న మాత్రమే వీడియే నుంచి అనుమతి కోసం దరఖాస్తు అందిందని ఎన్ఎంసీజీ తెలిపింది.తుషార్ గోస్వామి మార్చిలో ఎన్జీటీని ఆశ్రయించారు. "100 హెక్టార్లలో" విస్తరించి ఉన్న టెంట్ సిటీ 2016 ఆర్డర్‌ను ఉల్లంఘించిందని ఆరోపించారు. ఇది నదీగర్భంలో నిర్మాణాన్ని నిషేధించింది. దీనిపై విచారణకు ప్రభుత్వ అధికారులతో కూడిన ఏడుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని ధర్మాసనం ఏర్పాటు చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్ఎంసీజీ గత వారం ఎన్జీటీతో తన సమాధానాన్ని పంచుకుంది.

కార్మికుల ఊసెత్తని మ్యానిఫెస్టోలు

ఉద్యోగుల సమస్యలు పట్టవా..?



కోట్లాది మంది కార్మికులు, లక్షలాది మంది ఉద్యోగుల సమస్యలేవీ పాలక పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలో కనిపించడం లేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం భ్రమలకు గురి చేసే హామీలు తప్ప మౌలిక మార్పులు తెచ్చే విధానపరమైన అంశాలకు మ్యానిఫెస్టోలో చోటివ్వలేదు. ఎన్నికల వేళ అన్ని వర్గాల, తరగతుల ప్రజల్ని ఆకర్షించేందుకు పాలక పార్టీలు అలవిగాని హామీలిస్తున్నాయి.

- 73 ఎంప్లాయిమెంట్ షెడ్యూల్ వేతన సవరణేది?
- 4 లేబర్ కోడ్ల రద్దుకు ప్రస్తావనేదీ?
- శ్రమ దోపిడీకి గురవుతున్న స్కీమ్ వర్కర్లు
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ రద్దు కాలే..
- ఎవరికీ పట్టని అసంఘటిత రంగం
- వేతనాలకు నోచని ప్రభుత్వ ఉద్యోగులు
- పోరాట ఆయుధమైన 'ఓటు'

కార్మికుల హక్కుల్ని హరిస్తూ కేంద్రం తెచ్చిన ప్రమాదకర నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేస్తామని ప్రధాన పార్టీలు చెప్పట్లేదు. రాష్ట్రంలో కోటి మంది కార్మికులకు మేలు జరిగే 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల సవరణ గురించి ప్రస్తావనా లేదు. శ్రమదోపిడీకి గురవుతున్న స్కీమ్ వర్కర్ల గురించి లేదు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పట్టలేదు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించలేదు. అందుకే ఎన్నికల మ్యానిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగుల ప్రధాన సమస్యల్ని చేర్చి వాటిని పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఎఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ ఇతర కార్మిక సంఘాలు కోరుతున్నాయి. త్పాదకతను పెంచడంలో వివిధ రంగాల్లో సేవలందించడంలో.. ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అమలు చేయడంలో కృషి సాగిస్తున్న కార్మికులు, ఉద్యోగుల్ని పాలక పార్టీలు విస్మరిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు పీఆర్సీ కోసం, అంగన్వాడీలు, ఆశాలు, ఐకేపీ విఓఏలు, పారిశ్రామిక, గ్రామ పంచాయతీ, మున్సిపల్, హమాలీ కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పర్మినెంట్, వేతనాల పెంపు కోసం పోరాడారు. ప్రభుత్వం ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు. అందుకే ఓటును కార్మికులు, ఉద్యోగులు పోరాట ఆయుధంగా మల్చుకునేందుకు సిద్ధమయ్యారు. తమ సమస్యల్ని మ్యానిఫెస్టోల్లో పెట్టి వాటిని అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చాగోష్టిలు నిర్వహిస్తున్నారు.

73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతన సమరణ

రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయి మెంట్స్‌లో కనీస వేతనాల్ని సవ రించాలని కార్మికులు పోరాడు తున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో పనిచేస్తున్న వాళ్లకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించా లని డిమాండ్ చేస్తున్నారు. ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసి జీవో 21,22,23,24,25 గెజిట్ చేయాలని కోరుతున్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కనీస వేతనాల జీవోల సవరణలో జాప్యం చేస్తున్నందున జీవో గడువు ముగిసిన రోజు నుంచే ఏరియల్స్ సహా చెల్లించాలని కోరుతున్నారు. కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పారిశ్రామిక ప్రాంతమైన సంగారెడ్డిలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, పెరిగిన సాంకేతికత దృష్ట్యా రోజుకు 7 గంటలు, వారానికి ఐదు రోజుల పని దినం అమలు చేయాలని కోరుతున్నారు.

స్కీమ్ వర్కర్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న స్కీమ్ వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కనీసం కార్మికులుగా గుర్తించడం లేదు. కనీస వేతనాలుండవు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీ సదుపాయాలేవీ లేవు. సామాజిక భద్రత కరువైన స్కీమ్ వర్కర్ల సంక్షేమం గురించి మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరుతున్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, ఉపాధి హామీ ఉద్యోగులు, ఐకేపీ విఓఏలు, మిషన్ భగీరథ కార్మికులు లక్షల సంఖ్యలో ఉన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కేంద్రం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ఈ విషయాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాలని కార్మికులు కోరు తున్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని ప్రభు త్వం ఏర్పడగానే తొలి అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్, రైల్వే వంటి సంస్థల ప్రయివేటీకరణను రాష్ట్రంలో అమలు చేయబోమంటూ తీర్మానం చేయాలనే డిమాండ్ ఉంది. కొత్తగా ఏర్పడిన జిల్లాలో లేబర్ అధికారుల్ని నియమించాలని, మూతపడిన పరిశ్రమల్ని పునరుద్ధరించాలని, సేల్స్ ప్రయోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ తేవాలని, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు స్టాట్యూటరీ వర్కింగ్ రూల్స్ రూపొందించాలని కోరుతున్నారు.

అసంఘటిత రంగంలో అరిగోస

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర శాసనం చేయాలి. పెన్షన్ రూ.7 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన మాదిరి మోటర్ సైకిళ్లు, స్కూటీలివ్వాలి. వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మిక సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి. దారిమళ్లిన రూ.1255 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలి. బీడీ కార్మికులకు నెలలో 26 రోజుల పని కల్పించి జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలి. హమాలీలు, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు కార్మికులు, మిల్లు ఆపరేటర్లు, దడవాయిలు, చాట, సడెం కార్మికులందరికీ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలి. ఓలా, ఊబర్, పోర్టర్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్‌ను ఏర్పాటు చేయాలి. పవర్‌లూమ్, సెక్యూరిటీ గార్డ్స్‌కు బీమా, ఇతర సదుపాయాలు కల్పించాలి.

స్థానిక సంస్థల కార్మికులు

పరిసరాల పరిశుభ్రతలో అవార్డులు తెస్తున్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికుల్ని పాలకులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్మికుల్ని పర్మినెంట్ చేయడంతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలి. రెండో పీఆర్సీ పరిధిలోకి జీపీ కార్మికుల్ని తీసుకురావాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా గుర్తించాలి. జీవో 51ని సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కేటగిరిల వారీగా కనీస వేతనాలివ్వాలి. జీహెచ్ఎంసీ కార్మికులందరికీ బస్‌పాస్ ఇవ్వాలి. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలి. పారిశుధ్య సేవల్లో ప్రయివేటీకరణకు స్వస్తి పలకాలి.



ఒకటో తేదీనే వేతనాలివ్వాలి

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం పీఆర్సీ ఫైనల్ చేసి జాప్యం లేకుండా అమలు చేయాలి. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను పకడ్బందిగా అమలు చేయాలి. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలివ్వాలి. ఎన్‌హెచ్ఎం, 104, 108, ఆరోగ్య శ్రీ, టీసాక్స్, ఆయుష్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఎంప్లాయిస్‌కిచ్చే మినిమం బేసిక్, డీఎ, హెచ్ఆర్ఎ ఇవ్వాలి. వైద్య ఆరోగ్య శాఖలో రేషనలైజేషన్ జీవో 142ను రద్దు చేయాలి.

ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన పని ఆలోచించడం
- ఎమర్సన్

సంపాదకీయం

గీటురాళ్లు



ఎన్నికల సమయంలో అవే తూకపు రాళ్ళు. ఎన్నో పార్టీలున్నట్టే వాటికి ఎన్నో జెండాల రంగులున్నట్టే పార్టీలను బట్టి తూచే పద్ధతులుంటాయి. వేసే కొలతలను బట్టి తూకపు రాళ్ళుంటాయి. ఇది భౌతిక శాస్త్రమూల సూత్రాలకే వ్యతిరేకమని కొందరు గొణిగినా, ఇది నిజం. ఒక్క భౌతిక శాస్త్రమేంటి? కొలిచేటపుడు నాయకుడితో 'కెమిస్ట్రీ' కూడా కుదరాలి కదా! ఎన్నికల విధేయ శాస్త్రం పార్టీలను బట్టి వేరు వేరుగా ఉంటుంది. కాంగ్రెస్ అయితే 'గాంధీ' కుటుంబ విధేయత ఒక గీటురాయి. అందుకే వనపర్తి సీటు చిన్నారెడ్డికిచ్చినందుకు మరోకాయన మొత్తుకుంటున్నాడు. బీఆర్ఎస్ అయితే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనక పోయినా పర్వాలేదు గాని కేసీఆర్ యెడల వల్లమాలిన భక్తి ప్రపత్తులు కలిగియుండాలి. మాజీ టీడీపీ నాయకులు ఒక వెలుగు వెలుగుతున్న స్థితి చూస్తున్నాం కదా! ఇక బీజేపీ అయితే తెలిసిందే కదా! మోడీని రాజమార్తాండ, రాజకంఠీరవ అన్న బిరుదులతో కైవారం చేయడమొక్కటే చాలదు, గుజరాత్ మారణకాండ, 2021లో గంగా నది ఒడ్డున తేలిన కోవిడ్ శవాల గురించి నోరెత్తకూడదు. బుల్డోజర్ అనే మాట జీవితంలో ఉచ్ఛరించని వారై ఉండాలి. మోడీని వీడియో తీసేటపుడు అడ్డొచ్చేవాడు అసలే అయి ఉండకూడదు

భిన్నమైన వారు కమ్యూనిస్టులు. అభ్యర్థులుగా ఎంపికయ్యేవారు ఏ పాటి ప్రజాసేవకులు, ఉద్యమాల్లోవారి పాత్రేమిటి? అనేది కీలకం. వారి ఆస్తుల గురించి కాదు, వారిపై ప్రజా ఉద్యమాల్లో కేసులెన్ని ఉన్నాయో, ఎన్నేళ్లు జైళ్లకెళ్లారు? వారు అభ్యర్థులైతే ప్రజా ఉద్య మాలకు జరిగే ఉపయోగమేంటి అనేది కీలకం. వారి నడవడికేంటనేవే గీటురాళ్లు. అటువంటి ఉత్తమోత్తముల గురించి ఈ పత్రిక రోజూ పాఠకుల దృష్టికి తెస్తోంది. "బాంబుల వర్షం కురిసినా, బారు ఫిరంగులు మోగినా ఎత్తిన జెండా దించ'ని వారే కమ్యూనిస్టు అభ్యర్థులు.

మరి, గురుత్వాకర్షణశక్తికి వ్యతిరేక డైరెక్షన్‌లో పయనిస్తున్న శకలాల మాటేమిటని కొందరికి సందేహం రావచ్చు. దాని వివరణ సర్వశ్రీ కుల్వకుంట్ల తారకరాముడు ఇచ్చేశారుగా! కేసీఆర్‌ని నిన్నటి దాకా బండ బూతులు తిట్టిన పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్దనరెడ్డి వంటి నేతలు గులాబీ కండువాలు ఎందుకు కప్పుకున్నారు? కేసీఆర్‌పై బీభత్సమైన పాటలతో వీరంగం వేసిన గాయక శిఖామణులు కొందరు తిరిగి గులాబీ దళపతి పంచనెందుకు చేరారు? అనే దానికి... మొన్నటి 'చిట్‌చాట్'లో "మేము బలపడటం ఒకెత్తు అయితే, శత్రువును బలహీన పరచడం మరో కీలక ఎత్తుగడ'ని 'రణనీతి' గురించి విలేకర్లకు 'జ్ఞానోదయం' అయ్యేలా తమ వ్యూహాన్ని డిఫెండు చేసుకున్నారు.

ఒక పార్టీ విధానం నచ్చక... కనీసం నాయకుడి పని తీరు నచ్చక గతంలో పార్టీలు మారేవారు. ఇపుడు అచ్చంగా తనకు సీటివ్వకపోతే ఎగిరి ఇంకో చెట్టుపై వాలుతున్నారు. గతంలో బీసీ వాదాన్ని బలంగా వినిపించిన వ్యక్తి ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసి, నలభై వేల ఓట్ల తేడాతో ఓడి, 2018 ఎన్నికల్లో యాభై వేల ఓట్లతో ఓడి, ఇపుడు సీటివ్వకపోయే సరికి ప్రత్యర్థి పార్టీలో చేరడం చూస్తే వలువ లూడున్న విలువల్ని చూసి ఆయన నియోజక వర్గ ప్రజలు సిగ్గుపడ్తున్నారు. కొందరు దళిత నాయకులు సైతం తమ స్వార్థం కోసం మనువాద మహావృక్షంపై వాలడం తమ భవిష్యత్‌నే కాదు తమ అనుయాయుల ప్రయోజనాలను కూడా దెబ్బ తీసిన వారవడం లేదా?! 1967లో హర్యానా లో ప్రారంభమైన 'ఆయారామ్ గయారమ్' సంస్కృతి నేడు మన తెలంగాణలో ఆరు పువ్వులు పన్నెండు కాయలుగా వర్ధిల్లుతోంది.

నేటి ఎన్నికల్లో గీటురాళ్లు 'పైసాయే పరమాత్మ'! ప్రజా సేవకుడేనా? ప్రజల్లో ఉంటాడా? ప్రజలకోసం త్యాగం చేస్తాడా? వంటివి పరిశీలించే స్థితి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లో లేదు. మునుగోడు గోడు మన కండ్ల ముందే ఉంది కదా!

దీనికి భిన్నమైన వారు కమ్యూనిస్టులు. అభ్యర్థులుగా ఎంపికయ్యేవారు ఏ పాటి ప్రజాసేవకులు, ఉద్యమాల్లోవారి పాత్రేమిటి? అనేది కీలకం. వారి ఆస్తుల గురించి కాదు, వారిపై ప్రజా ఉద్యమాల్లో కేసులెన్ని ఉన్నాయో, ఎన్నేళ్లు జైళ్లకెళ్లారు? వారు అభ్యర్థులైతే ప్రజా ఉద్య మాలకు జరిగే ఉపయోగమేంటి అనేది కీలకం. వారి నడవడికేంటనేవే గీటురాళ్లు. అటువంటి ఉత్తమోత్తముల గురించి ఈ పత్రిక రోజూ పాఠకుల దృష్టికి తెస్తోంది. "బాంబుల వర్షం కురిసినా, బారు ఫిరంగులు మోగినా ఎత్తిన జెండా దించ'ని వారే కమ్యూనిస్టు అభ్యర్థులు.

సరళీకృత ఆర్థిక విధానాలు ముదిరి పాకానపడ్తున్నాయి. కార్మికుల, కర్షకుల జీవితాలు దుర్భరమౌతున్నాయి. వ్యవసాయ కూలీలు సాధించుకున్న ఉపాధి హామీ చట్టం ఛిద్రమవుతుండగా జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్నారు. వృత్తులు ధ్వంసమై వృత్తిదారులు పట్టణ అసంఘటిత కార్మికులుగా చాలీచాలని జీతాల్తో జీవిస్తున్నారు. మరో వైపు శతకోటీశ్వరులు శత సహస్ర కోటీశ్వరులుగా రూపు దాలుస్తున్నారు. దీన్నే 'కే' ఆకారపు అభివృద్ధిగా ఇటీవలి ఇపిడబ్ల్యూ సంపాదకీయం పేర్కొన్నది. (ఇంగ్లీషు కె రాస్తే ఒక కోణం పైకి పెరిగి మరొకటి కిందికి దిగడం) ఈ ప్రజలు నిరంతరం పోరాటాల్లోకొస్తున్నారు. వారికి అండగా నిలవడం, వారి తరఫున పోరు జెండాలెత్తడం, పోరు బాట పట్టడం కమ్యూనిస్టుల విధి. వారు ఎక్కడ నుండి పోటీలో వున్నా గెలిపించుకోవడం ప్రజల కర్తవ్యం. ◆

మధ్య ప్రాచ్యంలో యుద్ధానికి అమెరికా మంటలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

'గాజా ప్రాంతంలో అమాయక పౌరులపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ మారణకాండ', 'నెతన్యాహును ఎవరూ నమ్మటం లేదు', 'ఇజ్రాయెల్ యుద్ధ మంత్రివర్గంలో విబేధాలు', 'వివాద విస్తరణకు సిరియాపై అమెరికా దాడులు', 'లెబనాన్ సరిహద్దులో హిజబుల్లా – ఇజ్రాయెల్ మిలటరీ పరస్పరదాడులు– దాడులను ఆపేది లేదన్న యూదు దురహంకారులు.' మంగళవారం నాటి ఈ వార్తల తీరుతెన్నులు చూసినపుడు మధ్య ప్రాచ్యంలో మంటలు రేపేందుకు పశ్చిమ దేశాలు పూనుకున్నాయా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. మంగళవారం సాయంత్రానికి మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం అక్టోబరు ఏడు నుంచి ఇంతవరకు గాజాలో 8,306 మంది మరణించారు. అక్కడ రోజుకు మరణిస్తున్న లేదా గాయపడుతున్న పిల్లల సంఖ్య రోజుకు 420గా ఉంది. గడచిన నాలుగేండ్లలో 24 దేశాల్లో జరిగిన దాడులు, ఘర్షణల్లో ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఇంత మంది పిల్లలు చనిపోలేదు. పిల్లల్ని రక్షించండి(సేవ్ చిల్డ్రన్) అనే సంస్థ ఆదివారం నాడు వెల్లడించిన సమాచారం ప్రకారం 2020లో ఇరవై రెండు దేశాల్లో 2,674 మంది,ఇరవైనాలుగు దేశాల్లో 2021లో 2,515 మంది, 2022లో 2,985 మంది మరణించారు. ఈ ఏడాది కేవలం అక్టోబరు ఏడు నుంచి 30వ తేదీ వరకు ఒక్క గాజాలో 3,324, పశ్చిమగట్టులో 36 మంది మరణించారు. తాము చంపుతున్నది హమస్ తీవ్రవాదులను అని చెబుతున్న ఇజ్రాయెల్ ప్రకటనలను నిస్సిగ్గుగా సమర్థిస్తున్న అపర మానవతావాదులు ఈ వివరాల గురించి ఏమంటారో !

ఇజ్రాయెల్ పాలక యంత్రాంగంలో ఉన్న విబేధాలు, కుమ్ములాటలు బయటికి వచ్చాయి. అక్టోబరు ఏడవ తేదీన జరిగిన హమస్‌దాడి గురించి తనకు ముందుగా ఎవరూ ఎలాంటి సమాచారం అందించలేదని ఆదివారం తెల్లవారు ఝామున ప్రధాని నెతన్యాహు ఒక ట్వీట్‌లో పేర్కొన్నాడు. హమస్ భయపడిందని, ఒక పరిష్కారానికి సిద్ధంగా ఉందనే విశ్లేషణను మిలిటరీ, గూఢచార అధిపతులు అందించారని ఆరోపించాడు. దాంతో తీవ్ర ఆగ్రహం, ఆందోళన వెల్లడి కావటంతో వెంటనే తన ట్వీట్‌ను వెనక్కు తీసుకోవటమేగాక తాను ఉపయోగించిన పదజాలం తప్పని క్షమించాలని కోరాడు. పాలకుల్లో ఉన్న విబేధాలకు ఇది నిదర్శనమని విశ్లేషకులు పేర్కొన్నారు. మిలిటరీ ఎంతో కష్టమైన దాడులను కొనసాగిస్తున్నపుడు ప్రధానిగా ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. దేశ భద్రత, బందీలుగా ఉన్నవారి గురించి గాక కేవలం రాజకీయాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. నెతన్యాహు తొలుత 1996లో అధికారానికి వచ్చాడు, మధ్యలో విరామం వచ్చింది, ఇప్పటివరకు మొత్తం పదమూడేండ్లు పదవిలో ఉన్నాడు.

ఇజ్రాయెల్ ఇరుగుపొరుగున ఉన్న దేశాలను కూడా యుద్ధంలోకి లాగేందుకు అమెరికా పూనుకుంది. అంతా చేస్తున్నది ఇరాన్ అంటూ రెచ్చగొడుతున్నది. వివిధ దేశాల్లో ఉన్న సాయుధ సంస్థలకు వెన్నుదన్నుగా ఉన్నట్లు ప్రచారం చేస్తున్నది. సిరియాలోని అలెప్పో నగర పరిసరాల శరణార్థి శిబిరాల్లో ఇరాన్ మద్దతుదారులైన సాయుధులు ఇరాక్, సిరియాల్లోని తమ స్థావరాల మీద దాడులు చేశారని, తాము ఆత్మరక్షణ ప్రతి దాడులు చేసినట్లు అమెరికా అమెరికా రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ ప్రకటించాడు. గత కొద్దిరోజుల్లో పదమూడు సార్లు దాడులు జరిగినట్లు ఆరోపించాడు. ఈ ప్రాంతంలో పరిస్థితులు దిగజారాలని తాము కోరుకోవటం లేదని తెర వెనుక నుంచి ఇరాన్ దాడులు చేయిస్తున్నట్లు ఆరోపించాడు. తమ మీద దాడి చేస్తే తాము వారిని వదలబోమన్నాడు. గాజాలో హమస్, లెబనాన్‌లో హిజబుల్లా, ఎమెన్‌లో హౌతీలు, ఇరాక్, సిరియాల్లోని వివిధ సాయుధ బృందాలకు ఇరాన్ ఆయుధాలు, నిధులు అందుతున్నాయన్నాడు. మరోవైపున లెబనాన్‌లో ఉన్న హిజబుల్లా సాయుధ బృందాలపై అక్టోబరు ఏడు నుంచి ఇజ్రాయెల్ రెచ్చగొట్టే దాడులు జరుపుతోంది. ఇంత వరకు హిజబుల్లా రంగంలోకి దిగలేదు. రెచ్చగొట్టే సాయుధ కవ్వింపులతో పాటు మీడియా ద్వారా పెద్దఎత్తున తప్పుడు ప్రచారదాడి ముఖ్యంగా ఇరాన్‌పై సాగిస్తున్నారు.

గతంలో 1890దశకంలో అమెరికాలో న్యూయార్క్ వరల్డ్, న్యూయార్క్ జర్నల్ అనే రెండు పత్రికల మధ్య పోటీ తలెత్తి సంచలనాత్మక, వక్రీకరణ, కుహనా వార్తలను పెద్దక్షరాలతో ప్రచురించి పాఠకులను పెంచుకొనేందుకు చూశాయి.దీన్ని ఎల్లో జర్నలిజం అని పిలిచారు. ఆ క్రమంలోనే స్పెయిన్ ఆధీనంలో ఉన్న వలసలను ఆక్రమించేందుకు అమెరికా ప్రభుత్వం వాటికి మద్దతు కూడా ఇచ్చింది. స్పానిష్–అమెరికా యుద్ధానికి మద్దతుగా మైనే అనే అమెరికా నౌకను స్పెయిన్ ముంచివేసిం



దనే తప్పుడు వార్తను న్యూయార్క్ జర్నల్ ప్రచురించింది. ఆ పోరులో గెలిచిన అమెరికన్లు క్యూబా, ఫిలిప్పీన్లను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. నాటి నుంచి నేటి వరకు సామ్రాజ్యవాదులు జరిపే దాడులకు జనాన్ని తప్పుదారి పట్టించేందుకు అలాంటి తప్పుడు వార్తలను మీడియాలో ప్రవేశపెడుతూనే ఉన్నారు. హమస్, ఇరాన్, చైనా, రష్యా ఇలా సంస్థలు, దేశాల మీద ఎన్నో కట్టుకథలను రాయిస్తున్నారు. అనేక వారాల ముందే ఇజ్రాయెల్ మీద అక్టోబరు ఏడున జరిగిన దాడి కుట్రకు ఇరాన్ సాయం చేసిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ మరుసటి రోజే కథ అల్లింది. తరువాత రోజు మరో పిట్టకత చెప్పింది. ఇరాన్–సౌదీ అరేబియా మధ్య సయోధ్య కుదిర్చేందుకు చైనా ప్రయత్నిస్తున్నపుడే ఏప్రిల్ నుంచి హమస్ తదితర సంస్థలకు ఇరాన్ శిక్షణ ఇవ్వటం ప్రారంభించిందని కూడా రాశారు. ఆ ముక్క ఇజ్రాయెల్‌కు లేదా అమెరికా పాలకులకు సదరు పత్రిక ఎందుకు వెల్లడించలేదు? ఇరాన్ మీద చమురు ఆంక్షలను అమలు జరపటంలో బైడెన్ విఫలమైన కారణంగా వచ్చిన చమురు సొమ్ముతో హమస్ సంస్థకు ఇరాన్ సాయం చేసిందని కూడా కథ అల్లింది. మరోవైపు అమెరికా మంత్రి ఆంటోని బ్లింకెన్ ఇరాన్ పాత్ర గురించి ఆధారాలు లేవు అని చెబుతాడు. ఇజ్రాయెల్ వేగులు కూడా దాన్ని పసిగట్టలేదని ఒక వైపు వారు నెత్తీనోరు కొట్టుకుంటుండగా కొద్ది వారాల ముందే కుట్ర జరిగిందని సదరు పత్రిక రాసింది. ఇలాంటి అమెరికా కట్టుకథల ఉదాహరణలను అనేకం చెప్పవచ్చు. న్యూయార్క్‌టైమ్స్ పత్రిక విలేకరి ఒకడు 2002లో ఇరాక్ తన అణ్వాయుధ కార్యక్రమాలకు అవసరమైన అల్యూమినియం గొట్టాలను సేకరించేందుకు పూనుకుందని రాశాడు. బాంబులు తయారు చేయగలిగిన వారు గొట్టాలను రూపొందించలేరా? పాలస్తీనా ఏర్పాటుకు కేటాయించిన ప్రాంతాలను ఇజ్రాయెల్ దురాక్రమించటం గతం, తాజా పరిణామాలకు కారణం అన్నది తెలిసిందే. వారి ప్రాంతాల నుంచి వైదొలిగితే ఎవరి బతుకు వారు బతుకుతారు. దాన్ని దాచిపెట్టి అమెరికా ఒక వాణిజ్య మార్గాన్ని ఏర్పాటు చేయదలచిందని, దానికి ఈజిప్టులోని సూయజ్ కాలువ, ఇరాన్–ఎమెన్‌లను కలిపే హార్ముజ్ జలసంధి, ఎమెన్–జిబౌటీ మధ్య ఉన్న ఎర్ర సముద్రం–అరేబియా సముద్రాన్ని కలిపే బాబ్ అల్ మండే జలసంధులు కీలకమని, ఈ వాణిజ్య మార్గాన్ని అడ్డుకొనేందుకు హమస్ దాడులు చేసినట్లు కథలను వ్యాపింపచేశారు.

మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధం చెలరేగితే తమకు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు వస్తాయని అమెరికా ఆయుధ వ్యాపారులు, ఉత్పత్తిదారులు కోరుకుంటున్న సంగతి తెలిసిందే. అదే జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ ఇప్పుడు మొదలైంది.పొరుగున ఉన్న ఈజిప్టు, సిరియా, లెబనాన్, జోర్డాన్, ఆ ప్రాంత దేశాలైన ఇరాన్, కతార్ తదితర దేశాల పాత్ర ఉండే అవకాశం ఉంది. ప్రస్తుత ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిశి 2013 నుంచి అధికారంలో ఉన్నాడు. అంతకు ముందు ముస్లిం బ్రదర్‌హుడ్ అధికారంలో ఉంది. హమస్‌సంస్థకు చెందిన వారు దాని నుంచి విడగొట్టుకున్నవారే.

మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధం చెలరేగితే తమకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు వస్తాయని అమెరికా ఆయుధ వ్యాపారులు, ఉత్పత్తిదారులు కోరుకుంటున్న సంగతి తెలిసిందే. అదే జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ ఇప్పుడు మొదలైంది. పొరుగున ఉన్న ఈజిప్టు, సిరియా, లెబనాన్, జోర్డాన్, ఆ ప్రాంత దేశాలైన ఇరాన్, కతార్ తదితర దేశాల పాత్ర ఉండే అవకాశం ఉంది. ప్రస్తుత ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతా ఎల్ సిశి 2013 నుంచి అధికారంలో ఉన్నాడు. అంతకు ముందు ముస్లిం బ్రదర్ హుడ్ అధికారంలో ఉంది. హమస్ సంస్థకు చెందిన వారు దాని నుంచి విడగొట్టుకున్నవారే. తాజా పరిణామాలతో జనంలో ఇజ్రాయెల్ మీద ఉన్న వ్యతిరేకత, పాలస్తీనియన్లకు మద్దతు కారణంగా అనేక ఆంక్షల మధ్య పరిమితంగా కైరో, ఇతర చోట్ల నిరసన ప్రదర్శనలకు ఎల్ సిశి ప్రభుత్వం అవకాశం కల్పించింది తప్ప ఇష్టం ఉండి కాదు. స్వేచ్ఛగా అనుమతిస్తే ఆ ప్రదర్శనల పేరుతో ప్రతిపక్షం తనకు వ్యతిరేకంగా జనాన్ని సమీకరించే అవకాశం ఉందనే భయం కూడా ఉంది. అందువలన ప్రాం తీయ యుద్ధం వస్తే ఈజిప్టు పాల్గొనే అవకాశాలు లేవన్నది కొందరి భావన. గాజా నుంచి నిర్వాసితులు వస్తే తనకు సమస్యలు వస్తాయని కూడా భయపడుతున్నాడు.అందుకే గాజాతో ఉన్న సరిహద్దు తెరిచేందుకు సిద్ధంగా లేడు.

లెబనాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల కారణంగా జనంలో అసంతృప్తి ఉంది. ఈ దశలో ఇజ్రాయెల్‌తో యుద్ధాన్ని అది కోరుకోవటం లేదు. అక్కడ ఉన్న షియా ముస్లిం సామాజిక తరగతికి చెందిన హిజబుల్లా మిలిటెంట్ సంస్థ సరిహద్దులో ఇజ్రాయెల్‌తో ఇప్పటికే అడపాతడపా పోరాడుతోంది. యుద్ధం జరిగితే 2006 నుంచి రెండు దేశాల మధ్య నెలకొన్న శాంతి దెబ్బ తింటుంది. దానికి తోడు క్రైస్తవ–ఇస్లామిక్ వర్గాల మధ్య గతంలో జరిగిన మాదిరి అంతర్యుద్ధం పునరావృతమైనా ఆశ్చర్యం లేదు. అయితే హిజబుల్లా సంస్థ లెబనాన్ ప్రభుత్వంలో పాతుకుపోయింది. లక్ష మంది సాయుధులున్న దాన్ని విస్మరించటం ప్రభుత్వానికి సాధ్యం కాదు. అక్కడి మిలిటరీ కంటే ఇదే శక్తివంతమైనది, అందువలన ప్రభుత్వం కూడా దాన్ని అనుసరించటం మినహా మరొక మార్గం లేదు. ఈ సంస్థకు ఇరాన్ నుంచి సాయం అందుతోంది. అందువలన ఇరాన్ అనుమతి మీదనే హిబబుల్ నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు. ఇజ్రాయెల్‌తో ఉన్న సరిహద్దులోని అనేక గ్రామాల్లో ఉన్న జనాన్ని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇటీవలి వారాల్లో జరిగిన చిన్న చిన్న ఘర్షణల్లో తమ మిలిటెంట్లు 50 మంది మరణించినట్లు హిజబుల్లా ప్రకటించింది. గాజాలో భారీఎత్తున హత్యాకాండ కొనసాగితే హిజబుల్ జోక్యానికి మద్దతు ఇస్తామని జనం చెబుతున్నట్లు వార్తలు వచ్చాయి. లెబనాన్‌లో కూడా పాలస్తీనియన్ల హమస్, ఇతర సాయుధ బృందాలు ఉన్నాయి. వారు లెబనాన్ ప్రాంతం నుంచి కొన్ని రాకెట్లను ఇజ్రాయెల్ మీద ప్రయోగించారు. సిరియాలో 2011 నుంచి అంతర్యుద్ధం జరుగుతోంది. అధ్యక్షుడు బషెర్ అల్ అసాద్‌కు ఇరాన్, రష్యా మిలిటరీ మద్దతు ఉంది. ఆ కారణంగానే, ఇజ్రాయెల్ అమెరికా, ఇతర పశ్చిమ దేశాలూ కిరాయి మూకలు, ఉగ్రవాద సంస్థలకు ఎంతగా సాయపడినా అది నిలదొక్కుకుంటున్నది. అక్టోబరు ఏడు తరువాత రాజధాని డమాస్కస్, అలెప్పో నగరాలపై ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఎనిమిది మంది సిరియా సైనికులు మరణించారు. ఇక్కడ కూడా ఇరాన్ మద్దతు ఉన్న సాయుధశక్తి ఉంది. మరోదేశం కతార్‌కు ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థతో సన్నిహిత సంబంధాలున్నాయి. హమస్ రాజకీయ కార్యాలయం కతార్‌లోని దోహాలో ఉంది. ఆర్థికంగా కూడా పెద్ద ఎత్తున తోడ్పడుతోంది. ఇటీవల హమస్ వద్ద ఉన్న బందీలలో నలుగురిని విడిపించటంలో కతార్ కీలక పాత్ర పోషించింది. ఈ ప్రాంతంలో తన పలుకుబడిని పెంచుకోవాలని చూస్తున్న కతార్‌కు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేవు, ఎలాంటి పాత్ర పోషించేది ఇంకా స్పష్టం కాలేదు. మొత్తం మీద చూసినపుడు ఇరాన్ కీలకంగా ఉన్నందున దాన్ని కవ్వించేందుకు అమెరికా పూనుకుంది. ఏం జరిగేదీ ఎవరూ ఊహించలేకపోతున్నారు. ◆

స్వసుఖం కోరనివాడు /వారం వారం మారని వాడు /రంగులు అద్దుకోలేనివాడు /అబద్ధాసురుని పాలిట తల్వార్ అల్వార్ అని దాశరథి చేత కీర్తించబడి "వాడు చరిత్రకారుడు కాదు వాడే ఒక చరిత్ర" అంటూ కాళోజీచే ప్రశంసలందుకున్న తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాటతత్వాన్ని, సంస్కృతిని నరనరాన జీర్ణించుకుని గ్రంథ పఠనం ద్వారా లోకజ్ఞానం కలుగుతుందని సమాజాన్ని అర్థం చేసుకొని ప్రజలను చైతన్య పరచవచ్చని ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించి ప్రజా చైతన్యానికి బాటలు వేసిన ప్రముఖ సాహిత్య దిగ్గజం. నిబద్ధతను నిండుగా అవపోసన పట్టుకుని నైతిక విలువలను చెప్పి, చెప్పింది రాసి, రాసింది చేసి ఆచరించి చూపిన మహావ్యక్తి. ఒక చేతిలో గన్ను, ఇంకొక చేతిలో పెన్నుతో తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరువిత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమ రైతు. తన కలాన్ని మర ఫిరంగుగా, అక్షరాలను ఇనుప గుళ్ళుగా మార్చి నిరంకుశ బూర్జువా గట్టి గోడలను కూల్చిన ఘనుడు. వెట్టిచాకిరిని నిర్మూలించటం కోసం వెట్టికోటలను కాల్చిన కాగడ. నవ తెలంగాణ నిర్మాణానికి సాంస్కృతిక పునాదులు వేసిన కవి, వలసవాదం, భూస్వామ్యం కింద నలుగుతున్న తెలంగాణను విముక్తి చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించిన నవయుగ వైతాళికుడు

సాహిత్యపు గట్టికోట... వట్టికోట



అళ్వారు స్వామి 1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారం గ్రామంలో ఓ నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో పొట్టకూటి కోసం అనేక పనులు చేశాడు. అదే క్రమంలో కాంచనపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయుని వద్ద వండి పెడుతూ విద్యాభ్యాసం, సారస్వతాభ్యాసం పూర్తి చేశాడు. సూర్యాపేట గ్రంథాలయంలోని నాలుగు గోడల మధ్య విద్యాభ్యాసం లోకజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. ఆ గ్రంథాలయాన్ని గురువుగా మార్చుకొని సాహిత్య ఊపిరి పోసుకున్నారు. ఆంగ్లం, ఉర్దూ భాషలు కూడా నేర్చుకొని తనకు తానుగా ప్రపంచాన్ని పరిచయం చేసుకున్న గ్రహణశీలి. ఆ తర్వాత విజయవాడలోని వెల్కమ్ హోటల్లో సర్వర్‌గా పని చేస్తూ సాహిత్యకారులతో సంబంధాన్ని అనుబంధాన్ని కొనసాగించారు అక్కడే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపాడు.


1936 –37 కాలంలో హైదరాబాద్ చేరి గోల్కొండ పత్రిక ప్రూఫ్ రీడర్‌గా, తరువాత మీజాన్ పత్రికకు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశాడు. ఇదే సమయంలో నిజాంను గడగడలాడించిన ఆంధ్ర మహాసభ సమావేశాలకు హాజరయ్యేవాడు. ఆంధ్ర మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, స్టేట్ కాంగ్రెస్, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం వంటి సామాజిక రాజకీయ సాహిత్య సంస్థలన్నింటికీ కార్యకర్తగా, నాయకుడిగానూ పనిచేశారు. గ్రంథాలయ ఉద్యమ ప్రేరణ నుండి బయలుదేరి నిజాం వ్యతిరేక ఉద్యమం దాకా నడిచిన ప్రజా చైతన్యశీలి వట్టికోట. అతని చర్యలు నిజాంకు కోపం తెప్పించడంతో వట్టికోట జైలు పాలయ్యాడు. నిజామాబాద్ జైలులో దాశరథితో పరిచయం వారి ఇరువురికి విడదీయరాన్ని బంధాన్ని ఏర్పరిచింది. వారి మధ్య ఎప్పుడూ సాహిత్య చర్చలు జరిగేవి. దాశరథి పద్యాలను వట్టికోట బొగ్గుతో గోడలపై రాసి దెబ్బలు తిని నిజాంపై రాసిన పద్యాలను కంఠస్థం చేసిన సాహిత్య అభిలాషి. విజ్ఞానానికి విలువ కట్టని సమాజం వృద్ధి చెందదు వికసించదు అని బలంగా నమ్మి హైదరాబాద్‌లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించారు. సురవరం రాసిన "హైందవ ధర్మాలు ప్రాథమిక సత్యాలు" ప్రజాకవి కాళోజి రచించిన 'నా గొడవ' మొట్టమొదటగా దేశోద్ధారక నుండే ప్రచురింపజేశారు. తెలంగాణ ప్రముఖ రచయితలు రచించిన 35 పుస్తకాలు ఈ దేశోద్ధారక గ్రంథమాల నుంచి ప్రచురించబడ్డాయి. ఊరూరా తిరుగుతూ కవితలు రచనలు సేకరిస్తూ గ్రంథాలను పంచుతూ ప్రజా చైతన్యానికి బాటలు వేసిన సాహిత్య బాటసారి. కడివెండిలో దొడ్డి కొమురయ్య నాయకత్వంలో జరిగిన ఊరేగింపుపై నిజాం పోలీసులు జరిపిన కాల్పులలో దొడ్డి కొమరయ్య మరణించడంపై ఆవేదన చెంది కాల్పులపై పద్మజానాయుడుతో కలిసి నిజనిర్ధారణ నిర్వహించిన మొదటి పౌర హక్కుల నాయకుడు. నాటి తెలంగాణ సామాజిక స్థితిగతులను తెలియపరుస్తూ రాసిన తెలంగాణ మొట్టమొదటి నవల "ప్రజల మనిషి". జైల్లో ఖైదీల స్థితిగతులను సమూలంగా తెలియపరుస్తూ 'జైలు లోపల' అనే నవలలు రాశాడు.

1951లో గుమస్తా సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘం నాయకునిగా గుమస్తాల సమస్యలపై పోరాటాలు చేసి కొన్ని హక్కులు సాధించటంలో సఫలీకృతుడయ్యాడు. ధర్మరాజు అనే కలం పేరుతో ఎన్నో కథలు, కథానికలు రాశాడు. తెలంగాణ రాజకీయ సామాజిక స్థితిగతులను తెలియపరుస్తూ రాయబడ్డ అసంపూర్తి నవల గంగు. సామాన్యుడి జీవితాన్ని సాహితీ పీఠం ఎక్కించిన సాహితీ ద్రష్ట. దళితుల దుర్భర స్థితిని అద్దం పట్టే కాపీర్లు కథ రాశాడు. ఎవరి తిండి వారు తినొచ్చు అంటూ తెలుగు సాహిత్యంలో ఎద్దు మాంసంపై చర్చ లేవనెత్తిన సామాజిక స్పృహ కలిగిన రచయిత. దొరలు జాగీర్దార్ల ఆగడాలను పూస గుచ్చినట్టు గిర్దవర్ కథలో వివరించాడు తన రచనల ద్వారా ప్రసరించిన అభ్యుదయ కిరణాలు నేటి నవ తెలంగాణ నిర్మాణానికి దిశానిర్దేశం చేయగల దివిటీలని చెప్పడంలో ఎటువంటి అతిశక్తి లేదు. 1961 ఫిబ్రవరి 5న వట్టికోట మృతిచెందారు. తనతో జైలు జీవితం గడిపిన వట్టికోటకు దాశరథి తమ అగ్నిధార సంకలనాన్ని అంకితం చేయడానికి వట్టికోట ఎంతటి మానవీయ మనిషో అర్థం చేసుకోవచ్చు. కథకునిగా, వ్యాసకర్తగా, నవలా రచయితగా, విమర్శకుడిగా, కవిగా, ఉపన్యాసకుడిగా, పత్రికా రచయితగా, ప్రచురణకర్తగా పరిశోధకుడిగా. గ్రంథాలయ నిర్వహకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన బహుముఖ ప్రజ్ఞాశాలి వట్టికోట. ఆయన ఆశయాల్ని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నివాళి. ◆

(నేడు వట్టికోట ఆళ్వారుస్వామి జయంతి)

- మలక సురేష్, 9441327666

మోడీ పాలనలో నలుగుతున్న నాలుగో స్తంభం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి
9490204545

'పత్రికా స్వేచ్ఛ వదలరాని విలువైన ప్రత్యేక హక్కని' గాంధీ అన్నారు. పత్రికా రంగం ప్రజాస్వామ్య నాల్గవ స్తంభం. మానవత్వ విలువల, సామాజిక బాధ్యతల, నైతిక పాత్రికేయత సమాజ నిర్మాణానికే మూలం. భారత జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో, స్వేచ్ఛా సాధనలో, జాతీయ భావాల ప్రచారంలో, ఉద్యమాల నిర్మాణంలో, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాసమీకరణ, ఐక్యతలలో, బలమైన ప్రజాభిప్రాయ నిర్మాణంలో పత్రికారంగం కీలకంగా కృషిచేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, బ్రిటిష్ రాణి ప్రత్యక్ష ఏలుబడిలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై అనేక పరిమితులు విధించింది. లండన్ నుండి ప్రచురించే పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాట ఘటనలను వక్రీకరించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారత రాజ్యాంగ అధికరణ 19, దాని ఉపాధికరణలు వాక్స్వాతంత్ర్యం, భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛలను అందించాయి. జాతీయోద్యమంలో పాత్రికేయకట్టడితో బాధలు పడిన భారత తొలి పాలకులు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించలేదు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పత్రికా స్వేచ్ఛను ప్రోత్సహించినట్లు, తనపై శంకర్స్ వీక్లీ విమర్శలను ఆహ్వానించినట్లు చరిత్ర చెపుతోంది. ప్రభుత్వ విధానాల విమర్శ వ్యక్తి విమర్శ కాదని, దిద్దుబాట్లకు అవకాశమిస్తుందని, దేశ నిర్మాణంలో అది అవసరమని నెహ్రూ ఉద్దేశం కావచ్చు. ఆరెస్సెస్ మతవాదయితే తానూ మతవాదినేనని వితండీకరించిన సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైన్యాన్ని, పోలీసులను, ప్రజలను ఒక బహిరంగ సభలో రెచ్చగొట్టారు. రాజ్యాంగ అధికరణ 352(2) ప్రకారం ఇందిర ఆత్యయికస్థితిని రుద్దారు. 25జూన్ 1975 నుండి 21మార్చి 1977 వరకు 21 నెలల పాటు సాగిన అత్యవసరస్థితి కాలంలో పత్రికా స్వేచ్ఛ హరించబడింది. పాత్రికేయులను జైళ్లలో పెట్టారు. కాని సమాజాన్ని మత పరంగా చీల్చలేదు. వైదికవాదులను ముస్లిం, క్రైస్తవులపై ఉసిగొల్పలేదు. ఆధిపత్య వర్ణాధికారంతో అల్ప సంఖ్యా కులను పరాయీకరించలేదు. ప్రపంచీకరణలో ఉత్పత్తి రంగాలు, జాతి సంపదలతో పాటు సేవలనూ ప్రయివేటీ కరించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయ విధానంపై పరిమితులు ప్రారంభమయ్యాయి. వార్తాప్రసారం ప్రభుత్వాధికారంగా మారింది. వార్తా ప్రసార వ్యవస్థలు అందులో ప్రవేశించరాదన్న భావం నిర్మించబడింది. అయినా నాటి ప్రభుత్వాలు క్రమం తప్పకుండా పత్రికా సమావేశాలను నిర్వహించేవి.

నేటి పాలకులు అధికరణ 19ని తుంగలో తొక్కారు. పత్రికా సమావేశాల ఊసే లేదు. సంఘీయులు పాత్రికేయులను విదేశాల్లో కూడా అవమానించారు. దాడులు చేశారు. నిజాలను బయటపెట్టి, నిర్మొహమాటంగా ప్రశ్నించిన, దేశభక్త, సత్యశోధక, ప్రజాపాత్రికేయులు, నిర్వాహకులను పాలకులు "నేరపరిశోధన" సంస్థల దాడులకు గురి చేస్తున్నారు. తమను సమర్థించని పాత్రికేయుల కంప్యూటర్లను విచ్ఛిన్నం చేశారు. వాటిలో తప్పుడు సమాచారాలను ఎక్కించారు. దొంగసాకులతో ప్రాథమిక సమాచార నివేదిక, విచారణలులేని, బెయిలు అవకాశం లేని చట్టవ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద వారిని నిర్బంధిస్తున్నారు. జైళ్లలో కుక్కుతున్నారు. టెలిగ్రాఫ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకుడు ఆర్.రాజగోపాల్, అంతర్జాల పత్రికలు వైర్ సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, న్యూస్‌క్లిక్ నిర్వాహకులు ప్రబీర్ పురకాయస్థ, ముకేశ్ చక్రవర్తి మొదలగువారు ఈ జాబితాలో ఉన్నారు.అస్మత్ పాత్రికేయులకు అనుచిత ప్రయోజనాలు కల్పిస్తున్నారు. రిపబ్లికన్ టీవీ సంపాదకులు ఆర్ణబ్ రంజన్ గోస్వామి వీరిలో ప్రముఖులు. న్యాయస్థానాలు కూడా పాత్రికేయుల ప్రభుత్వ అనుబంధాన్ని బట్టి బెయిల్ నిర్ణయం తీసుకుంటున్నాయి. ఆర్ణబ్ గోస్వామి బెయిల్ కోసం ఒకేసారి కింది కోర్టు నుండి సుప్రీంకోర్టు దాకా అభ్యర్థనలు దాఖలుచేసినా న్యాయమూర్తులు అభ్యంతర పెట్టలేదు. పాత్రికేయులకు న్యాయం చేయడం న్యాయస్థానాల బాధ్యతన్నారు. బెయిల్ ఇచ్చి, ఆతీర్పు ప్రతి అందినంత వరకు ఆగవద్దని, అంతర్జాల ప్రతిపైనే చర్య తీసుకొమ్మని ఆదేశించారు. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో 19 ఏళ్ల దళిత బాలిక అగ్రవర్ణ సామూహిక అత్యాచారహత్యకు గురయ్యారు. ఆ సమాచార సేకరణకు వెళుతున్న కేరళవాసి, ఢిల్లీ పాత్రికేయుడు సిద్దీక్ కప్పన్‌ను ఉపా చట్టం కింద అక్టోబర్, 2020లో అరెస్టుచేసి మథుర జైల్లో పెట్టారు. అక్కడ ఆయనకు కోవిడ్ వచ్చినా బెయిలివ్వలేదు. రెండేండ్ల తర్వాత బెయిల్ ఇచ్చినా మరొక కేసులో జైల్లోనే ఉంచారు. 23డిసెంబర్ 2022న అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇద్దరు స్థానికుల రూ.లక్ష హామీ షరతు విధించింది. కేరళీయ, ఢిల్లీ పాత్రికేయునికి స్థానిక నగదు పూచీకత్తు సాధ్యమా?



ఈ రోజు 72శాతం పత్రికలు, టీవీలు న్యూస్–18 పేరుతో ముకేశ్ అంబానీవే. పత్రికారంగంలో సంచలన మార్పులు తెచ్చిన రామోజీరావు దినపత్రికలు, టీవీలు (ఈనాడు తెలుగు దినపత్రిక, ఈటివి తెలుగు తప్ప)ముకేశ్ అంబాని సొంతం. కోల్‌కతా పాత్రికేయురాలు రాధిక రాయ్, ఆమె భర్త ఆర్థికనిపుణులు ప్రణయ్ రాయ్ 1984లో 24 గంటల ప్రసార స్వతంత్ర్యన్యూ ఢిల్లీ టివి (ఎన్డిటివి) నిస్థాపించారు. వార్తాప్రసారాలపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని తెంచారు. నిష్పక్షపాత వార్తలను అందించారు. ప్రధాని మోదీ ఎన్డీటివికి ప్రకటనలు ఆపుచేయించారు. వ్యాజ్యవ్యూహం పన్నారు. వారి పత్రికాస్వేచ్ఛపై దాడిచేశారు. 2022 ఆగస్టులో బహుళ జాతిసంస్థ యజమాని మోదీ మిత్రుడు గౌతం అదాని ఎన్డిటివిలో 29.18 శాతం వాటాను కబ్జాచేశారు. నవంబర్ లో మరో 8శాతం వాటాను కొన్నారు. డిసెంబర్‌లో రాయ్ దంపతుల నుండి 27.53శాతం వాటాను మాయాజాలంతో సంపాదించారు. దీంతో ఎన్డీటివిలో అదాని వాటా 64.71కి ఎదిగింది. మోదీ అనానుకూల, ప్రజానుకూల పాత్రికేయత మూతపడింది. పత్రికల సంపాదక ప్రమాణాల పెంపుకు, పత్రికాస్వేచ్ఛ రక్షణకు స్థాపించబడ్డ స్వతంత్ర సంస్థ భారత ఎడిటర్స్ గిల్డ్‌కు మౌనమే మిగిలింది. దేశంలో ప్రతి రాజకీయ పార్టీకి దినపత్రికలు, టీవీ ఛానళ్ళున్నాయి. 2021 ఫిబ్రవరికి 900 అనుమతించిన ప్రయివేట్ ఉపగ్రహ ఛానళ్ళున్నాయి. ఇవి తమ యాజమాన్య కార్పొరేట్ సంస్థలకు, తమకు వాణిజ్య ప్రకటనలిచ్చిన సంస్థలకు, కార్పొరేట్ అనుబంధ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తాయి.

ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రజలు ఐదవ స్తంభం. ఈ రోజు ప్రజలు మతాధారంగా చీల్చబడ్డారు. పాలకులు మెజార్టీ మతస్తులకు మతోన్మాదాన్ని ఎక్కించారు. వారి మెదళ్ళను అబద్ధాలతో, చారిత్రక వక్రీకరణలతో నింపారు. ఈ పనిలో పాలకవర్గ దళారి సంస్థల ధృతరాష్ట్ర విశ్వవిద్యాలయం (వాట్సాప్‌లు)ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు పురుషుల క్రికెట్, నేరాలు, చలనచిత్ర ప్రముఖులు, రాజకీ యులు పత్రికారంగ ప్రధాన అంశాలు. సామాన్యు లకు, స్త్రీలకు, సామాజికంగా వెనక్కునెట్టబడ్డవారికి స్థానం లేదు. నేటి పాలకులు రాబోయే ఎన్నికల్లో కూడా నెగ్గితే ప్రజాపాత్రికేయతకే కాదు, ప్రజా స్వామ్యానికి, రాజ్యాంగానికి, పేద ప్రజా బాహుళ్యానికి ముప్పు.

ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రజలు ఐదవ స్తంభం. ఈ రోజు ప్రజలు మతాధారంగా చీల్చబడ్డారు. పాలకులు మెజార్టీ మతస్తులకు మతోన్మాదాన్ని ఎక్కించారు. వారి మెదళ్ళను అబద్ధాలతో, చారిత్రక వక్రీకరణలతో నింపారు. ఈ పనిలో పాలకవర్గ దళారి సంస్థల ధృతరాష్ట్ర విశ్వవిద్యాలయం (వాట్సాప్‌లు)ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు పురుషుల క్రికెట్, నేరాలు, చలనచిత్ర ప్రముఖులు, రాజకీయులు పత్రికారంగ ప్రధాన అంశాలు. సామాన్య లకు, స్త్రీలకు, సామాజికంగా వెనక్కు నెట్టబడ్డవారికి స్థానం లేదు. నేటి పాలకులు రాబోయే ఎన్నికల్లో కూడా నెగ్గితే ప్రజాపాత్రికేయతకే కాదు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, పేద ప్రజాబాహుళ్యానికి ముప్పు.

సమాజమార్పునకు పత్రికారంగం తక్షణ స్వల్పకాలిక ఆయుధం. సత్యసేకరణ, వాస్తవ నివేదిక పాత్రికేయతకు ప్రధానం. పాత్రికేయతనూ, పాత్రికేయులనూనేటి పాలకులు చీల్చారు. ప్రభుపక్ష పాత్రికేయులను ప్రయోజనాలతో ప్రోత్సహిస్తున్నారు. ప్రజాపాత్రికేయుల మీద ఊహించని రీతుల్లో విపరీతమైన ఒత్తిడి పెంచారు. స్వేచ్ఛగా నిజాలు రాయడానికి, పాలకపక్ష ప్రజాస్వామ్య, రాజ్యాంగ, ప్రజావ్యతిరేక విధానాలను, భావజాల, సాంస్కృతిక దుర్మార్గాలను ప్రస్తావించడానికి అనేకులు జంకుతున్నారు. జనసామాన్యానికి అవసరమైన ప్రజా పాత్రికేయులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులందరిది. రాజ్యాంగమిచ్చిన పాత్రికేయ రక్షణకు ప్రజాసంఘాలు, పౌర హక్కుల వేదికలు, ప్రత్యామ్నాయ పార్టీలు కూడా పోరాడాలి. ◆

రెండ్రోజుల్లో
టీడీపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక?

- కంటి చికిత్స తర్వాతే తెలంగాణ నేతలతో బాబు భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖకు కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ రెండు రోజుల్లో జరిగే అవకాశముంది. జైలు నుంచి చంద్రబాబు మంగళవారం విడుదలకాగా... కొత్త నేత ఎంపికపై తెలంగాణ టీడీపీలో చర్చ షురూ అయ్యింది. ప్రస్తుత అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జైలు నుంచి విడుదలైన చంద్రబాబునాయుడు రాజమండ్రి నుంచి విజయవాడ వచ్చి అక్కడినుంచి తిరుపతికి వెళ్ళనున్నారు. బుధవారం రాత్రికి ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. గురువార ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటారు. చికిత్స ఎంతకాలం జరుగుతుంది... ఒకవేళ ఆయన ఆస్పత్రిలో చేరితే చేరితే పరిస్థితేంటి? అనే తదితర అంశాలు ఇప్పుడే తేలే సూచనలు కనిపించటంలేదు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయ వర్గాల సమాచారం ప్రకారం రెండు, మూడు రోజుల్లో కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుత పొలిట్ బ్యూరో సభ్యులు అర్వింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు పేర్లు వినిపిస్తున్నాయి. కాగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత అధ్యక్షుడి ఎంపిక జరగటం ఇది నాలుగోసారి.

కాసానిపై విమర్శలు

టీడీపీకి రాజీనామా చేసిన కాసాని జ్ఞానేశ్వర్, తదితర నేతలపై ఆ పార్టీ సీనియర్ నాయకులు విమర్శల వర్షం కురిపించారు. స్వార్థ రాజకీయాలు సరికావని వ్యాఖ్యానించారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, సీనియర్ నేతలు నన్నూరి నర్సిరెడ్డి, జ్యోత్స్న, ఐలయ్య యాదవ్ తదితరులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. పార్టీ అధినేత ఇబ్బందుల్లో ఉంటే ఎన్నికల్లో పోటీ ముఖ్యమైందని తప్పుబట్టారు. నారా లోకేష్, బాలకృష్ణ ఫోన్లు ఎత్తలేదనడం సరికాదని తెలిపారు. కష్టాల్లో పార్టీని మధ్యలో వదిలిపోవడం రాజకీయ నాయకుడి లక్షణం కాదని అభిప్రాయపడ్డారు.

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సీఎస్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారిని మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి సప్లిమెంటరీ జీతాల బిల్లులు, సరెండర్ లీవు బిల్లులు, పీఆర్సీ-2020 బకాయిలు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనల్ పేమెంట్లు, తెలంగాణ రాష్ట్ర లైఫ్ ఇన్సూరెన్స్ మెచ్యూరిటీ పేమెంట్లు, వాలంటరీ రిటైర్డ్ పర్సన్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్లు అయిన గ్రాట్యూటీ, పెన్షన్ కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కొన్ని బిల్లులు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవి రాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కావున ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలంటూ ఆర్థిక శాఖను ఆదేశించాలని కోరారు.

బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక విపక్షాల హత్యారాజకీయాలు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల క్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నాయని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఓటమి భయంతోనే రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనీ, అశాంతినీ రేకెత్తించాలని ప్రయత్నిస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్యా రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు దిగడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్రంలో సంఘవిద్రోహ చర్యలకు పాల్పడడాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని తెలిపారు. ఇలాంటి దాడులు చేసే వారికి ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. ఎన్నికల సమయంలో తమ సహనాన్ని పరీక్షించొద్దని పేర్కొన్నారు. హత్యా యత్నానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

నారాయణ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావీద్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


హైదరాబాద్‌లోని చైతన్యపురి నారాయణ విద్యాసంస్థలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వైభవ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జావీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది వ్యవహరించిన తీరే కారణమని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దాహం తప్ప విద్యార్థులకు మానసిక ధైర్యం చెప్పే వారు కరువయ్యారని తెలిపారు. రోజూ ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విద్యార్థులు చదవాలంటూ ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కాలేజీలో మానసిక నిపుణులతోపాటు యాజమాన్యానికి చెందిన వారు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ, శ్రీచైతన్యను మూసేయాలని కోరారు. చనిపోయిన వైభవ్ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలిపారు. లేకుంటే నారాయణ విద్యాసంస్థ ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలి : ఏఐఎస్ఎఫ్

విద్యార్థులను వేధింపులకు గురిచేస్తూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైతన్యపురి నారాయణ కాలేజీలో చదువుతున్న వైభవ్ అనే విద్యార్థి ఆ కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మార్కులు, ర్యాంకుల కోసం పెడుతున్న ఇబ్బందులను భరించలేక సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ కారణంగానే నిరుద్యోగ భారతం

నియామకాలపై మాట్లాడే నైతికత కిషన్ రెడ్డికి లేదు : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో నిరుద్యోగం పెరగడానికి బీజేపీయే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఆశచూపి అధికారంలోకి వచ్చి మోసగించిన బీజేపీ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి నియామకాలపై మాట్లాడే నైతికత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 1,60,000 ఉద్యోగాలను భర్తీ చేసిందనీ, మరో 70 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ శరవేగంగా పూర్తి కాబోతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసినన్ని ఉద్యోగాలను దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా భర్తీ చేసిందా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలెన్ని, ఆయా శాఖల వారీగా ఉన్న ఖాళీలెన్ని అనే విషయంపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? అని కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్ అనుచరుడే పేపర్ లీకేజీకి పాల్పడ్డాడని గుర్తుంచుకోవాలని సూచించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేసి రాష్ట్ర యువత ఉపాధి అవకాశాలను బీజేపీ పెద్ద ఎత్తున దెబ్బతీసిందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తయారీ రంగం, ఫార్మా తదితర రంగాల్లో 24 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. ఏడాదికి రెండు కోట్ల చొప్పున 18 కోట్ల ఉద్యోగాల కల్పన చేయనందుకు బీజేపీ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో 45 ఏండ్లలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. విభజన హామీల్లో ఒక్కటైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ హామీ అమలు చేసి ఉంటే గిరిజన, ఆదివాసీలకు ఉపాధి లభించేదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో భర్తీ చేయకుండా 16 లక్షల ఉద్యోగాలను ఖాళీగా పెట్టి, ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ, ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్ హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రముఖ ప్రజావైద్యులు
డాక్టర్ స్వామి అల్వాల్ కన్నుమూత

నవతెలంగాణ సీజీఎం, ప్రజాసంఘాల నేతల నివాళి


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ ప్రజావైద్యులు డాక్టర్ స్వామి అల్వాల్ కన్నుమూశారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. అనారోగ్య కారణాలతో గత కొన్ని రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ స్వామి మంగళవారం తుది శ్వాస విడిచారు. మల్లు వెంకటనర్సింహారెడ్డి స్మారక ప్రజావైద్యశాలలో ఆయన గత ఐదేండ్లుగా సేవలందిస్తున్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో తనకున్న స్థలాన్ని కూడా విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేసి పేదలు, దళితుల పట్ల తన సేవాగుణాన్ని చాటుకున్నారు. డాక్టర్ మృతి పట్ల నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జనరల్ మేనేజర్లు, మేనేజర్లు భరత్, శశిధర్, నరేందర్‌రెడ్డి,వీరయ్య, విజయ్‌కుమార్, రాములు ఆయనకు నివాళులర్పించారు.

స్వామి అల్వాల్ మరణం సామాజికోద్యమాలకు తీరని లోటు

ప్రముఖ ప్రజా వైద్యులు, నిస్వార్థ జీవి, సంఘ సేవకులు, పేదల పక్షపాతి డాక్టర్ స్వామి అల్వాల్ మరణం సామాజికోద్యమాలకు తీరని లోటని వివిధ ప్రజాసంఘాల నేతలు అన్నారు. మంగళవారం తిలక్‌నగర్‌లోని శతాబ్ది భవన్‌లో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ తన 300 గజాల విలువైన స్థలాన్ని పేద ప్రజలకు ఇచ్చారని గుర్తు చేశారు. అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన డాక్టర్ స్వామి అల్వాల్ నేటి తరానికి మార్గదర్శకులుగా నిలుస్తారని చెప్పారు. మహనీయులు సంత్‌గాడ్గే బాబా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కారల్ మార్క్స్ భగత్ సింగ్ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే, వీరనారి ఐలమ్మ వంటి సుమారు 20మంది మహనీయుల విగ్రహాలను నెలకొల్పారని చెప్పారు. మహనీయుల అడుగుజాడల్లో సమాజ మార్పు కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం దళితులు, పేదలకు తీరని లోటని చెప్పారు. మహేందర్, కోట రమేష్, గోసుల విజయ్‌కుమార్, లక్ష్మయ్య, భూపతి వెంకటేశ్వర్లు, ఎస్వీకే నిర్వహకులు జి బుచ్చిరెడ్డి, ఎన్ సోమయ్య తదితరులు డాక్టర్ స్వామికి నివాళులర్పించారు.

ముధోల్‌లో బీజేపీకి షాక్

- బీఎస్పీలో చేరిన బద్దం బోజారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత బద్దం బోజారెడ్డి బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో మంగళవారం హైదరాబాదులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీఎస్పీలో చేరారు. తీర్థం పుచ్చుకున్నారు. బైంసా మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన బద్దం బోజారెడ్డి ముధోల్ ఇంటలెక్చువల్ ఫోరం మన గుడి-మన బడి ట్రస్ట్ స్థాపించి,గత పది సంవత్సరాలుగా ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తూ, విద్యార్థులకు పలు సేవలు అందిస్తున్నారు. ఆయన గతంలో బండి సంజయ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు.ముధోల్ అసెంబ్లీ బరిలో టికెట్టు ఆశించిన బద్దం బోజారెడ్డి కి టికెట్టు దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు.

మనువాదమంటేనే..విచ్ఛిన్నం

- రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దేశానికి వినాశనమే..
- ఓంకార్ వర్ధంతి సభలో వామపక్ష నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మనువాదమంటేనే విచ్ఛిన్నం. దాని భావాజాలాన్ని ఓడించకపోతే..దేశ భవిష్యత్ అంధకారమే' అని వామపక్ష నేతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యాలయంలో ఓంకార్ 15వ వర్ధంతి సందర్భంగా 'మనువాదం-రాజ్యాంగం' అంశంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యులు వల్లపు ఉపేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర కార్యదర్శి మురహరి, ఆర్ఎస్‌పీ కార్యదర్శి జానకిరాములు, సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాయల చంద్రశేఖర్, ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె గోవర్దన్, బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సుకన్య తదితరులు మాట్లాడారు. సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ మనువాదమంటే కుల వ్యవస్థను పెంచి పోషించటమేనని చెప్పారు. అసమానతలను యథాతథంగా కొనసాగించాలని భావిస్తున్నదన్నారు. ధర్మం నాలుగుపాదాల మీద నడవటమంటే బ్రహ్మణీయ భావాజాలాన్ని అమలు చేయటమేనన్నారు. ఏ కులం ఏం చేయాల్నో మనుధర్మ శాస్త్రం స్పష్టం చేసిందనీ, దాన్ని పాటించటమే మన విధి అని చెబుతున్నారని గుర్తు చేశారు. దేశం సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ అనాగరిక ఆలోచనలు చేయటమేంటని ప్రశ్నించారు. మనువాద ఆలోచనలకు అడ్డంకిగా భారత రాజ్యాంగం ఉందనీ, దాన్ని ధ్వంసం చేయాలని ఆర్ఎస్ఎస్ చెబుతున్నదని తెలిపారు. నియంతృత్వ, ఫాసిస్టు ఆలోచనలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. దేశంలో మతతత్వాన్ని, మతోద్మాదాన్ని పెంచి పోషిస్తూ మైనార్టీ మతాలపై దాడులకు పూనుకుంటున్నదని వాపోయారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అప్రజాస్వామికంగా కూలదోస్తున్నదని చెప్పారు. వీటిని ఎదుర్కోవాలంటే వామపక్ష ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..మద్దికాయల ఓంకార్ రాజ్యాంగ హక్కులను రక్షించడానికి చట్టసభల్లో తన గళాన్ని విడిపించే వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంసీపీయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వి తుకారాం నాయక్, మంద రవి, పెద్దారపు రమేష్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మార్కుల మానసిక ఒత్తిడి

- తట్టుకోలేక విద్యార్థి ఆత్మహత్య
- ఒత్తిడి చేయొద్దంటూ సూసైడ్ నోట్



నవతెలంగాణ-మీర్‌పేట్

ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలన్న కాలేజీ యాజమాన్యం మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఓం సాయినగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి- ఆనంద్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఎం. వైభవ్(16) చైతన్యపురిలోని నారాయణ కాలేజ్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని.. ఇంకా ఎక్కువ చదవాలంటూ లెక్చరర్స్ నుంచి ఒత్తిడి పెరిగింది. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థి.. మంగళవారం ఉదయం వైభవ్ సూసైడ్ నోట్ రాసిపెట్టి.. ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నారాయణ కాలేజ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకునే వరకు మృతదేహాన్ని తరలించబోమని కుటుంబ సభ్యులు తేల్చి చెప్పారు. అయితే పోలీసులు వారికి సర్దిచెప్పి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కిరణ్ తెలిపారు.

సూసైడ్ నోట్‌లో ఏం ఉందంటే..

"వైభవ్ అనే నేను చైతన్యపురిలోని నారాయణ కాలేజ్‌లో చదువుతున్నాను. ఇంకా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని కళాశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నాపై ఒత్తిడి పెడుతున్నారు. నా సోదరుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ నారాయణ కాలేజ్‌లో చేర్పొద్దు. నా జీవితంలో ఇదే చివరి రోజు. విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేయకండి.. నా సోదరున్ని మంచి కాలేజ్‌లో చేర్పిస్తారని నేను ఆశిస్తున్నాను. అతని భవిష్యత్ బాగుండాలని కోరుకుంటున్నాను. సారీ మమ్మీ, డాడీ, సోదరా... సారీ టు ఆల్" అంటూ సూసైడ్ నోట్‌లో వైభవ్ పేర్కొన్నాడు.

'గురుకులం'లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన
- బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు
- విద్యార్థినులను ఇండ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు



నవతెలంగాణ-మద్నూర్

గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి..

పెద్ద ఎక్లారా గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో దాసరి వసుధ(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెది బిచ్కుంద మండలం మానేపూర్ గ్రామం. మంగళవారం ఉదయం గదిలో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందింది. దీనిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు, బంధువులు, ఇతర విద్యార్థినుల తల్లిదండ్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి, బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. బాన్సువాడ ఆర్డీఓ భుజంగరావు, మద్నూర్ ఆర్ఐ శంకర్ విచారణ చేపట్టారు. విద్యార్థిని మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సాయంత్రం వరకు ఆందోళన సాగింది. సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు, రెవెన్యూ అధికారులు హామీనిచ్చారు. చివరకు విద్యార్థిని తండ్రి గంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళాశాలలో మిగతా విద్యార్థినులను తల్లిదండ్రులు ఇండ్లకు తీసుకెళ్లారు. తమ పిల్లలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో మొదటి సంవత్సరం విద్యార్థిని నీటి ట్యాంకులో పడి చనిపోయిన ఘటనపై ఇప్పటి వరకు బాధిత కుటుంబానికి ఎలాంటి న్యాయమూ జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం), బీఎస్పీ, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు గురుకుల కళాశాలను సందర్శించి ఘటనపై సమగ్ర విచారణ విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు ఏమీ తెలియరాలేదు.

నేటి నుంచి డీఎస్సీ దరఖాస్తుల సవరణకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థులు బుధవారం నుంచి వాటిని సవరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ దరఖాస్తుల సవరణ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ ప్రక్రియను చేపట్టేందుకు తుది గడువు ఈనెల ఐదో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. ఆదివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,79,297 మంది ఫీజు చెల్లిస్తే, వారిలో 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 66,376 మంది, 611 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 12,339 మంది, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 6,856 మంది, 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 91,931 మంది కలిపి మొత్తం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

వేగంగా రొమ్ము క్యాన్సర్ రోగ నిర్ధారణ

- ముందస్తు పరీక్షలతో సంరక్షణ : డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అపోలో క్యాన్సర్ సెంటర్లలో రొమ్ము క్యాన్సర్లను రోగ నిర్ధారణ చేస్తున్నట్టు హైదరాబాద్ అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డి తెలిపారు. రొమ్ము క్యాన్సర్ చైతన్య మాసం అక్టోబర్‌ను పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని అపోలో క్యాన్సర్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిదశలో గుర్తించడం, రాకముందే పసిగట్టడం ద్వారా సులువైన చికిత్స ద్వారా బయటపడే అవకాశముందని తెలిపారు. వక్షోజాల ఆరోగ్యాన్ని కచ్చితంగా అంచనా వేయడంలో మమ్మోగ్రఫీ, అల్ట్రాసౌండ్, బయాప్సీలతో కూడిన ఆధునాతన రోగ నిర్ధారణ సాంకేతికతలతో 24 గంటల్లోనే ఫలితం పొందే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. వక్షోజాలను కాపాడటంలో తాము 60 శాతం విజయం సాధించామనీ, వంద శాతం విజయం సాధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్లలో గతంలో గర్భాశయ క్యాన్సర్లు అధికంగా వచ్చేవనీ, గత పదేండ్ల కాలంలో రొమ్ము క్యాన్సర్లు పెరిగాయని తెలిపారు. పట్టణీకరణ, నాగరికత, శారీరక శ్రమ తగ్గడం, వ్యాయమం, ఆటలు ఆడకపోవడం వంటివి ఇవి పెరగడానికి కారణాలుగా తెలుస్తున్నాయన్నారు. కుటుంబ ఆరోగ్య చరిత్రలో రొమ్ము క్యాన్సర్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచంచారు. అందరికి రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో అపోలో 50 శాతం తక్కువకే అందిస్తున్నదని చెప్పారు.

సర్జికల్ ఆంకాలజీ సీనియర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ టీపీఎస్ భండారి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్లను నివారించలేమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది 1.8 లక్షల మంది మహిళలు దీని బారిన పడుతుండగా, 2030 నాటికి ఈ సంఖ్య 2.5 లక్షలకు పెరగనుందని హెచ్చరించారు. ప్రస్తుతం డే కేర్ సర్జరీ అందుబాటులో ఉందన్నారు. రేడియాలజీ ఆంకాలజిస్ట్ డాక్టర్ రష్మీ సుధీర్ మాట్లాడుతూ 3డీ మమ్మోగ్రఫీ వంటి ఆధునాతన ఇమేజింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తూ గంటల వ్యవధిలోనే వక్షోజాల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తున్నామనీ, తద్వారా చికిత్సలో జాప్యం లేకుండా రోగికి మేలు కలుగుతుందన్నారు.

కుల సమీకరణాలు మారితే సత్తుపల్లి టికెట్ నాకు ఇవ్వండి

- ఏఐసీసీకి మానవతారాయ్ భార్య సుచరితారాయ్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం టికెట్ కేటాయింపు విషయంలో కుల సమీకరణాలు మారితే మాదిగ సామాజికతరగతికి చెందిన తనకు కేటాయించాలని టీపీసీసీ నేత కోటూరి మానవతారాయ్ భార్య సుచరితారామ్ మాదిగ ఏఐసీసీకి లేఖ రాశారు.

'నేను మానవతారాయ్ భార్య డాక్టర్ సుచరితారాయ్ మాదిగను. కాంగ్రెస్‌లో 23 సంవత్సరాలుగా అంకితభావంతో పని చేస్తున్నారు. ఓయూ తెలంగాణ ఉద్యమ నాయకుడైన నా భర్త, మా కుటుంబ సభ్యుల కన్నా కాంగ్రెస్ పార్టీకి మరియు ప్రజా సమస్యలపై పోరాటానికి ఎక్కువ సమయం ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఇంట్లో కన్నా పోలీస్ స్టేషన్లో, జైళ్లలో ఎక్కువగా గడిపాడు. అనేక అక్రమ కేసులు బనాయించారు. నెలలో సగం రోజులు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. తన సర్వస్వాన్ని కాంగ్రెస్ కోసం ధారపోశాడు. తాను పడ్డ కష్టానికి ప్రజాసేవ చేయాలనే తలంపుతో చట్టసభల్లోకి ప్రవేశించాలని కాంగ్రెస్ టికెట్ ఆశించారు. తను పుట్టిన గడ్డ సత్తుపల్లి నియోజకవర్గంలో రెండేండ్లుగా మమ్మల్ని వదిలిపెట్టి సుమారు 14వేల గడపలు తిరిగి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను గడపగడపకు చేరవేశాడు. నా భర్త చేసే పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా నాకు రావాల్సినటువంటి ఐదు గెజిటెడ్ ఉద్యోగాలను ఇవ్వకుండా అడ్డుకుంది. ఐదేండ్లుగా సమర్థవంతంగా నేను చేసే కాంట్రాక్టు ఉద్యోగం రంగారెడ్డి జిల్లా స్టడీ సర్కిల్ గౌరవ డైరెక్టర్ ఉద్యోగం నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తొలగించారని అడిగితే నీ భర్త మానవతారాయ్ టీవీ డిబేట్లో సీఎంను, ఆయన కుటుంబ సభ్యులని దూషిస్తే నీకెందుకు ఉద్యోగం కొనసాగించాలని సాక్షాత్తు అప్పటి కలెక్టర్ హరీష్ చెప్పడం జరిగింది. నా భర్త పోరాటాలకు నేను బలయ్యాను. ఇన్ని పోరాటాలు త్యాగాలు చేసిన నా భర్త దరఖాస్తు చేసుకున్న సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఓయూ ఉద్యమకారులకు ఇస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆ ప్రకారం తమరు ఇప్పటికే నా భర్తకు ప్రకటించాల్సి ఉంది. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే నా భర్తను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంలో జాప్యం చేయటం మమ్మల్ని బాధిస్తుంది. మాల సామాజిక వర్గానికి చెందిన మానవతారాయ్ కుల సమీకరణ విషయంలో మీరు వేరే ఆలోచన చేసినట్లయితే నేను మాదిగను. నా భర్త త్యాగాలకు బదులు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా నాకు అవకాశం ఇవ్వండి. మాల, మాదిగ రెండు సామాజిక వర్గాలు సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చే అంశం ఇది. నాకు అవకాశం కల్పించినట్లయితే భార్యాభర్తలం ఇరువురం సంపూర్ణంగా ప్రజాసేవకు అంకితం అవుతాం' అని అధిష్టానికి లేఖ రాశారు.

డీఎస్సీ రాతపరీక్షల తేదీలు ప్రకటించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ రాతపరీక్షల తేదీలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో గతంలో ప్రకటించిన డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడ్డాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాతపరీక్షలను నిర్వహించాలనీ, అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. అవి ప్రకటిస్తే అభ్యర్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుందని పేర్కొన్నారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,850	▼	550
22 క్యారెట్లు	56,700	▼	500
కిలో వెండి	78,200	▼	300



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

కమ్యూనిస్టులే 'ప్రజాపక్షం'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజాపక్షమే ఉంటారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా అన్నారు. పాలకవర్గాలు వారిని జైళ్లకు పంపినా, హత్యలు చేసినా, ఎలాంటి కఠిన నిర్బంధాలకు గురిచేసినా, అంతిమంగా సామాన్యుల కోసమే పోరాటాలు చేస్తారని గుర్తుచేశారు. మంగళవారం బండ్ల గూడ నాగోల్‌లోని గిరిప్రసాద్ భవన్‌లో నవచేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో 'ప్రజాపక్షం' దినపత్రిక ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రస్తుతం దేశం బహుళ సంక్షోభాలను ఎదుర్కొంటున్నదనీ, బీజేపీని అధికారానికి దూరం చేస్తేనే విముక్తి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన, ఆర్థిక విధానాలు దేశానికి వినాశనం అయితే, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ లక్ష్యం కమ్యూనిస్టులను అణచివేయడమేననీ, అదే సమయంలో దేశంలో ఫాసిస్టు భావజాలాన్ని వ్యాప్తిచేయడం బీజేపీ లక్ష్యమని విశ్లేషించారు. ఈ ముప్పేట దాడిని ప్రజాబలంతో ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. దీనికోసమే సీపీఐ, సీపీఎం ఇతర కమ్యూనిస్టుపార్టీలు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాయన్నారు. మోడీ విధానాల వల్ల 125 దేశాల అంతర్జాతీయ ఆకలి సూచిలో భారతదేశం 111వ స్థానంలో ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రజలపై ఉందన్నారు. వారిని ఆ మార్గంలో చైతన్యవంతుల్ని చేసేందుకు కృషి చేస్తామన్నారు. అమెరికా సామ్రాజ్యవాద సహకారంతో ఇజ్రాయిల్... పాలస్తీనాపై దాడి చేస్తే, ఐక్యరాజ్య సమితి ఓటింగ్‌కు మోడీ నేతృత్వంలోని భారతదేశం దూరంగా ఉండటం విచారకరమని అన్నారు. పాలస్తీనాకు కమ్యూనిస్టులు సంఘీభావం తెలుపు తున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏనాడూ పోరాటాలు చేసిన చరిత్ర లేదనీ, ప్రజల పక్షాన నిలిచి వారికోసం త్యాగాలు చేసిన ఘనత కమ్యూనిస్టులదేనని అన్నారు. ఇప్పుడలాంటి పోరాట చరిత్రల్ని ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరిస్తున్నదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకైనా కమ్యూనిస్టులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. పత్రికలు సామాన్య ప్రజల పక్షాన నిలవాలనీ, కార్పొరేట్ల కొమ్ము కాయడం సరి కాదని హితవు పలికారు. 'ప్రజాపక్షం' కచ్చితంగా ప్రజల పక్షానే నిలుస్తూ, మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రజాపక్షం సంపాదకులు కే శ్రీనివాసరెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీని సన్మానించారు.

ప్రతిపక్ష నేతల ఫోన్లు హ్యాక్ !

న్యూఢిల్లీ : జర్నలిస్టులు, ఇండియా ఫోరం నేతల ఫోన్లు హ్యాక్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ పలువురు నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ మేరకు తమకు యాపిల్ కంపెనీ నుండి అలర్ట్ మెసేజ్‌లు వచ్చాయని వారు తెలిపారు. "మీ ఐ ఫోన్లు హ్యాక్ అయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే హ్యాకర్లు మీ ఐ ఫోన్‌ను హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మీ ఫోన్లోని సున్నితమైన సమాచారంతో పాటూ కమ్యూనికేషన్లు, కెమెరా, మైక్రోఫోన్ వంటివన్నీ వారి అధీనంలోకి వెళ్ళే అవకాశం వుంది." అన్నది ఆ హెచ్చరికల సారాంశంగా వుంది. దయచేసి ఈ హెచ్చరికను తీవ్రంగా పరిగణించాలంటూ ఆ అలర్ట్ మెసేజ్ కోరుతోంది. దేశంలో ఒకే సమయానికి (అక్టోబరు 30, 11.45 పీఎం) ఐదుగురు వ్యక్తులకు ఇలాంటి అలర్ట్ వచ్చింది.

ఫోన్లకు ఇలాంటి హెచ్చరికలు వచ్చిన వారిలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, కె.సి.వేణుగోపాల్, శశిథరూర్, రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), కె.టి.రామారావు(బీఆర్ఎస్), అసదుద్దీన్ ఓవైసీ, సిద్ధార్థ్ వరదరాజన్ (ది వైర్ వ్యవస్థాపక సంపాదకులు), శ్రీరామ్ కర్రి (డక్కన్ క్రానికల్ రెసిడెంట్ ఎడిటర్), రేవతి (ఇండిపెండెంట్ జర్నలిస్ట్), మహువా మొయిత్రా (తృణమూల్), ప్రియాంక చతుర్వేది (శివసేన యూబీటీ) పవన్ ఖెరా (కాంగ్రెస్), రాహుల్ గాంధీ కార్యాలయంలో పనిచేసే పలువురు వున్నారు. దాదాపు 20మంది నేతలు, జర్నలిస్టులు తమకు యాపిల్ నుంచి నోటిఫికేషన్లు వచ్చాయని ధ్రువీకరించారు. ఆ స్క్రీన్ షాట్‌లను వారు సోషల్ మీడియాలో షేర్ చేశారు. తమ ఫోన్లను కేంద్రం హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తోందంటూ వారు తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శించేవారే ఈ హెచ్చరికలు అందుకున్న వారిలో వున్నారు.

దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పత్రికా సమావేశం పెట్టి మాట్లాడారు. అదానీకి కేంద్ర ప్రభుత్వం అమ్ముడైపోయిందన్న విషయం దాచి పెట్టేందుకు మోడీ ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తోందని విమర్శించారు. 'మీకు కావాల్సినదంతా హ్యాక్ చేసుకోండి.' అని ఆయన అన్నారు. 'అయితే మిమ్మల్ని ప్రశ్నించడం మాత్రం మేం ఆపేది లేదు.' అని స్పష్టం చేశారు. కుల గణన నిర్వహించాలంటూ వస్తున్న డిమాండ్ల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇదంతా చేస్తోందన్నారు.

యాపిల్ వివరణ

ఈ వివాదంపై యాపిల్ స్పందిస్తూ ఒక వివరణ ఇచ్చింది. ఈ హెచ్చరిక నోటిఫికేషన్లను అధికారికంగా పనిచేసే ఏ నిర్దిష్ట హ్యాకర్‌కు యాపిల్ ఆపాదించ లేదని తెలిపింది. భారత ప్రభుత్వం ఇందుకు బాధ్యురాలని తాము ప్రత్యేకంగా చెప్పలేదని స్పష్టం చేసింది. అధికారికంగా పనిచేసే హ్యాకర్లు చాలా నైపుణ్యంతో, అత్యంత అధునాతన రీతుల్లో పని చేస్తారు. వారు దాడులు చేసే తీరు కూడా ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వుంటారు. ఇటువంటి దాడులను గుర్తించడమనేది ముప్పుకు సంబంధించిన ఇంటెలిజెన్స్ సంకేతాలపై ఆధారపడి వుంటుంది. ఆ సంకేతాలు తరచుగా తప్పుగా, అసంపూర్ణంగా వుంటాయి. ఆపిల్ నోటిఫికేషన్లు కూడా నకిలీవి కావచ్చు లేదా కొన్నింటిని గుర్తించలేకపోవచ్చు, ఈ అలర్ట్ మెసేజ్‌లు జారీ చేయడానికి గల కారణాలేంటనే సమాచారం మేం ఇవ్వలేం. దానివల్ల హ్యాకర్లు భవిష్యత్తులో తమను గుర్తు పట్టకుండా తమ తీరును మార్చుకోవచ్చు," అని పేర్కొంటూ ఒక ప్రకటన జారీ చేసింది. ఈ అలర్ట్‌ల గురించి కేంద్ర ప్రభుత్వం తమను అడిగిందా లేదా అని ప్రశ్నించగా దానిపై యాపిల్ స్పందించలేదు. ఇటువంటి అలర్ట్‌లు 150దేశాల్లోని వారికి వచ్చాయని తెలిపింది.

దర్యాప్తు చేపట్టాం : కేంద్రం

యాపిల్ ఫోన్లకు వచ్చిన హెచ్చరికలపై కేంద్రం దర్యాప్తు చేపట్టిందని సమాచార సాంకేతిక మంత్రి అశ్విని వైష్ణవ్ భోపాల్‌లో విలేకర్లకు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం తీవ్రంగా ఆందోళన చెందుతోందని చెప్పారు.

ఏదో ఒక అంశంపై ప్రభుత్వాన్ని విమర్శించేందుకే వున్న విమర్శకులతో ప్రతి రోజూ తెల్లారుతోంది అంటూ వ్యాఖ్యానించారు. ఈ దేశం అభివృద్ధి చెందుతుంటే చూడలేరని అన్నారు. యాపిల్ నోటిఫికేషన్లు నిర్దిష్టంగా లేవని, అస్పష్టంగా వున్నాయని అన్నారు. అసలు యాపిల్ ఫోన్లు భద్రత కలిగినవా కాదా అని నిర్ధారించు కోవాల్సి వుందని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్య విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి హ్యాకర్లు ప్రయత్నిస్తున్నారంటూ సోమవారం రాత్రి తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఏచూరి ఆ లేఖలో తెలిపారు. పౌరులందరికీ భారత ప్రభుత్వం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఇది ఘోరంగా ఉల్లంఘించడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. నిఘా అనేది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తన పని, కార్యకలాపాలనేవి తెరిచిన పుస్తకం వంటివని, అందులో దాచిపెట్టడానికి ఏమీ లేదన్నారు. అందువల్ల ఇలాంటి నిఘా, తాను ఉపయోగించే ఫోన్‌ను యాక్సెస్ చేసేందుకు ప్రయత్నించడం ఇవన్నీ చూస్తుంటే తన ఫోన్లో ఏదో సమాచారాన్ని పెట్టి ఆ కల్పిత సమాచారం ప్రాతిపదికన తనను ఇరికించడానికి ప్రయత్నించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా వుందని భావించాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను దారుణంగా దుర్వినియోగం చేస్తోందని, దాన్ని దృష్టిలో పెట్టుకుంటే దీనికి కూడా అవకాశాలు వున్నాయన్నది వాస్తవమని అన్నారు. మొత్తంగా ఈ అంశంపై ప్రభుత్వ స్పందనను తెలుసుకోవాలని భావిస్తున్నానన్నారు.

పౌరుల గోప్యత, భద్రతను పరిరక్షించడంలో భారత ప్రభుత్వం తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తుందని చెప్పారు. ఈ అలర్ట్ మెసేజ్‌లకు సంబంధించిన వాస్తవిక, కచ్చిత సమాచారం రాబట్టేందుకు దర్యాప్తులో తమతో చేతులు కలపాల్సిందిగా యాపిల్‌ను కోరినట్లు చెప్పారు.

సీరియస్‌గా తీసుకోవాల్సిందే : ఐఎఫ్ఎఫ్

"యాపిల్ నుండి వచ్చిన హెచ్చరిక నోటిఫికేషన్లను చాలా సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం వుంది. దీనికి మూలం ఏమిటో నిర్ధారించాల్సి వుందని ఇంటర్‌నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) పాలసీ డైరెక్టర్ ప్రతీక్ వాఘ్రే, వైర్‌తో వ్యాఖ్యానించారు. భారతీయులు ముఖ్యంగా జర్నలిస్టులు, పార్లమెంటేరియన్లు, రాజ్యాంగ పదవుల్లో వున్నవారు గతంలో కూడా పెగాసస్‌తో లక్ష్యం చేసుకోబడ్డారు. ఈ నేపథ్యంలో ఇది మన ప్రజాస్వామ్యానికి తీవ్రంగా ఆందోళన కలిగించే అంశమేనని అన్నారు. ఐఎఫ్ఎఫ్ వ్యవస్థాపక డైరెక్టర్ అపర్ గుప్తా ఎక్స్‌లో పోస్ట్ పెడుతూ వీటిని తప్పుడు అలారమ్‌లుగా ఎందుకు పరిగణించలేమో వివరించే ప్రయత్నం చేశారు.

సవాళ్లను అవకాశాలుగా భావించండి

- విద్యార్థులతో గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా భావించాలనీ, వాటిని వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. మంగళవారం కన్యాకుమారి జిల్లా కులుశేఖరం ధరయాంబిక విద్యా మందిర్ స్కూల్‌కు చెందిన 50 మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవిస్తూ తమ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె తన జీవితానుభవాలను వారికి వివరించారు. విద్యార్థులతో పాటు స్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులున్నారు.

ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు పీహెచ్‌డీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విప్, అచ్చంపేట శాసనసభ్యుడు గువ్వల బాలరాజుకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసింది. .మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 83వ స్నాతకోత్సవం సందర్భంగా న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా బాలరాజు స్వీకరించారు. డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో "భారతదేశంలో శాసన సభ్యుల శాసన అధికారాలు - వాటిపై న్యాయ సమీక్ష" అనే అంశంలో గువ్వల పరిశోధన చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అడోబ్ కంపెనీ సీఈవో శాంతన్ నారాయణ్ ఆయనకు పట్టాను అందజేశారు. యూనివర్సిటీ ఛాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ తమిళిసై , ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రవీందర్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాములు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ టెస్టులను వాయిదా వేయాలి

- టీఎస్‌పీఎస్సీకి టీజీజేఎల్‌ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఈనెల 17 నుంచి 25 వరకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్టులను వాయిదా వేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్‌ఏ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ బి జనార్ధన్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు.

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 17,18,19 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు జిల్లాల్లో రెండో విడత శిక్షణా కార్యక్రమాల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అదే సమయంలో టీఎస్‌పీఎస్సీ వివిధ డిపార్ట్‌మెంటల్ టెస్టులకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. అందుకోసం ఉద్యోగులు అనేక మంది దరఖాస్తు చేశారని వివరించారు. దీంతో ఎన్నికల విధుల్లో ఉండే వారు ఇబ్బందులు పడతారని తెలిపారు. వారికి నష్టం లేకుండా టీఎస్‌పీఎస్సీ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌ఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్‌ఎస్)కు 2023-24 విద్యాసంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల ఏడో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల ఏడో తేదీ వరకు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో అమ్మకానికి
81.5 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత వివరాలు

న్యూఢిల్లీ : 81.5 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత వివరాలను ఇటీవల డార్క్ వెబ్ ఫోరంలో అమ్మకానికి ఉంచినట్టు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లోని కొన్ని మీడియా సంస్థల కథనాల ప్రకారం.. కోట్లా మంది భారతీయుల వివరాలు ఉన్న లింక్‌ను అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ రెసెక్యూరిటీ వెల్లంచింది. అక్టోబర్ ప్రారంభంలోనే వివరాలు అమ్మకానికి ఉంచినట్టు తెలిపింది. అమ్మకానికి ఉంచిన వ్యక్తిగత వివరాల్లో ఆధార్ సంఖ్య, పాస్‌పోర్ట్, పేర్లు, ఫోన్ నంబర్లు, తాత్కాలిక, శాశ్వత చిరునామాలు.. వంటి వివరాలు ఉన్నాయి. పిడబ్ల్యుఎన్0001 అనే పేరుతో హ్యాకర్ ఈ వివరాలను అమ్మకానికి ఉంచాడు. రెసెక్యూరిటీకు చెందిన విచారణ విభాగం హంటర్ విక్రేతను సంప్రదించగా.. మొత్తం డేటా సెట్‌ను 80 వేల డాలర్లకు విక్రయిస్తానని తెలిపాడు.

అయితే ఈ వివరాలను హ్యాకర్ ఎలా పొందాడో అనే విషయాన్ని రెసెక్యూరిటీ వెల్లడించలేదు. అయితే దేశంలో అత్యున్నత వైద్య సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) నుంచి హ్యాకర్ ఈ డేటాబేస్‌ను చోరీ చేసి ఉంటాడని ఊహాగానాలు వెల్లడవుతున్నాయి. కాగా, కోట్లాది మంది భారతీయులు వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచడంపై ఉన్నతస్థాయి అధికారులు అప్రమత్తమయ్యారని మీడియా నివేదికలు తెలిపాయి.

సీబీఐ దీనిపై దర్యాప్తు ప్రారంభించే అవకాశముందని పేర్కొన్నాయి. కాగా, మీడియాలో వస్తున్న కథనాలను నిర్ధారించడానికి లేదా తిరస్కరించడానికి ఐసీఎంఆర్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిరాకరించాయి. అలాగే, ఐసీఎంఆర్‌ను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాదిలోనే ఐసీఎంఆర్ సర్వర్‌లోకి వెళ్లడానికి హ్యాకర్లు 6 వేల సార్లు ప్రయత్నించారు. దీంతో డేటా లీక్‌లను నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఐసిఎంఆర్‌ను దర్యాప్తు సంస్థలు కోరాయి.

అక్టోబర్ 31 వేడుకల రోజు కాదు : తరిగామి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో అక్టోబర్ 31 వేడుకలకు రోజు కాదని సీపీఐ(ఎం) నాయకులు మహ్మద్ యూసుఫ్ తరిగామి స్పష్టం చేశారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేశారని, సివిల్ సెక్రటేరియట్ నుంచి జెండాను తొలగించారని.. ఇలాంటి పనులు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోకుండా అక్టోబర్ 31ని ఐక్యతా దినోత్సవంగా ప్రకటించిందని తరిగామి మంగళవారం విమర్శించారు. జమ్ముకాశ్మీర్‌లో సామాన్య ప్రజలకు అభివృద్ధి, ఉద్యోగాలు, జీవనోపాధి ఎక్కడా.. అని తరిగామి ప్రశ్నించారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని విడదీసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా డౌన్‌గ్రేడ్ చేస్తే.. ఇది వేడుక ఎలా అవుతుందని కూడా ఆయన ప్రశ్నించారు.

బిజెపి ప్రభుత్వం త్వరలో జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని పార్లమెంట్‌లో హామీ ఇచ్చిందని తరిగామి గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ రాష్ట్రాన్ని కూడా కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించలేదని, ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉన్నవి రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేస్తున్నాయని తరిగామి తెలిపారు. జమ్ము, కాశ్మీర్, లడఖ్ ప్రజలను అవమానించిన బిజెపి వేడుకలు జరుపుకోంటుందని విమర్శించారు. 2019 ఆగస్టు 5న చేసిన రాజ్యాంగ విరుద్ధమైన ఎత్తుగడలకు వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తరిగామి తెలిపారు.

సాకు దొరికింది

- యాదాద్రికి పర్యావరణ అనుమతుల్లో జాప్యం
- అందుకే బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు
- మీడియాకు టీఎస్‌జెన్‌కో లీకులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బహిరంగ మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సాకు దొరికింది. టీఎస్‌జెన్‌కో నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల వ్యవస్థాపిత సామర్థ్యంతో కూడిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం వల్ల, రాష్ట్ర అవసరాల కోసం బయటి నుంచి కరెంటు కొంటున్నామని టీఎస్‌జెన్‌కో అధికారులు చెప్తున్నారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు లీకులు అందించారు. చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) అనుమతితో, రూ.34,500 కోట్ల నిర్మాణ వ్యయంతో 2017 అక్టోబర్ 10న ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. అయితే ఎన్‌జీటీ క్లియరెన్స్‌పై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 9 నెలలు స్టే విధించారనీ, ఆ గడువు ముగిసిపోయినా, ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. దీనివల్ల రాష్ట్రంలో వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించేందుకు బహిరంగ మార్కెట్ నుంచి అధిక ధరలకు కరెంటు కొంటున్నామని ఆ లీకుల్లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఈ ప్రాజెక్ట్ పనుల్ని ఆలస్యం చేస్తున్నదని చెప్తున్నారు. అయితే నెలరోజుల్లోపు అనుమతులు ఇవ్వాలని ఎన్‌జీటీ చెప్పినా, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పందించని కారణంగా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించినట్టు పేర్కొన్నారు. టీఎస్‌జెన్‌కో తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ జే .రామచందర్‌రావు, సీనియర్ న్యాయవాది వై రామారావు, వై సంకల్ప్‌లు వాదనలు వినిపించినట్టు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టండి

- పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి ఈయూ వినతి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కాంగ్రెస్‌పార్టీ దృష్టి పెట్టాలని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, డీ విద్యాసాగర్ పీసీసీ అధ్యక్షులు ఏ రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నాలుగు పేజీల వినతిపత్రంలో ఆర్టీసీ కార్మికులకు రావల్సిన ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వంలో విలీనం అయ్యాక పరిష్కరించాల్సిన అంశాలు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, పెరిగిన అద్దె బస్సులు, కారుణ్య నియామకాలు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) చేసిన ఉద్యోగుల సమస్యలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఆయా సమస్యల్ని కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. ఆ లేఖను మ్యానిఫెస్టో కమిటీకి పంపుతామని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చెప్పారు.

టికెట్ ఇస్తామన్నా..ఎవ్వరూ రారే

పోటీ చేసే అవకాశమిచ్చినా బీఆర్ఎస్‌లో చేరిన బిత్తిరి సత్తి

- బీసీ సంఘం నేతకు బీజేపీ గాలం
- డైలమాలో జాజుల శ్రీనివాస్‌గౌడ్
- రాజగోపాల్‌రెడ్డిపై ఫోకస్ పెట్టినా బలమైన నేత దొరకని వైనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆయా పార్టీల అసంతృప్తులను దగ్గరకు తీయడంలో బీజేపీ పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ పార్టీ సెకండ్ లిస్టు తర్వాత ఆ పార్టీ నుంచి కమలం చెంతకు అసంతృప్తులు చేరుతారన్న ఆ పార్టీ ఆశలు అడియాశలయ్యాయి. బీఆర్ఎస్‌లో టికెట్ దక్కనివారు కాంగ్రెస్‌లోకి...హస్తం పార్టీలో అభ్యర్థిత్వం ఖరారు కాని నేతలు కారెక్కుతున్నారుగానీ బీజేపీ వైపు ఎవ్వరూ చూడటం లేదు. దీంతో ఆ పార్టీకి బలమైన అభ్యర్థులు కరువయ్యారనే చర్చ బలంగా నడుస్తున్నది. సంస్థాగతంగా బలం లేకున్నా వలసపార్టీల నేతలను నమ్ముకున్న కమలం పార్టీ ఎన్నికల గోదా వచ్చేసరికి వాడిపోయింది. ఇప్పుడు మూడో జాబితాలో గెలుపు గుర్రాల్లేక కనీసం తమ పార్టీ బరిలో ఉన్నాడని చెప్పేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. ముదిరాజ్‌ల సభలో బిత్తిరి సత్తి(చేవెళ్ల రవికుమార్) ఓస్థాయిలో మాట్లాడి చర్చనీయాంశం అయ్యారు. దీంతో ఆయన ప్రభుత్వ వ్యతిరేక పార్టీలో చేరి రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తారని ఊహాగానాలు వెల్లువెత్తాయి. బీజేపీ కీలక నేతలు బిత్తిరి సత్తితో చర్చలు కూడా జరిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు స్థానాల్లో ఎక్కడ నుంచైనా బరిలో నిలిచే అవకాశం అతనికే వదిలేసింది. బీజేపీ ఆఫర్‌ను ఆయన సున్నితంగా తిరస్కరించారు. అదే సమయంలో కారు పార్టీ చక్రం తిప్పడంతో ఆయన అంతే వేగంగా బీఆర్ఎస్‌లో చేరిపోయారు. నల్లగొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నికతో రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూసి బీజేపీ బొక్కబోర్లా పడిన విషయం తెలిసిందే. యుద్ధానికి బరిలోకి దూకేముందు కత్తిని కింద పడేసి ఎదుటిపక్షంలో చేరిన రాజగోపాల్‌రెడ్డిని ఎలాగైనా ఓడగొట్టాలని బీజేపీ శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నది. బూరనర్సయ్యగౌడ్, మనోహర్‌రెడ్డిలను బరిలోకి నిలపాలని చూసినా వారు అనాసక్తి చూపుతున్నారు. ఆ స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను దెబ్బతీసేలా సామాజిక కోణంలో బలమైన అభ్యర్థిని వెతికే బాధ్యతను ఈటలకు అప్పజెప్పింది. ఈ క్రమంలోనే ఈటల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో చర్చలు జరిపారు. కానీ, తన భవిష్యత్ ఎదుగుదలరీత్యా ఆయన వెనుకాముందు ఆలోచిస్తున్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం సమావేశం జరిగిన తర్వాత తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఈటల వద్ద జాజుల చెప్పినట్టు తెలిసింది. అయితే, ఆయన్ను ఎలాగైనా ఒప్పించాలని భిన్న రూపాల్లో ప్రయత్నాలను బీజేపీ చేస్తున్నది. గురువారం నాటికి ఈ విషయంలో స్పష్టత రాకపోతే కాంగ్రెస్ అసంతృప్త నేత చల్లమల కృష్ణారెడ్డికి బీజేపీ టికెట్ ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ అసంతృప్త నేతలు నాగం జనార్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్యలను పార్టీలోకి రప్పించడంలోనూ చేరికల కమిటీ పూర్తిగా విఫలమైందనే చర్చ బీజేపీ శ్రేణుల్లో నడుస్తున్నది.

కమ్యూనిస్టులతోనే కాంగ్రెస్ జోరు

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలితే 'హస్త'వ్యస్తమే..!

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోటీకి ఉభయ కమ్యూనిస్టుల కసరత్తు
- ఇప్పటికే అభ్యర్థులు... నామినేషన్లపై సీపీఐ(ఎం) స్పష్టత

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లాను కాంగ్రెస్ కంచుకోటగా భావిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచింది ఒక్కొక్క స్థానమే. రాష్ట్రవ్యాప్తంగా 'కారు'జోరు ఉన్నా ఖమ్మంలో మాత్రం భిన్నమైన పరిస్థితే ఉంది. 2014లో కొత్తగూడెం, 2018లో ఖమ్మం అసెంబ్లీ స్థానాలను మాత్రమే బీఆర్ఎస్ గెలుచుకోగలిగింది. కానీ ఆ తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను కేసీఆర్ తమవైపు తిప్పుకున్నారు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలే బీఆర్ఎస్ పార్టీకి బలంగా మారారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వంటి కీలక నేతలు 'కారు' దిగి కాంగ్రెస్‌లో చేరడంతో పూర్వ వైభవం సంతరించుకుంటోందనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కీలకంగా ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు చేదోడువాదోడుగా ఉంటున్నారు. కానీ కమ్యూనిస్టు పార్టీల పట్ల బూర్జువా పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై ఉభయ కమ్యూనిస్టు శ్రేణుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.



కాంగ్రెస్, వైఎస్ఆర్‌సీపీల విజయంలో కమ్యూనిస్టుల పాత్రే

ఖమ్మంలో కమ్యూనిస్టులుంటేనే గెలుపు...

ఉభయ ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులుంటేనే గెలుపు అనే విషయాన్ని గడిచిన రెండు ఎన్నికలు రుజువు చేశాయి. పది నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి పది నుంచి 40వేలకు పైగా ఓటు బ్యాంకు సీపీఐ(ఎం), సీపీఐలకు ఉంది. ఆ ఓటు బ్యాంకే ఆయా పార్టీల గెలుపోటములను నిర్దేశిస్తోంది. భద్రాచలం, కొత్తగూడెం, పాలేరు, మధిర, వైరా తదితర నియోజకవర్గాల్లో ఉభయ కమ్యూనిస్టులు బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో 30 నుంచి 40వేల ఓటు బ్యాంకు కమ్యూనిస్టులకు ఉంది. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో పది నుంచి 20వేల వరకు ఓటు బ్యాంకును ఈ పార్టీలు కలిగి ఉన్నాయి. డబ్బు రాజకీయాలు, స్థానిక వైరుధ్యాలతో కమ్యూనిస్టుల ఒంటరి పోరాటం ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు కానీ గెలుపోటములను నిర్ధారించడంలో ఈ పార్టీలే కీలకమనే విషయాన్ని గత ఎన్నికలు నిరూపించాయి.

బూర్జువా పార్టీలతో తీరుతో కమ్యూనిస్టు కేడర్‌లో పట్టుదల...

కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరుతో కమ్యూనిస్టు శ్రేణుల్లో పట్టుదల పెరుగుతోంది. కమ్యూనిస్టుల విషయంలో దాని తీరు ఆక్షేపణీయంగా ఉంది. డబ్బు రాజకీయాలు, స్థానిక వైరుధ్యాలు ముందుకొచ్చి బూర్జువా పార్టీలతో ఎన్నికల పోటీలో వెనుకబడుతున్నా గెలుపోటముల్లో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిది. పదికి పది స్థానాలు గెలవాలని భావిస్తున్న పార్టీలకు కమ్యూనిస్టుల సహకారం లేకుండా సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ఉభయ కమ్యూనిస్టులం కలిసి పోటీకి సమాయత్తం అవుతున్నాం. ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థులు, స్థానాలు, నామినేషన్లు తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటాం.

నున్నా నాగేశ్వరరావు,
సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి

పొత్తు పేరుతో దగా..

రాష్ట్రంలో మతతత్వ బీజేపీని నిలువరించాలనే ఏకైక లక్ష్యంతో లౌకికశక్తుల ఐక్యతకు కమ్యూనిస్టులు పాటుపడు తున్నారు. దీనిలో భాగంగా బీజేపీని బలంగా ఎదుర్కోగల శక్తులతో జట్టు కడుతున్నారు. మునుగోడు ఉప ఎన్నికల పొత్తు ఈ కోవలోనిదే. కమ్యూనిస్టులతో పొత్తు లేకుంటే బీజేపీని నిలువరించడం 'కారు'కు కష్టమయ్యేదని ఆ ఎన్నికల ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఇదే విషయాన్ని కేసీఆర్ సైతం అంగీకరించారు. కానీ ఆ తర్వాత కేసీఆర్ వ్యక్తిగత, రాజకీయ అవసరాల కోసం బీజేపీకి దగ్గరయ్యారు. అంతే కాక మరో మతతత్వ పార్టీ ఎంఐఎంతోనూ ఈ ఎన్నికల్లో చెలిమి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయంగా ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్, కమ్యూనిస్టులకు స్నేహం 'హస్తం' చాచింది. కానీ పొత్తులు, సీట్ల పంపకాల విషయంలో కమ్యూనిస్టుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఆ సీటు ఈ సీటంటూ హైడ్రామా కొనసాగించి చివరకు ఉభయ కమ్యూనిస్టులకు ఇచ్చే చెరి రెండు స్థానాలను తేల్చడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై కమ్యూనిస్టు శ్రేణులు మండిపడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక శక్తులకు కమ్యూనిస్టుల అవసరం ఏంటో...సత్తా ఏంటో తెలియాలనే పట్టుదలను సీపీఐ(ఎం), సీపీఐ శ్రేణులు కనబర్చుతున్నాయి.

రాజకీయ ప్రత్యర్థిగా వ్యవహరిస్తున్నారు

= గవర్నర్ రవికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో

తమిళనాడు పిటిషన్



న్యూఢిల్లీ : అసెంబ్లీ ఆమోదించిన కీలకమైన బిల్లులను పరిశీలించి, ఆమోదించడంలో విఫలమై.. రోజువారీ పాలనకు ఆటంకం కలిగిస్తూ 'రాజ్యాంగ ప్రతిష్టంభన' సృష్టించినందుకు గవర్నర్ ఆర్ఎన్ రవిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసింది. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి 'రాజకీయ ప్రత్యర్థి'గా గవర్నర్ రవి తనను తాను వ్యక్తం చేసుకుంటున్నారని పిటీషన్‌లో తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. 'రిమిషన్ ఉత్తర్వులు, రోజువారీ ఫైళ్లు, అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు, నియామక ఉత్తర్వులను ఆమోదించడం, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులుపై సంతకాలు చేయకపోవడం, అవినీతికి పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యేలపై సిబిఐ విచారణకు అనుమతించకపోవడం మొత్తం పరిపాలను స్థంభింపజేస్తోంది. రాష్ట్ర పరిపాలనకు సహకరించకుండా విరోధి వైఖరిని సృష్టిస్తోంది' అని తమిళనాడు ప్రభుత్వం తన పిటీషన్‌లో పేర్కొంది. తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు పి. విల్సన్, శబరీష్ సుబ్రమణియన్ ఈ పిటీషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. రాజ్యాంగ ఆదేశాలను పాటించడంలో గవర్నర్ నిర్లక్ష్యం, ఆలస్యం, వైఫల్యాన్ని చట్టవిరుద్ధంగాను, ఏకపక్షంగాను ప్రకటించాలని తమిళనాడు ప్రభుత్వం తన పిటీషన్‌లో విజ్ఞప్తి చేసింది. గవర్నర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ప్రభుత్వ ఉత్తర్వులను ఆమోదించడానికి వ్యవధి లేదా సమయ పరిమితిని నిర్ణయించాలని కూడా తమిళనాడు ప్రభుత్వం కోరింది. ఖైదీల కారుణ్య విడుదలకు కూడా గవర్నర్ ఆమోదం ఇవ్వడానికి జాప్యం చేస్తున్నారని తెలిపింది. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎన్‌పిఎస్‌సి) ఛైర్మన్, సభ్యుల నియామకం కోసం ప్రభుత్వం చేసిన దరఖాస్తులు కూడా గవర్నర్ వద్ద ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పిటీషన్‌లో గుర్తు చేసింది. దీంతో టిఎన్‌పిఎస్‌సి కేవలం నలుగురు సభ్యులు, ఛైర్మన్ లేకుండా పనిచేస్తుందని తమిళనాడు ప్రభుత్వం తెలిపింది.

ఉమర్ ఖలీద్ పిటీషన్‌పై స్పందించండి

కేంద్రానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : చట్ట వ్యతిరేక కార్యక్రమాలు (నిరోధక) చట్టంలోని వివిధ నిబంధనలను సవాల్ చేస్తూ జెఎన్‌యు మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ వేసిన పిటీషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పిటీషన్‌ను ఇలాంటి ఇతర పిటీషన్లతో కలిపి నవంబర్ 22న విచారిస్తామని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేల ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. అలాగే ఫిబ్రవరి 2020 ఢిల్లీ అల్లర్లుకు సంబంధించి ఉపా చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ కోరుతూ ఉమర్ ఖలీద్ వేసిన పిటీషన్‌ను కూడా అదే రోజు విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. 2020 ఢిల్లీ అల్లర్లులో 53 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ అల్లర్లపై ఉమర్ ఖలీద్‌తో సహా షర్జీల్ ఇమామ్, ఇంకా అనేక మందిపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 2020లో ఖలీద్‌ను అరెస్టు చేశారు.


కీలక రంగాల మందగమనం

న్యూఢిల్లీ : ఎనిమిది ప్రధాన మౌలిక వసతుల రంగాల ఉత్పత్తిలో మందగమనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌లో వీటి పెరుగుదల 8.1 శాతానికి పరిమితమై.. నాలుగు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. గతేడాది ఇదే నెలలో 8.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, సిమెంట్, విద్యుత్ రంగాలు స్తబ్దతను చవి చూశాయని మంగళవారం కేంద్ర ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. ముడి చమురు ఉత్పత్తి 0.4 శాతానికి తగ్గింది. గతేడాది ఇదే నెలలో 2.3 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో కీలక రంగాల ఉత్పత్తి 7.8 శాతానికి పడిపోయింది. గతేడాది ఇదే కాలంలో 9.8 శాతం వృద్ధిచోటు చేసుకుంది.

గాజాకు ఆహారాన్ని పంపించిన బ్రెజిల్ సామాజిక ఉద్యమం

బ్రసీలియా : ఇజ్రాయిల్ ఆంక్షలతో, దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న గాజా ప్రజలకు రెండు టన్నుల ఆహారాన్ని బ్రెజిల్‌లోనే అతిపెద్ద సామాజిక ఉద్యమమైన ది ల్యాండ్‌లెస్ రూరల్ వర్కర్స్ మూవ్‌మెంట్ (ఎంఎస్‌టీ) పంపించింది. ఇంకా మరింత సాయాన్ని పంపాలని భావిస్తున్నట్లు ప్రకటించింది. మొదటి విడత సాయం సోమవారం బయలుదేరింది. వ్యవసాయ సంస్కరణలకు కేటాయించిన ఎంఎస్‌టీ ఏరియాలపై ఆధారపడి జీవించే కుటుంబాలు ఉత్పత్తి చేసిన బియ్యం, మొక్కజొన్న పిండి, పాలును తీసుకుని బ్రెజిల్ వైమానిక దళానికి చెందిన విమానం గాజా వెళ్ళింది. ఈ మూవ్‌మెంట్ అందచేస్తున్న ఇతర సరఫరాలు కూడా ఇప్పటికే అందుబాటులో వున్నాయి. ఈ సరుకును తీసుకెళ్ళడానికి ముందుకొచ్చే విమానాల కోసం ఎదురుచూస్తున్నాయి. వంద టన్నుల వరకు సాయాన్ని పంపాలన్నది లక్ష్యంగా వుందని ఎంఎస్‌టిజాతయీా నాయకత్వ సభ్యుడు కేసియా బెచారా చెప్పారు. దేశవ్యాప్తంగా గల ఎంఎస్‌టి కుటుంబాలు ఈ సంఘీభావ చర్యలో పాలుపంచుకున్నాయి. భూమి లేని ఈ నిరుపేద కుటుంబాలన్నీ పాలస్తీనియన్ల పోరాటానికి, గాజా ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు సమీకృతమయ్యాయి. ఆహారాన్ని విరాళంగా అందచేయడమే కాకుండా, వివిధ రకాల కార్యకలాపాలు, చర్యలు, సమీకరణలతో కూడా వారు సంఘీభావం తెలియచేశారని బెచారా తెలిపారు. గాజాలో రైతు కుటుంబాలకు అంతర్జాతీయ విరాళాలు అందచేయడంలో కూడా ఈ మూవ్‌మెంట్ పాల్గొంటోంది.

కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసింది. నవంబరు 2న తమ ఎదుట హాజరు కావాలని పేర్కొంది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22 (ప్రస్తుతం రద్దైంది) రూపకల్పన, అమలులో పలు అవకతవకలకు పాల్పడినట్లు సిబిఐ ఆరోపించింది. ఈ ఆరోపణలపై నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) నిబంధనల కింద కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఇడి తెలిపింది. దీనికి సంబంధించి కేజ్రీవాల్‌ను దర్యాప్తు సంస్థ ప్రశ్నించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయనుంది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ ఈ ఏడాది ఏప్రిల్ 16న సుమారు తొమ్మిది గంటలపాటు ప్రశ్నించి కేజ్రీవాల్ వాంగ్మూలాన్ని రికార్డు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిబిఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, 'డర్టీ పాలిటిక్స్' ఫలితమే ఈ ఆరోపణలని కేజ్రీవాల్ మీడియాతో అన్నారు. ఇదే కేసులో ఇప్పటికే ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్‌లు జైలులో ఉన్నారు.

ఎన్నికల బాండ్లతో రహస్య వ్యాపారాలు !

= సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : అధికారంలో వున్నవారితో రహస్యంగా వ్యాపారం చేసేందుకు సంపన్నులు ఎలక్టోరల్ బాండ్లను ఉపయోగించుకునే అవకాశం వుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పాలక రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా అజ్ఞాతంగా క్విడ్ ప్రో కో లోకి ప్రవేశించేందుకు గానూ రెగ్యులర్ బ్యాంకింగ్ మార్గం ద్వారా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసేందుకు వీలుందని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం పేర్కొంది. ధ్రువీకరించిన ఖాతాలు కలిగిన వ్యక్తులను ప్రభావవంతమైన సంస్థలు రహస్యంగా ఏర్పాటుచేసుకునే అవకాశాలు వున్నాయని తెలిపింది. "ఉదాహరణకు 'ఎ' అనే వ్యక్తి రూ.100 కోట్లు విలువ చేసే ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారు. 'బి' కోసం ఏర్పాటు చేయబడిన వ్యక్తే 'ఎ'. ఎందుకంటే 'ఎ' కి నిర్ధారించబడిన కెవైసి అకౌంట్ వుంది. రాజీకయ పార్టీకి విరాళమిచ్చేది 'బి'. కోటి రూపాయలు చొప్పున వంద కోట్లను కొనుగోలు చేసేందుకు 'బి'కి వందమంది వ్యక్తులు వుండవచ్చు కూడా." అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ మొదటి రోజు జరిగిన విచారణలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రసంగిస్తూ, 'ఇటువంటి విషయాల్లో భారతీయుడి మనసు చాలా తెలివిగా వుండగలదు, అనేక రకాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మేం నియంత్రిస్తాం.' అని అన్నారు. కెవైసి ఖాతాదారుల ద్వారా బాండ్లు కొనుగోలు చేయడంతో అసలు విరాళమిచ్చే వ్యక్తి వివరాలు అజ్ఞాతంగా వుంచబడుతున్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఆచరణాత్మక రాజకీయాల్లో ఆ విరాళమిచ్చే వ్యక్తి అనేక మార్గాల్లో తన విరాళం గురించి రాజకీయ పార్టీకి తెలియజేయవచ్చన్నారు. ఇక్కడ విరాళమిచ్చే వారు ఎవరో తెలియకుండా వుంటున్నది ప్రజలకే కానీ రాజకీయ పార్టీకి కాదని చంద్రచూడ్ అన్నారు.

ప్రతిపక్షాల దాతలకు ఉపయోగం

పాలక పార్టీ నుంచి వచ్చే పర్యవసానాలకు భయపడకుండా ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వాలనుకునేవారికి ఈ అజ్ఞాతమనేది ఉపయోగపడుతుందని కోర్టు అభిప్రాయపడింది. 'మీరు దాత పేరు వెల్లడించినట్లైతే, మీరు ఒక రాజకీయ పార్టీకి విరాళమిచ్చారని ఇతర రాజకీయ పార్టీలు కూడా తెలుసుకుంటాయని భావించాల్సి వుంటుంది. ఒకవేళ అధికారంలో లేని పార్టీకి మీరు విరాళమిచ్చారనుకుందాం, ఆ దాతకు ఆ రాష్ట్రంలో వ్యాపారం వుందనుకుందాం, ఆ దాత పేరు అందరికీ తెలిసిపోతుంది. అక్కడ లాజిక్ వుంది. ఈ లాజిక్ చెల్లుబాటు అవుతుందా లేదా అన్నది మనం నిర్ణయించుకోవాల్సి వుంది." అని అన్నారు.

విరాళాల్లో 90శాతం పాలక పార్టీలకే

పిటిషనర్ల తరపున వాదనలు ప్రారంభించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, రాజకీయ పార్టీకి ఇచ్చే విరాళాల గురించి తెలుసుకోవడమనేది ప్రాథమిక హక్కని పేర్కొన్నారు. ఎన్నికల బాండ్లు చట్టబద్ధమైన ముడుపులని ఆయన వ్యాఖ్యానించారు. ఇవి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. విరాళాల్లో 90శాతానికి పైగా పాలక పార్టీలకే వస్తున్నాయన్నారు. ఇప్పటికే జరిగిన లేదా జరగాల్సిన పనుల కోసం ఉద్దేశించబడినవని ఆయన వాదించారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారించాలి

= కేంద్ర మంత్రికి సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వినతి



న్యూఢిల్లీ : పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కారించాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. మంగళవారం నాడిక్కడ పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర గిరిజన మంత్రి అర్జున్ ముండాను సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. మెమోరాండంలో పేర్కొన్న అంశాలను మంత్రికి వివరించింది. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఆర్.అరుణ్‌కుమార్, సీపీఐ(ఎం) అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్, సీపీఐ(ఎం) ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు డి. రమేష్, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

అనంతరం ఏపీ భవన్ వద్ద నేతలు మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పట్ల కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, డిసెంబర్‌లో స్వయంగా ముంపు ప్రాంతాల పర్యటనకు మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. పోలవరంలో ఆదివాసీ చట్టాలు అమలులో లోపాలున్నాయని మంత్రి అంగీకారించారని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణమంటే కాంట్రాక్టర్లకు, ధనికులకు డబ్బులు ఇవ్వడంగా తయారైందని, నిర్వాసితుల హక్కులు చట్టాలన్నీ పోలవరం ప్రాజెక్టు విషయంలో పూర్తిగా తుంగలో తొక్కారని పేర్కొన్నారు. అందుకు మంత్రి డిసెంబర్‌లో మంత్రే స్వయంగా పోలవరం ముంపు ప్రాంతాలలో పర్యటిస్తానని, ప్రజలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి చట్టాలను అమలు జరపడానికి కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. లక్ష కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వకుండానే గిరిజనులను నీటిలో ముంచి ప్రాజెక్టు నిర్మాణం సాగుతుందని పేర్కొన్నారు. గతేడాది వరదల అనుభవాన్ని దృష్టిలోఉంచుకుని తప్పుడు కాంటూరు లెక్కలు పున:పరిశీలించాలని కోరారు. అలాగే 2013 భూసేకరణ చట్టం, అటవీ హక్కుల చట్టం, 5వ షెడ్యూలులో ఉన్న గిరిజన హక్కులు అమలు కావడం లేదనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఉపాధి హామీ పథకం అమలు చేయడం లేదని, 2017 కటాఫ్ డేట్ పెట్టడంవల్ల 18 ఏండ్లు నిండినటువంటివారికి నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని వివరించడంతో మంత్రి వెంటనే అధికారులను ఉపాధి హామీ, పోడు భూములపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వీటిని పరిష్కారం చేయాలని ప్రతినిధి బృందం ముందే ఆదేశించారని తెలిపారు.

మణిపూర్‌లో తాజా హింసాకాండ

పోలీస్ అధికారి మృతి



ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండకు ముగింపు కనుచూపు మేర కనిపించడం లేదు. తాజాగా జరిగిన హింసాకాండలో ఒక పోలీసు అధికారి మృతి చెందారు. భారత్-మయన్మార్ సరిహద్దు పట్టణం మోరేలో ఒక పాఠశాల మైదానాన్ని శుభ్రపరిచే పనిని పర్యవేక్షిస్తూ ఉండగా.. సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఒ) చింగ్తం ఆనంద్‌కుమార్‌పై కాల్పులు జరిపారు. దీంతో ఆనంద్ కుమార్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ మరణించారు. రాష్ట్ర పోలీసులు, సరిహద్దు భద్రతా దళం సంయుక్తంగా హెలిప్యాడ్ నిర్మాణం కోసం పాఠశాల మైదానాన్ని శుభ్రం చేస్తుండగా ఈ దారుణం జరిగిందని అధికారులు చెప్పారు. మోరేలో భారీగా మోహరించిన భద్రతా సిబ్బందిని ఉపసంహ రించాలని కోరుతూ కొన్ని రోజుల నుంచి ఆందోళనలు జరుగుతున్నాయి. కాగా, ఈ ఘటనపై మణిపూర్ క్యాబినెట్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఎస్‌డీపీఓపై కాల్పులు జరిపిన సాయుధులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తెలిపారు. అలాగే మృతి చెందిన పోలీసు అధికారి కుటుంబానికి రూ 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిందితుల్ని పట్టుకునేందుకు మోరే, పరిసర ప్రాంతాల్లో సంయుక్త ఆపరేషన్ ప్రారంభించాలని బలగాలను ఆదేశించింది. మోరేకు అదనపు బలగాలను తరలించాలని కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

పాలస్తీనియన్లపై మారణకాండను ఆపండి

= వెనిజులా నేత మదురో

కారకస్ : పాలస్తీనియన్లపై మారణకాండను ఆపాలని వెనిజులా డిమాండ్ చేసింది. అమాయకులైన ప్రజలపై ఇక బాంబు దాడులు జరగరాదని అధ్యక్షుడు నికొలస్ మదురో పేర్కొన్నారు. ఈ మారణ హెూమానికి తక్షణమే స్వస్తి పలకాలని వెనిజులా ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారన్నారు. 'పాలస్తీనియన్లను తుదముట్టించాలని వారు భావిస్తున్నారు. యూదులపై అడాల్ఫ్ హిట్లర్ సాగించిన ప్రణాళికనే ఇక్కడ కూడా అమలు చేస్తున్నారు. దీన్ని మానవాళి ఖండిస్తోంది.' అని మదురో పేర్కొన్నారు. యావత్ ప్రపంచ ప్రజలు కూడా తమ వాణిని వినిపించాలని కోరుతున్నానని చెప్పారు.

ఇప్పటివరకు సాగిన ఊచకోతలో 8,300మంది మరణించగా, 21వేల మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు. వెనిజులాతో సహా స్పెయిన్, అమెరికా, ఫ్రాన్స్, టర్కీ, కొలంబియా, జర్మనీ, ట్యునీషియా, పోర్చుగల్, అర్జెంటైనాల్లో అనేక ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు. పాల స్తీనా కోసం యావత్ ప్రపంచం నినదిస్తోందన్నారు. తక్షణమే కాల్పుల విరమణ జరిగి, ఊచకోతను ఆపాలని అంతర్జాతీయ సమాజం కోరుతోందన్నారు.

క్యాడర్ టీడీపీ వెంటే...


బాబుకు బెయిల్ రావడంతో హర్షాతిరేకాలు

= ఎన్టీఆర్ భవన్ వద్ద శ్రేణుల హడావిడి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

టీడీపీ అధినేత చంద్రబాబుకు బెయిల్‌రావటంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్టీఆర్‌భవన్‌వద్ద శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. కాగా, ఎన్నికలలో పోటీచేయాలనుకున్న కొంత మంది నేతలు తప్ప ద్వితీయ శ్రేణి నాయకత్వమంతా టీడీపీలోనే ఉండి... బాబు ఆదేశాలమేరకు పనిచేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామాతో టీడీపీ అతలాకుతలం అవుతుందని అందరూ అనుకున్నారు. బీజేపీతో పొత్తుకు ఇప్పటికి ఆ పార్టీ శ్రేణులు ససేమిరా అనే పరిస్థితే ఉంది. జ్ఞానేశ్వర్ సైతం పార్టీ తెలంగాణ ఎన్నికలలో పోటీచేయాలని భావించారు. ఎక్కువమంది బీసీలకు అధికంగా సీట్లు ఇవ్వడం ద్వారా తెలుగుదేశం బీసీల పార్టీ అని నిరూపించాలని ఆశించారు. అయితే ఏపీ రాజకీయాల నేపథ్యంలో చంద్రబాబు స్కిల్ స్కామ్ కేసులో జైలుకి వెళ్లాల్సి వచ్చింది. ఆ నేపథ్యంలో ఆ పార్టీ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. దీంతో తెలంగాణ ఎన్నికల బరి నుంచి టీడీపీ తప్పుకోవాల్సి వచ్చిందనే వ్యాఖ్యానాలు ఆ పార్టీ సీనియర్ నేతల నుంచి వినిపిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడిగా రాజీనామా చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు.. కొంతమంది పార్టీని వీడటం వల్ల వచ్చే నష్టమేమీ లేదని నేతలు అంటున్నారు.

విద్వేషం వెళ్లగక్కిన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేసు



తిరువనంతపురం : కేరళలో బాంబు దాడులకు పాల్పడిన వారికి హమాస్‌తో సన్నిహిత సంబంధాలున్నాయంటూ విద్వేష వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేసు నమోదైంది. సమాజంలోని భిన్న వర్గాల మధ్య మత విద్వేషాన్ని పెంపొందిస్తూ, సామరస్యతను విచ్ఛిన్నం చేస్తున్నందుకు ఈ కేసు నమోదు చేసినట్లు కేరళ సైబర్‌సెల్ పోలీసులు తెలిపారు. ఐపిసిలోని సెక్షన్ 153 (ఎ) (మతం, వర్ణం, నివాసం, పుట్టిన స్థలం ప్రాతిపదికన భిన్న గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంచి పోషించడం), కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120 (0)(ప్రజా వ్యవస్థ ఉల్లంఘన)కింద కేంద్ర మంత్రిపై అభియోగాలు మోపారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్, రాహుల్ గాంధీ కుమ్మక్కయ్యారని కేంద్ర మంత్రి ఆరోపించారు. ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ అనుసరించే మైనారిటీ బుజ్జగింపు ధోరణే కేరళ రాష్ట్ర ఇబ్బందులకు కారణమంటూ మరోసారి విషం గక్కారు. కోచిలోని కలామస్సెరి మీటింగ్ హాల్‌లో ఇటీవల బాంబు దాడి జరగ్గా, తానే బాంబు పెట్టినట్టు జెహోవా విట్నెసెస్ అనుచరుడు డొమినిక్ మార్టిన్ అంగీకరించారు. ఈ ఘటనను ముస్లిములకు ఆపాదిస్తూ, ఇజ్రాయిల్‌పై హమస్ దాడితో ఈ బాంబు పేలుడును సమానం చేస్తూ కేంద్ర మంత్రి ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే.

అనిల్ ఆంటోనీపై మరో కేసు

మరో ఘటనలో వివిధ వర్గాల మధ్య మత విద్వేషాన్ని రగులుస్తున్నారంటూ కాంగ్రెస్ నేత ఎకె ఆంటోనీ కుమారుడు, బిజెపి నేత అనిల్ ఆంటోనీపై కేసు నమోదైంది. కాసర్‌గోడ్ సైబర్ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. పాసింజర్ బస్సును దిగ్బంధించిన కొంతమంది విద్యార్థుల చిత్రాలను మత విద్వేష ప్రచారానికి అనిల్ ఉపయోగించారు. హిజాబ్ ధరించకుండా ఉత్తర కేరళలో ఏ మహిళ కూడా ప్రయాణించడానికి అనుమతించలేదంటూ ఆ విజువల్స్‌కు శీర్షికను జతపరిచారు.

బిజినెస్

పెరిగిన విత్త లోటు

= ప్రథమార్థంలో రూ.7.02 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో కేంద్ర ప్రభుత్వ విత్త లోటు 7.02 లక్షల కోట్లకు చేరింది. దీంతో మొత్తం ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యంలో 39.3 శాతానికి చేరినట్లయ్యింది. గతేడాది ఇదే కాలంలో 37.3 శాతంతో పోల్చితే స్వల్పంగా లోటు పెరిగింది. ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ.. చేసే వ్యయాల మధ్య అంతరమే విత్త లోటు. కాగా.. 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ముగింపు నాటికి ఇది రూ.7.02 లక్షల కోట్లుగా నమోదయ్యిందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణంకాల్లో వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం 2023-24 జిడిపిలో 6.4 శాతంతో రూ.17.87 లక్షల కోట్ల విత్త లోటు చోటు చేసుకోవచ్చని కేంద్రం బడ్జెట్‌లో అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాదిలోనూ 6.4 శాతంగా చోటు చేసుకుంది. సెప్టెంబర్ ముగింపు నాటికి పన్ను రెవెన్యూ ప్రస్తుత వార్షిక టార్గెట్‌లో రూ.11.60 లక్షల కోట్లు లేదా 49.8 శాతాన్ని చేరింది. గతేడాది ఇదే సమయంలో బడ్జెట్ అంచనాల్లో 52 శాతాన్ని చేరింది. బడ్జెట్ అంచనాలతో పోల్చితే క్రితం ప్రథమార్థంలో కేంద్రం మొత్తం వ్యయం 21.19 లక్షల కోట్లు లేదా 47.1 శాతంగా నమోదయ్యింది.

రాణించిన గెయిల్ ఇండియా

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని గెయిల్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 56 శాతం వృద్ధితో రూ.2,404.89 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,537.07 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.38,490.89 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ1లో 17 శాతం తగ్గి రూ.31,822.6 కోట్లుగా చోటు చేసుకుంది. మంగళవారం బిఎస్‌ఇలో గెయిల్ ఇండియా షేర్లు 1.30 శాతం పెరిగి రూ.119.95 వద్ద ముగిసింది. ప్రస్తుత ఏడాది ప్రారంభం నుంచి ఈ సూచీ 25 శాతం పెరిగింది.


గోద్రేజ్ అగ్రోవిట్ నుంచి రషీన్‌బన్

= మిర్చి తెగుళ్ల క్రిమిసంహారిణి ఆవిష్కరణ

హైదరాబాద్ : బహుళ వ్యవసాయ వ్యాపారాలను కలిగిన గోద్రేజ్ అగ్రోవిట్ కొత్తగా మిర్చి పంటలో తెగుళ్లను అరికట్టేందుకు 'రషీన్‌బాన్'ను విడుదల చేసింది. ఈ క్రిమిసంహారిణిని జపాన్‌కు చెందిన నిస్సాన్ కెమికల్ కార్పొరేషన్‌తో కలిసి భారత్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. ఒక్క ఎకరాకు 400 మిల్లీలీటర్లు సరిపోతుందని.. దీని ధరను రూ.2900గా నిర్ణయించామని జీఎవిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బల్రామ్ సింగ్ యాదవ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రషీన్‌బన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "నిస్సన్ అభివృద్ధి చేసిన ఈ మందు మిరప పుష్పించే దశలో పంటను రక్షించడానికి ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే మొత్తం మిరపలో భారత్ రూ.10,400 కోట్లతో 36 శాతం వాటా కలిగి ఉంది. భారతీయ మిరప సాగుదారులు తెగుళ్లు, వ్యాధుల సవాలును ఎదుర్కొంటున్నారు. మిర్చి పంటలో దాదాపు 80 శాతం తెగుళ్ల (త్రిప్స్, లెప్స్, హాప్పర్స్, పురుగులు) కారణంగా ప్రారంభ దశలోనే దెబ్బతింటుంది," అని తెలిపారు. "మిరపలో 51 రకాల తెగుళ్లు ఉన్నాయి, రైతులు 45 రకాల పురుగు మందులను ఉపయోగించవలసి వస్తుంది. కొత్త ఉత్పత్తి, రాషిన్‌బాన్, పుష్పించే దశలో మిరపలోని అనేక రకాల తెగుళ్లను ఒకే దెబ్బలో త్వరగా పరిష్కరిస్తుంది. ఇప్పటికే ఉన్న ఉత్పత్తులైన హనాబీ, గ్రేసియాతో పాటు పోర్ట్‌ఫోలియోలో రషీన్‌బాన్‌ను చేర్చడం వల్ల మిరప పంట దిగుబడి పెరగడానికి దోహదం చేయనుంది.' అని బల్రామ్ పేర్కొన్నారు.

స్పందన స్ఫూర్తి లాభాల్లో 127% వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో స్పందన స్ఫూర్తి ఫైనాన్సియల్ నికర లాభాలు 127 శాతం పెరిగి రూ.125 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.55 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఈ ఎన్‌బిఎఫ్‌సి-ఎంఎఫ్ఐ గడిచిన క్యూ2లో వ్యాపార విస్తరణ, అధిక రాబడి, బ్యాలెన్స్ షీట్ల క్లియరెన్స్ మెరుగైన ఆర్థిక ఫలితాలకు దోహదం చేసిందని ఆసంస్థ తెలిపింది. ఏడాదిలో 292 కొత్త శాఖలను ఏర్పాటు చేయడంతో మొత్తం శాఖలు 1.407 శాఖలకు చేరాయని.. వచ్చే మూడు నెలల్లో మరో 110 శాఖలను తెరువనున్నట్లు వెల్లడించింది.




ప్రపంచకప్‌లో నేడు
న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా
వేదిక : పుణె
సమయం : మ. 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

బలాన్ డి ఓర్ @ మెస్సీ

పారిస్ : సాకర్ సూపర్ స్టార్ లియోనల్ మెస్సీ మరోసారి ప్రతిష్టాత్మక బలాన్ డి ఓర్ పురస్కారం అందుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రెంచ్ ఫుట్‌బాల్ మ్యాగజైన్ అందించే ఈ అవార్డును మెస్సీ రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి అందుకున్నాడు. మేజర్ సాకర్ లీగ్ (అమెరికా)లో ఆడుతూ బలాన్ డి ఓర్ గెల్చుకున్న తొలి ఆటగాడిగా మెస్సీ చరిత్ర సృష్టించాడు. అవార్డు రేసులో హాలండ్, బెంజెమా, ఎంబాపెలను మెస్సీ వెనక్కి నెట్టాడు.



అన్నీ మంచి శకునములే!

- సొంతగడ్డపై రోహిత్‌సేన జోరు
- ఉత్సేరకంగా అభిమానుల విశేష మద్దతు
- మూడో కప్పు వేటలో భారత్ దూకుడు



ఆరుకు ఆరు. ప్రపంచకప్ గ్రూప్ దశలో టీమ్ ఇండియా జోరు. వరుసగా ఆరు మ్యాచుల్లో విజయాలు సాధించిన రోహిత్‌సేన సెమీఫైనల్లో చోటు ఖాయం చేసుకుంది. కీలక సెమీఫైనల్స్‌కు ముందు మరో మూడు మ్యాచుల్లో నాకౌట్ సమరానికి సన్నద్ధం కానుంది. బ్యాట్‌తో బ్యాటర్లు, బంతితో బౌలర్లు, గ్రౌండ్‌లో ఫీల్డర్లు, స్టాండ్స్‌లో అభిమానులు ఇలా 2023 ఐసీసీ ప్రపంచకప్‌లో ప్రతిదీ ఆతిథ్య భారత్‌కు అనుకూలంగానే సాగుతోంది. ముచ్చటగా మూడోసారి వన్డే వరల్డ్‌కప్ అందుకునే ప్రయత్నంలో భారత జట్టుకు అన్నీ మంచి శకునములే!!

నవతెలంగాణ క్రీడావిభాగం



ఆతిథ్యమే విజయం!

ప్రపంచకప్‌లకు ఆతిథ్యం ఇవ్వటం సొంత జట్టుకు నరకప్రాయంగా ఉండేది. విపరీత అంచనాలు, అభిమానుల ఆశలు, కప్పు వేటలో అదుపుచేయలేని భావోద్వేగాలు.. బలమైన జట్లను సైతం కుంగదీశాయి. 1975 నుంచి 2007 వరకు ఇదే కొనసాగింది. ప్రపంచకప్ ఎప్పుడూ పర్యాటక జట్ల పరం కాగా.. ఆతిథ్య ఎప్పుడూ ఓటమి గాయాలతో విలవిల్లాడేది. 1996 సహా ఆతిథ్య దేశంగా నిలిచిన శ్రీలంకకు ఇక్కడ కాస్త మినహాయింపు. కానీ ఆ జట్టు సైతం కప్పును లాహోర్‌లోనే అందుకుంది. ఆతిథ్య జట్లకు అసలు సిసలు మజా తీసుకొచ్చిన ఘనత ధోనీసేనకే దక్కుతుంది. 2011 ప్రపంచకప్ ఆతిథ్య జట్టుగా బిలియన్ ప్రజల అంచనాలతో బరిలోకి భారత్ అద్భుత విజయం సాధించింది. ఆతిథ్య జట్టు సైతం చాంపియన్‌గా నిలువచ్చని 2011లో టీమ్ ఇండియా నిరూపించింది. ధోనీసేన చూపిన బాటలోనే 2015, 2019 ప్రపంచకప్ ఆతిథ్య జట్లు నడిచాయి. 2015 ప్రపంచకప్‌ను ఆస్ట్రేలియా, 2019 ప్రపంచకప్‌ను ఇంగ్లాండ్‌లు సొంతం చేసుకున్నాయి. టీమ్ ఇండియానే శ్రీకారం చుట్టిన సంప్రదాయాన్ని కొనసాగించేందుకు రోహిత్‌సేన రంగం సిద్ధం చేసింది. గ్రూప్ దశలో వరుసగా ఆరు విజయాలతో అజేయంగా నిలిచింది. సెమీఫైనల్స్ బెర్త్ ఖాయం చేసుకుని.. నాకౌట్ ప్రత్యర్థి కోసం అస్త్రాలు సిద్ధం చేస్తోంది.

ఏమా ప్రదర్శన

టీమ్ ఇండియా గ్రూప్ దశలో వరుసగా ఆరు విజయాలు సాధించటం అసమానం. ఆతిథ్య భారత్ సెమీస్, ఫైనల్ ఫేవరేట్ అనటంలో ఎటువంటి సందేహం లేదు. కానీ అగ్రజట్లను సైతం పసికూనల మాదిరి చిత్తు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. లక్నోలో ఇంగ్లాండ్‌పై 100 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్.. అన్ని రంగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. చెన్నైలో ఆస్ట్రేలియా మాత్రమే కాస్త ప్రతిఘటించే ప్రయత్నం చేసింది. మరో ప్రత్యర్థి టీమ్ ఇండియాకు గట్టి పోటీ ఇచ్చిన దాఖలాలు సైతం లేవు. పాకిస్థాన్, న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్‌లు టీమ్ ఇండియా ముందు దాసోహం అయ్యాయి. శ్రీలంక, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్‌లతో మ్యాచులే మిగిలి ఉండగా... ఈడెన్‌గార్డెన్స్‌లో సఫారీ సవాల్‌పై ఇప్పుడు ఆసక్తి రెట్టింపు అవుతోంది.

సందిగ్ధత నుంచి సాహో..

ఆసియా కప్ విజేతగా నిలిచి భారత్ ఆత్మవిశ్వాసం సాధించినా.. కీలక ఆటగాళ్ల గాయాల బారిన పడటంతో ప్రపంచకప్ వేటపై అనుమానాలు నెలకొన్నాయి. ప్రపంచకప్‌లో భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న జశ్‌ప్రీత్ బుమ్రా, కెఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యలు అప్పుడప్పుడే జట్టులోకి వచ్చారు. ఫిట్‌నెస్‌తో పాటు ఫామ్ నిరూపించుకునే స్థితి నుంచి భారత్‌కు అప్రతిహాత విజయాలు అందించే స్థాయిలో చెలరేగుతున్నారు. డెంగీ జ్వరంతో తొలి రెండు మ్యాచులకు శుభ్‌మన్ గిల్, గాయంతో చివరి రెండు మ్యాచులకు హార్దిక్ పాండ్య దూరమయ్యారు. గాయం నుంచి కోలుకుని పూర్వ ఫామ్ చాటడం అంత సులువు కాదు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ పరిస్థితి అందరం చూస్తూనే ఉన్నాయి. అయినా.. మనోళ్లు అద్భుత రీతిలో రాణిస్తున్నారు.

సూపర్ షమి

హైదరాబాదీ పేసర్ ఆసియా కప్ ఫైనల్లో కలల ప్రదర్శన చేశాడు. వన్డేల్లో నం.1 బౌలర్‌గా నిలిచాడు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చాడు. లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని శార్దుల్ ఠాకూర్ మూడో పేసర్‌గా తుది జట్టులో నిలిచాడు. దీంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమి బెంచ్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. హార్దిక్ పాండ్య గాయం బారిన పడటంతో తుది జట్టు కూర్పు మార్చాల్సి వచ్చింది. ఈ కూర్పులో మహ్మద్ షమి జట్టులోకి వచ్చాడు. వన్డే కెరీర్‌లో సాధించిన వికెట్లలో మహ్మద్ షమి ఏకంగా 25 శాతం వికెట్లను ప్రపంచకప్‌లోనే పడగొట్టాడు. అంతటి మహ్మద్ షమి ధర్మశాలలో న్యూజిలాండ్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన, లక్నోలో ఇంగ్లాండ్‌పై నాలుగు వికెట్ల ప్రదర్శనతో విజృంభించాడు. అనూహ్యంగా సిరాజ్ ఇబ్బంది పడుతున్న వేళ.. షమి భీకర స్పెల్స్ భారత బౌలింగ్‌ను మరింత బలోపేతం చేశాయి. షమి, బుమ్రా, సిరాజ్ పేస్ త్రయం ప్రత్యర్థులకు దడ పుట్టిస్తోంది.

ఫ్యాన్స్‌కు పండుగ

ఆటలో తిరుగులేదు. సెమీస్ దారిలో ఎదురులేదు. దీంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేవు. కానీ టీమ్ ఇండియా నుంచి అభిమానులకు మరో ట్రీట్ లభించింది. కొన్నిసార్లు నాయకత్వం అహానికి దారితీస్తుంది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ బంధంపై ఎన్నో కథనాలు వచ్చాయి. కానీ ప్రపంచకప్‌లో కోహ్లి, రోహిత్ అనుబంధం.. మైదానంలో ఆ ఇద్దరు ఆటగాళ్ల ఆనందహేళి చూడటం అభిమానులకు పండుగే. విజయాలకు తోడు స్టార్ క్రికెటర్ల మైత్రీ డ్రెస్సింగ్ రూమ్‌ను సానుకూలం చేస్తోంది. మ్యాచ్‌కు ముందు జట్టు హడిల్‌లో కెప్టెన్ మాట్లాడటం చూస్తుంటాం. కానీ ప్రపంచకప్‌లో ప్రతి మ్యాచ్‌కు ఒక్కో ఆటగాడు జట్టును ఉద్దేశించి 'పెప్ టాక్' ఇస్తున్నాడు. మ్యాచ్ అనంతరం టీమ్ ఇండియా డ్రెస్సింగ్‌రూమ్‌లో అవార్డ్స్ సెర్మానీ ఈ ప్రపంచకప్ వేటలో మరో ప్రత్యేకత.




బంగ్లాపై పాక్ గెలుపు

- ఛేదనలో మెరిసిన జమాన్, అబ్దుల్లా
- రాణించిన షహీన్ అఫ్రిది, వసీం

కోల్‌కత : ఎట్టకేలకు పాకిస్థాన్ ఓ విజయం సాధించింది. వరుసగా నాలుగు ఓటములు చవిచూసిన బాబర్ సేన కోల్‌కతలో బంగ్లాదేశ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 205 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ మరో 105 బంతులు ఉండగానే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ఫకర్ జమాన్ (81, 74 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (68, 69 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. తొలి వికెట్‌కు 128 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన ఓపెనర్లు పాకిస్థాన్ విజయానికి మార్గం సుగమం చేశారు. కెప్టెన్ బాబర్ ఆజమ్ (9) మరోసారి విఫలమైనా.. మహ్మద్ రిజ్వాన్ (26 నాటౌట్, 21 బంతుల్లో 4 ఫోర్లు), ఇఫ్తీకార్ అహ్మద్ (17 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు) లాంఛనం ముగించారు. బంగ్లా స్పిన్నర్ మెహిది హసన్ మిరాజ్ (3/60) మూడు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 45.1 ఓవర్లలో 204 పరుగులకు కుప్పకూలింది. పాక్ బౌలర్లు షహీన్ షా అఫ్రిది (3/23), మహ్మద్ వసీం (3/31) మూడు వికెట్లతో విజృంభించారు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో మహ్మదుల్లా (56, 70 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీ సాధించగా.. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (43, 64 బంతుల్లో 4 ఫోర్లు), లిటన్ దాస్ (45, 64 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు. హసన్ (0), నజ్ముల్ (4), ముష్ఫీకర్ (5), హృదయ్ (7) విఫలమయ్యారు. ఛేదనలో చెలరేగిన ఫకర్ జమాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. పాకిస్థాన్‌కు ఏడు మ్యాచుల్లో ఇది మూడో విజయం కాగా..బంగ్లాదేశ్‌కు ఏడు మ్యాచుల్లో ఇది ఆరో పరాజయం.

సౌదీ అరేబియా కోసం..

- వెనక్కి తగ్గిన ఆస్ట్రేలియా
- ఫిఫా ప్రపంచకప్ బిడ్డింగ్



సిడ్నీ : గ్లోబల్ స్పోర్ట్స్ పవర్‌హౌస్‌గా ఎదిగేందుకు అడుగులు వేస్తోన్న సౌదీ అరేబియా.. ఆ దిశగా 2034 ఫిఫా మెన్స్ ప్రపంచకప్ ఆతిథ్య హక్కులు దక్కించుకునేందుకు సిద్ధమవుతోంది. 2030 ఫిఫా ప్రపంచకప్‌కు మొరాకో, పోర్చుగల్, స్పెయిన్‌లు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2034 ప్రపంచకప్ ఆతిథ్య హక్కుల కోసం ఫిఫా బిడ్డింగ్ ప్రక్రియ ఆరంభించింది. ఆసియా, ఓసియానా రీజియన్ నుంచి మాత్రమే ఆతిథ్య రేసులో నిలవాలి. ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ మద్దతు సౌదీ అరేబియాకు ఉండటంతో.. 2034 ప్రపంచకప్ ఆతిథ్యానికి బిడ్ దాఖలు చేసే ఆలోచన ఆస్ట్రేలియా విరమించుకుంది. ఈ మేరకు ఫుట్‌బాల్ ఆస్ట్రేలియా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బలమైన పోటీదారు ఆస్ట్రేలియా పోటీ నుంచి తప్పుకోవటంతో.. 2034 ఫిఫా ప్రపంచకప్ సౌదీ అరేబియాకు వెళ్లటం లాంఛనంగా కనిపిస్తోంది. 2022 ఫిఫా ప్రపంచకప్‌కు ఖతార్ వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే.

నవచిత్రం

ఇండియా సినిమాటిక్ క్యాపిటల్‌గా హైదరాబాద్



ఇండియా జాయ్, ఫ్లయింగ్ మౌంటెయిన్ కాన్సెప్ట్స్ సమర్పణలో సినిమాటిక్ ఎక్స్ పో కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది.
సినీ రంగానికి చెందిన సరికొత్త సాంకేతికతను అందరికీ తెలియజేసే పరిచయ వేదికగా సినిమాటిక్ ఎక్స్ పో నిలిచింది.
ఈ ఏడాది జరిగిన సినిమాటోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైనింగ్, వి.ఎఫ్.ఎక్స్, స్పెషల్ ఎఫెక్ట్స్ రంగాలకు చెందిన సరికొత్త టెక్నాలజీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి హీరో నాగార్జున, దర్శకుడు నాగ్ అశ్విన్ ముఖ్య అతిథులుగా విచ్చేయగా, తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఐటీ డిపార్ట్‌మెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, సినిమాటికా ఎక్స్ పో ఫౌండర్, తెలుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.జి.విందా, రోటో మేకర్ ఫౌండర్ మైక్, గ్రీన్ గోల్డ్ ఛీఫ్ మార్కెటింగ్ హెడ్ భరత్, కంట్రీ హెడ్ ఫర్ టెక్నికల్ బిరేన్ గోస్, నిర్మాత సుప్రియ, డ్యాన్సింగ్ ఆటం క్రియేటివ్ హెడ్, ఫౌండర్ సరస్వతి వాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, "ఇప్పుడు రోజురోజుకూ టెక్నికల్‌గా ఎన్నో మార్పులు వస్తున్నాయి. హైదరాబాద్ అనేది సినిమా పరిశ్రమకు రాజధానిలా మారనుంది. ఇండియా జాయ్ వారి గ్రాఫ్ అద్భుతంగా పెరుగుతూ వస్తోంది' అని తెలిపారు. 'ప్రాజెక్ట్ కె'ని పూర్తిగా మేడ్ ఇన్ ఇండియా మూవీలా ఇక్కడి వీఎఫ్ఎక్స్ కంపెనీలతోనే చేద్దామని ప్రయత్నించాను. నెక్ట్స్ మూవీని ఇక్కడి వాళ్లతో కలిసి హాలీవుడ్ కంటే బెస్ట్ క్వాలిటీతో తీస్తాను' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ చెప్పారు.



నితిన్, శ్రీలీల

ఓ ఎక్స్‌ట్రా ఆర్టిస్ట్ కథ

నితిన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎక్స్ ట్రా'. రైటర్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హేరిష్ జయరాజ్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే మూవీ పోస్టర్‌కి కూడా మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. నితిన్ జూనియర్ ఆర్టిస్ట్ పాత్రలో కనిపించబోతున్నారని, సినిమా షూటింగ్‌కి వచ్చిన వారిలో తనొక ఎక్స్‌ట్రా మెంబర్‌గా ఉంటారని అర్థమవుతోంది. 'బాహుబలి 2 'దండాలయ్యా...' పాటలో జూనియర్ ఆర్టిస్ట్‌గా కనిపించాడు. శ్రీలీలతో హీరో లవ్ ట్రాక్, తండ్రైన రావు రమేష్‌తో హీరో నితిన్‌కి ఉండే సంభాషణ ఇన్నీ టీజర్‌లో ఉన్నాయి. వక్కంతం వంశీ తనదైన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నారని స్పష్టమవుతుంది. ఈ చిత్రం డిసెంబర్ 8న రిలీజ్ అవుతుంది. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పైసా వసూల్ సినిమా అని ఫీల్ అవుతారు



తరుణ్ భాస్కర్

'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' విజయాలతో అందరి ప్రశంసలు అందుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ దాస్యం. ఆయన తన మూడో చిత్రంగా యూనిక్ క్రైమ్ కామెడీ మూవీ 'కీడా కోలా'తో వస్తున్నారు. విజి సైన్మా బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మిస్తున్నారు. హీరో రానా దగ్గుబాటి సమర్పిస్తున్న ఈ సినిమా నెల 3న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు తరుణ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ, 'లాక్ డౌన్‌లో చాలా మంది వినూత్నంగా ఇల్లీగల్ వేలో డబ్బులు సంపాదిస్తున్నారని తెలిసి నాకు చాలా కామెడీగా అనిపించింది. అయితే ఇదంతా క్రైమ్. కానీ దూరం నుంచి చూస్తే కామెడీ. ఇది నా ఫేవరేట్ జోనర్ కూడా. ఇప్పుడీ సినిమాతో క్రైమ్ కామెడీ చేయాలనే నా కల నిజమైంది. ఇందులో నటీనటులందరినీ ఆడిషన్స్ చేసి తీసుకున్నామని గర్వంగా చెప్పగలం. నా ఆల్ టైం ఫేవరేట్ 'మనీమనీ'. అందులో బ్రహ్మానందం పాత్ర చాలా ఇష్టం. ఇందులో బ్రహ్మానందం పాత్రకు మా తాతయ్య స్ఫూర్తి. ఆయనది చాలా ఫన్ క్యారెక్టర్. అందరూ ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ముంబైలో ఈ సినిమా ప్రివ్యూ చూసినప్పుడు అందరూ ఎంజాయ్ చేశారు. సినిమా చూస్తున్నంతసేపు హాయిగా నవ్వుకున్నారు. యూనిక్ రైటింగ్, మేకింగ్‌తో నవ్విస్తున్నాం. ఖచ్చితంగా ప్రేక్షకులు పైసా వసూల్ అని ఫీలౌతారనే నమ్మకం ఉంది. ఇందులో వాస్తు పాత్రకు టూరెట్ సిండ్రోమ్ పెట్టడానికి కారణం ఏంటంటే, ఏదైనా వైకల్యం ఉంటే దాని గురించి ప్రొజెక్ట్ చేస్తూ మాట్లాడటం కాదు.. వారికి సాధికారత ఇచ్చే విధంగా ఉండాలనేది నా ఆలోచన. ఇందులో అంతర్లీనంగా ఆ సందేశం ఉంటుంది. నా దర్శకత్వంలో నేను నటించిన మొదటి సినిమా కావడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

వెంకటేష్‌తో సినిమా ఉంటుంది. సురేష్ బాబు ప్రొసీడ్ అవ్వమన్నారు. అయితే కథ కోసం మరింత సమయం తీసుకున్నాను. ఇప్పుడు సిద్ధంగా ఉన్నాను. అలాగే ఒక వెబ్ సిరీస్ కి కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

కొన్నే.. జరుగుతాయ్



శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటిస్తున్న చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. శ్రీభారత ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ప్రత్యేక వేడుకలో మేకర్స్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
కిరీటి దామరాజు మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నేనూ ఓ పాత్ర పోషించా. మన జీవితంలో ఎన్నో అనుకుంటాం.. కానీ కొన్నే జరుగు తాయి. అదే ఈ సినిమా' అని తెలిపారు.
హీరో శ్రీరామ్ నిమ్మల మాట్లాడుతూ, 'కథ రెడీ చేసుకున్న తర్వాత సినిమాని నిర్మిద్దామని అమ్మానాన్నకి చెప్పాను. వారు సపోర్ట్ చేశారు. అలాగే నవీన, హరి బాగా సహకరించారు. ఇది నయా క్రైమ్ కామెడీ థ్రిల్లర్. అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది' అని అన్నారు.

విధి రిలీజ్‌కి రెడీ

రోహిత్ నందా హీరోగా, ఆనంది హీరోయిన్‌గా నో ఐడియా బ్యానర్ మీద రంజిత్ ఎస్ నిర్మించిన సినిమా 'విధి'. శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం తెరకెక్కించిన ఈ మూవీ ఈనెల 3న థియేటర్లోకి రాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాత రంజిత్ మాట్లాడుతూ, 'దర్శకులు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. మేకింగ్ కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది' అని అన్నారు.
'ఇప్పటి వరకు 'విధి' మా సినిమా. ఈనెల 3 నుంచి ఇది ప్రేక్షకుల సినిమా. మమ్మల్ని నమ్మి మాకు అవకాశం ఇచ్చిన నిర్మాత రంజిత్‌కు థ్యాంక్స్' అని దర్శక ద్వయం అన్నారు. హీరో రోహిత్ నందా మాట్లాడుతూ, "విధి' కోసం పెట్టిన కాంటెస్ట్‌కు చాలా రెస్పాన్స్ వచ్చింది. ప్రతీ థియేటర్లో బాక్సాఫీస్ వద్ద మా ప్రతినిధి ఉంటారు. వారికి కోడ్ చూపిస్తే టికెట్ ఇస్తారు. ఎక్స్‌ఎల్ యాప్ సపోర్ట్‌తో థియేటర్‌కు వెళ్తే.. కంటి చూపు లేని వాళ్లు కూడా ఈ సినిమాను ఎక్స్‌పీరియెన్స్ చేయవచ్చు' అని చెప్పారు.



'విధి' చిత్ర బృందం

ఇదొక సంచలనం : బ్రహ్మానందం



కంచర్ల అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

'ఒక సినిమా తీయడానికే కిందమీద పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం నిజంగా ఓ సంచలనం' అని హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'.
ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇదే బ్యానర్‌లో ఇదే హీరోతో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేయటం ఓ విశేషమైతే, 'ఉపేంద్ర గాడి అడ్డా' చిత్ర ట్రైలర్‌ను, నరసింహ నంది దర్శకత్వంలో ఈ నిర్మాత తీయబోతున్న ఆరవ చిత్రం '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మానందం విడుదల చేయటం మరో విశేషం. నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'నవంబర్ నుంచి ప్రతీ నెలా ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం. పూర్తి వినోదం, మాస్ అంశాలతో ఈ చిత్రం అలరింపజేస్తుంది' అని అన్నారు.

మంచి కుటుంబ కథా చిత్రం



పునర్నవి, విష్ణు వర్ధన్ రెడ్డి

ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో నిర్మాత లయన్ శ్రీరామ్ దత్తి 'ఓ తండ్రి తీర్పు' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి రాజేంద్ర రాజు దర్శకత్వ పర్యవేక్షణ చేశారు.
లయన్ డా॥ ఆరిగపూడి విజయకుమార్ పుట్టినరోజు సందర్భంగా బర్త్ డే వేడుకలు నిర్వహించారు.
ఈ నేపథ్యంలోనే తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ సెక్రటరీ, నిర్మాత కె ఎల్ దామోదర్ ప్రసాద్ ట్రైలర్ లాంచ్ చేసి మాట్లాడుతూ,'మంచి కుటుంబ కథా బలం ఉన్న ఇలాంటి సినిమా ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం' అని అన్నారు. నిర్మాత శ్రీరామ దత్తి మాట్లాడుతూ, 'తల్లి, తండ్రి, కొడుకు, కూతుళ్ళ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. నా తొలి సినిమానే ఇలాంటి మంచి సినిమా తీయటం ఆనందంగా ఉంది. ఈ సినిమాని కళామతల్లికి అంకితమివ్వడానికి గర్వపడుతున్నాను' అని తెలిపారు.



'దేశానికి సేవ చెయ్యాలంటే రాజకీయాల్లోనే ఉండక్కరలేదు.. నీకొచ్చిన పనినే నీకు తెలిసిందే నువ్వు దేశం కోసం చెయ్యొచ్చు. నిజానికి ప్రతి ఒక్కరూ దేశం కోసం పని చెయ్యవచ్చు' తండ్రి చెప్పిన ఈ మాటలు ఆమె మనసులో కొత్త ఆలోచన మొలకెత్తించింది. ఆ ఆలోచనకు ఆచరణ ప్రాణం పోసింది. చిన్న మొలక నేడు మహా వృక్షమై మహిళా సాధికారత ఫలాలు ఇస్తుంది. సమాజ శ్రేయస్సుకు పాటుపడుతోంది. ఎందరో వ్యాపారవేత్తలకు డేటా అందిస్తోంది. నగరాల అభివృద్ధికి ఆధారంగా నిలుస్తోంది. ఆమే మ్యునిపై సుబ్బలక్ష్మి.

నగరాభివృద్ధే ఆమె లక్ష్యం

మ్యునిపై అంటే ఇంటిపేరు కాదు, ఆమె చేసే పని పేరు. సుబ్బలక్ష్మి మ్యునిపై డేటాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించారు. ఇది మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరు, ప్రణాళికల నుండి వాటి భవిష్య ప్రణాళికలు, బడ్జెట్లు, ర్యాంకింగ్స్ ఇలా అన్నీ డిజిటల్‌గా అందుబాటులోకి తెచ్చే ఒక ప్లాట్ ఫార్మ్. ఒకప్పుడు పెద్ద పెద్ద సంస్థల పనితీరుకు రేటింగ్ ఇచ్చే ఒక ప్రైవేటు సంస్థలో క్రెడిట్ రేటింగ్ హెడ్‌గా ఉద్యోగం చేసే సుబ్బలక్ష్మి తానే సొంతంగా ఒక సంస్థ పెట్టి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. తాను పనిచేసే రోజులలో ఎన్నో సంస్థలకు రేటింగ్ ఇచ్చేది. ఈరోజుల్లో రేటింగ్స్‌కు ఉన్న ప్రాముఖ్యం మనకు తెలిసిందే. పది రూపాయలు పెట్టి ఒక జూసు తాగాలన్నా ఏ జూస్ పాయింట్‌కు వెళ్లాలని అంతర్జాలంలో రేటింగ్ చూసి వెళ్లడం సహజమైపోయింది.

అందరికీ ప్రయోజనం

ఒక సంస్థ నెలకొల్పినప్పుడు దాని పనితీరుకు వచ్చే రేటింగ్‌ని బట్టే ఆ సంస్థ పురోగతి ఆధారపడి ఉంటుంది. లోన్లు రావడం, పెట్టుబడులు పెట్టడం వంటి ఆర్థిక విషయాలు రేటింగ్స్ పైనే ఆధారపడి ఉంటాయి. అందుకే ఈ అంశాలన్నిటిని ఒక డేటా బేస్‌లో పదిలపరచాలని సంకల్పించారు సుబ్బలక్ష్మి. అయితే ప్రైవేటు సంస్థలకు రేటింగ్స్ అందరూ ఇస్తారు. కానీ మున్సిపాలిటీల పనితీరును రేట్ చెయ్యడం తాను చూడలేదు. ఒక సంస్థ ప్రగతి, ప్రజల ప్రగతి మున్సిపాలిటీలతో ముడిపడి ఉంది. ఈ డేటా వాటి పనితీరు, ప్రణాళికలు తెలిస్తే అటు ఇన్వెస్టర్లకూ ఇటు లోన్లు ఇచ్చే వారికి అందరికీ ప్రయోజనం చేకూరుతుంది. అని దాని అవశ్యకతను గుర్తించి మ్యునిపై డేటాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు.

ఆటంకాలను అణగదొక్కి

చిన్న కిరాణాకొట్టు నడపాలంటేనే ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాలి. అటువంటిది ప్రభుత్వానికి సంబంధించిన మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరు, డేటాబేస్ అంటే ఆశామాషి వ్యవహారం కాదని తొలినాళ్లలో ఆమె ఎదుర్కున్న అనుభవాల ద్వారా తెలుసుకుంది. మున్సిపల్ కార్పొరేషన్ల డేటా బేస్ ప్లాటుఫారంకు 2013లో శ్రీకారం చుట్టారు. ఒక్కోమెట్టు ఎక్కి ఆటంకాలను, అవరోధాలను అణగతొక్కి సక్సెస్ ఫుల్ మహిళా ఎంటర్రైన్యూర్‌గా ఎదిగారు. ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఆమె. చేసేది మంచి పనైనా అందరూ ఒకే లాగా సానుకూలంగా స్పందించలేదు. ప్రతికూల పరిస్థితులకు మహిళలు తలవంచరని ప్రూవ్ చేసింది. మ్యునిపై డేటాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌ని మూల సంస్థగా తీర్చిదిద్దింది ప్రయత్నం రెండు సార్లు విఫలమైంది. కానీ ఆమె ఆత్మవిశ్వాసం సఫలమైంది.

ఈ సంస్థ ఏంచేస్తుంది

దేశంలోని కార్పొరేషన్ల కార్యకలాపాలు, ప్రణాళికలు, బడ్జెట్లు ఇలా అన్నీ సేకరించి ఒక ప్లాటుఫారంపై పొందుపరిచింది. ఇది దేశంలోనే తొలి ప్రయత్నం. వినూత్న ప్రయోజనాత్మక ప్రయత్నం కూడా. అందుకే ఆమె ప్రయత్నానికి స్నేహహస్తం అందించింది వి హబ్. విమేన్ ఎంట్రప్రెనెర్స్‌కి చేయూతనిస్తూ మహిళాసాధికారతకు ప్రాణం పోస్తోంది విహబ్. మ్యునిపై సుబ్బలక్ష్మికి కూడా విహబ్ మార్గదర్శకం చూపింది. అంతేకాదు ఆమెకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ వారు కూడా సహకరించారు. ప్రస్తుతం 250 మున్సిపల్ కార్పొరేషన్ల ఆర్థిక అసెస్మెంట్ ఇన్ఫర్మేషన్ మొత్తం ఒకే ప్లాటుఫారంపైన పొందుపరిచింది.

విశ్వవ్యాప్త సేవలు

ఇన్ఫర్మేషన్ ఎంత సమర్థవంతంగా ఇవ్వగలిగితే అంత ప్రయోజనం కలిగిస్తుందని భావించింది. విజువల్ ప్రెసెంటేషన్ ఇవ్వాలని ఇన్ఫోగ్రాఫిక్స్ డాష్ బోర్డు రూపొందించారు. సుమారు 2300 ఇన్ఫోగ్రాఫిక్స్ ద్వారా మున్సిపల్ పర్ఫార్మెన్స్ సమాచారం అందిస్తోంది. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, సాంకేతిక నిపుణుల సహాయంతో సామాన్యులు సైతం సులువుగా అర్థం చేసుకునేలా ప్రతి కార్పొరేషన్ సమాచారం విభాగాల వారీగా ఇన్ఫోగ్రాఫిక్స్ ద్వారా తెలుపుతున్నారు. మన దేశ మున్సిపాలిటీలలో పెట్టుబడులు పెట్టాలనుకునే అన్ని సంస్థలకూ, వ్యాపారవేత్తలకూ దిక్సూచిగా నిలిచే సంస్థ ఆమె నెలకొల్పారు. భారతీయులతో పాటు విదేశీ ఇన్వెస్టర్లకూ ఉపయోగపడే సమాచారాన్ని అందిస్తున్నారు. ఈ సమాచారం బ్యాంక్స్, ప్రైవేట్ సంస్థలు, రెగ్యులేటర్స్‌కి ఉపయోగపడుతుంది. నగరాల ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్‌కి కూడా దోహదపడుతుంది. అంతేకాదు 2021లో మ్యునిపై డేటాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారు.



యువతకు ఉపాధి

గాంధీజీ గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడితే సుబ్బలక్ష్మి నగరాభివృద్ధి గురించి ఆలోచించారు. మున్సిపల్ కార్పోరేషన్ల పనితీరు పైనే నగరాల అభివృద్ధి ఆధారపడి వుంటుంది. అందుకే మున్సిపల్ పెర్ఫార్మెన్స్ అసెస్మెంట్ అనే యూనిక్ ఐడియాతో అడుగులు వేస్తున్నారు. తన ప్రయాణంలో యువతకు ప్రత్యేక స్థానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సేవలు అందించడానికి పెయిడ్ ఇంటర్న్ షిప్ అవకాశాలు ఇస్తున్నారు. ఉపాధి కల్పిస్తున్నారు



కుటుంబ నేపథ్యం

సుబ్బలక్ష్మి తమిళనాడులో పుట్టారు. తండ్రి జానా కృష్ణమూర్తి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేసారు. 1988లో మద్రాసు యూనివర్సిటీలో బి కామ్ చేసారు. 1991లో సి.ఏ పూర్తి చేసారు. కాస్ట్ అండ్ మానేజ్ మెంట్ అకౌంటెంట్‌లో 1992లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసారు. భర్త స్పోర్ట్స్ బిజినెస్ చేస్తారు. వీరికి 15 ఏండ్ల కూతురు ఉంది. తండ్రి చెప్పినట్టు దేశం కోసం తన వంతు సేవ చెయ్యాలని దృఢంగా విశ్వసిస్తారు. కుటుంబం, వృత్తితో ఆగిపోకుండా సమాజసేవలో నేను సైతం అంటూ ఒక బ్రిటిష్ యన్.జి.ఓ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. తన దినచర్యలో అధిక భాగం సమాజసేవలోనే గడిచిపోతుందని చెబుతారు. సాంకేతిక విద్యలో పట్టభద్రులైన తన స్నేహితులు, చార్టెడ్ అక్కౌంటెంట్లు, కుటుంబ సభ్యుల అందరి సహకారంతోనే తన సంస్థ ఈ స్థాయికి వచ్చిందని అంటారు సుబ్బలక్ష్మి.

- ముదిగొండ రాజ చంద్రిక

గుడ్లను ఫ్రిజ్‌లో పెడుతున్నారా?

పోషకాహారాలు కొలువై ఉన్న ఆహార పదార్థాల్లో గుడ్డు ఒకటి. రోజుకో గుడ్డు తినడం ఆరోగ్యానికి మేలని ప్రభుత్వమే ప్రచారం చేయిస్తోంది. ఇందులో ఉండే కాల్షియం ఎముకల పటిష్టతకు దోహదపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంలో గుడ్లకు సాటేదీ లేదు.




కానీ గుడ్లను ఎక్కువరోజులు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడం మంచిది కాదంటున్నారు నిపుణులు. అలా చేయడం వల్ల ప్రమాదమే ఎక్కువట. అనారోగ్యాలను కొనితెచ్చుకోవడమేనట. అలా చేయడం వల్ల జరిగే నష్టాలేంటో తెలుసుకుందాం...

- గుడ్లు ఎక్కువరోజులు నిల్వ ఉంటే అందులో బాక్టీరియా పెరిగి తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు.
- పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఫ్రిజ్‌లోని ఉష్ణోగ్రత సున్నా కంటే చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి ఆహారాన్ని ఉంచడం మంచిదే. కానీ గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచినప్పుడు వాటిలో ఒక రకమైన హానికరమైన బ్యాక్టీరియా పుడుతుంది.
- గుడ్లను ఉడికించినప్పుడు సాధారణంగా ఫ్రిజ్ నుండి గుడ్లను తీసి నేరుగా వాటిని ఉపయోగిస్తాము. కాబట్టి గుడ్డులో పుట్టిన బ్యాక్టీరియా సజీవంగా ఉంటుంది. దానివల్ల ఫుడ్ పాయిజనింగ్, వివిధ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది.
- గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచితే అవి ఎక్కువ రోజులు పాడవకుండా ఉంటాయి. కానీ వాటిని బయటపెడితే కొద్ది రోజుల్లోనే పాడవుతాయని అమెరికా ప్రపంచానికి నేర్పించింది. అప్పటి నుండి ప్రపంచం మొత్తం ఈ నియమానికి అలవాటు పడింది. దాంతో రిఫ్రిజిరేటర్లలోనూ గుడ్లు పెట్టడానికి ప్రత్యేక అల్మారాలు ఏర్పాటుచేశారు.
- గుడ్లను ఎక్కువసేపు బయట ఉంచడం మంచిదికాదు. అదే సమయంలో ఎక్కువరోజులు ఫ్రిజ్‌లో ఉంచడం కూడా సురక్షితం కాదు. మరి దీనికి మార్గమేమిటి అనుకుంటున్నారా..? మీకు కావలసినన్ని గుడ్లను కొన్న తర్వాత వాటిని త్వరగా వండుకోవడమే అని నిపుణులు అంటున్నారు. అనవసరంగా ఎక్కువ గుడ్లు కొని నిల్వ చేయవద్దని సూచిస్తున్నారు.

ఇట్ల చేద్దాం

ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక చెంచా మెంతుల పొడిని కలుపుకుని రోజూ ఉదయం, సాయంత్రం తాగుతుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి వేయదు. కొవ్వు కూడా త్వరగా కరుగుతుంది. ముఖ్యంగా కాలేయం చుట్టూ ఉండే కొవ్వు కరిగిపోతుంది.



నేడు రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రత్యేక బృందం వస్తున్నది. ఈనెల 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆరోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. సీఈసీకి చెందిన సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు నితీశ్ వ్యాస్, ధర్మేంద్ర శర్మతో కూడిన బృందం రెండురోజులు హైదరాబాద్‌లో మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులతోనూ భేటీ అవుతారు. ఎన్నికల నిబంధనావళి వెలువడిన తర్వాత జరిపిన తనిఖీల్లో పట్టుబడిన నగదు, ఇతర స్వాధీనాలపై తగు ఆదేశాలు జారీ చేస్తారు. అలాగే పొరుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమవుతారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సరిహద్దుల్లో చెక్ పోస్టులు, తనిఖీలు వంటి అంశాలపై చర్చిస్తారు.

3 నుంచి నామినేషన్లు...

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 3వ తేదీ జారీ కానుంది. అదేరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. దీనికోసం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ల కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి వివాదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 5వ తేదీ ఆదివారం నామినేషన్లు స్వీకరించరు. ఆరోజు ఆ కార్యక్రమానికి సెలవు ప్రకటించారు. తిరిగి సోమవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 13వ తేదీ నామినేషన్ల పరిశీలన, 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదేరోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఆ తర్వాత నవంబర్ 30న పోలింగ్ జరుగుతుంది. అయితే ఈసారి సీఈసీ నామినేషన్ల దాఖలులో కొన్ని సవరణలు చేసింది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అఫిడవిట్ అసంపూర్తిగా ఉంటే రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి నోటీసులు జారీ చేసి సవరించుకోవాలని సూచిస్తారు. అభ్యర్థి స్పందించకుంటే నామినేషన్ తిరస్కరిస్తారు.

కాంగ్రెస్ నేతల ఫోన్లు హ్యాక్

- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ నేతల ఫోన్లు బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎక్స్ ట్విట్టర్ వేదికగా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్పైవేర్‌ని ఉపయోగించి మా ఫోన్లను అక్రమంగా హ్యాక్ చేస్తున్నారు. ఇది గోప్యత, మానవ గౌరవం, రాజకీయ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది. కానీ ఏదీ మనల్ని అడ్డుకోదు. మా చివరి శ్వాస వరకు తెలంగాణ ప్రజల కోసం పోరాడుతాం. కాంగ్రెస్ పార్టీ ఏకైక ప్రాధాన్యత ప్రజల హక్కులు, న్యాయం కోసం పోరాడడమే. తెలంగాణ ప్రజల కోసం రాజీ లేకుండా పోరాడుతున్నాం' అని రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ఇందుప్రియ

బీఆర్ఎస్ పార్టీలు, కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మెన్ ఇందుప్రియ, కౌన్సిలర్ వంశీ, చంద్రశేఖర్ రెడ్డి, సూర్య, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద్‌కుమార్ తదితరులు చేరారు. కల్వకుర్తి, బాన్సువాడ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ నేతలు మాల్యాద్రి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంజ్యా నాయక్, వారికి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య : దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమైన చర్య అని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో సరైనవి కావన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దాడి చేసిన వ్యక్తి 2018లో నాగేశ్వరరావుతో దిగిన ఫొటోలున్నాయన్నారు. 2020లో ప్రెస్ రిపోర్టర్‌గా పని చేశారని తెలిపారు. దాడి జరిగిన గంటలోపే కాంగ్రెస్‌పై సీఎం కేసీఆర్ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

ఇజ్రాయిల్ దురహంకార దాడులు ఆపాలి

(మొదటిపేజి తరువాయి)

కోరారు. అధ్యక్షత వహించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమానుషంగా గాజాపై దాడులు చేస్తున్నదని విమర్శించారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ప్రజలంతా పాలస్తీనాకు సంఘీభావంగా ఉండాలనీ, భారత్‌లో రాజకీయాలకతీతంగా ప్రజలు అండగా ఉండాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ కాల్పుల విరమణ చేయబోమంటూ ఇజ్రాయిల్ ప్రకటించడం దుర్మార్గమని విమర్శించారు. హమాస్‌ను పెంచిపోషించిన ఇజ్రాయిల్ ఇప్పుడు దాన్ని అంతం చేయాలనుకుంటున్నదని చెప్పారు. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో బతుకుతున్నారని అన్నారు. పాలస్తీనావాసులను నిర్మూలించి వలసవాదులు గాజాను ఆక్రమించాలని చూస్తున్నారని చెప్పారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నదని విమర్శించారు. పాలస్తీనా భూభాగం నుంచి ఇజ్రాయిల్ వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని అందరూ ఖండించాలన్నారు. అనంతరం ఎస్వీకే నుంచి అంబేద్కర్ కాలేజీ వరకు ప్రదర్శన నిర్వహించారు. 'ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలి, పాలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలి, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలి, పాలస్తీనాకు ప్రజలు అండగా నిలబడాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ప్రజాప్రభుత్వాన్ని నిర్మిద్దాం



(మొదటిపేజి తరువాయి)

గ్యారెంటీలు అమలు కావాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని అన్నారు. నాకు మరో మీటింగ్ ఉన్నా.. సోదరి ప్రియాంకగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం తాను కొల్లాపూర్ సభకు హాజరైనట్టు తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల చివరి నిముషంలో ప్రియాంకగాంధీ హాజరు కాలేకపోయారని, అందుకే తాను వచ్చినట్టు వివరించారు. 'మనది రాజకీయబంధం కాదు, కుటుంబబంధం' అంటూ ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు.

ఈ ఎన్నికల్లో ప్రజాస్వామిక వాదులు గెలుపొందుతారని రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ధరణి తెచ్చి ప్రభుత్వ భూములన్నింటినీ కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్రంలో లక్ష కోట్లు మెక్కాయని ఆరోపించారు. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చి అప్పుల తెలంగాణగా మార్చారని, ఇప్పుడు ప్రతి వ్యక్తి ఏడాదికి 31 వేలు చెల్లించినా అప్పు తీరదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే జూరాల, సింగూర్, శ్రీశైలం, నాగార్జునసాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కట్టిన బ్యారేజ్ కుంగిపోయింది.. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులను చూడండి.. కాళేశ్వరం ప్రాజెక్టును చూడండి.. ఇదే కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు భూములను పంచితే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని గుంజుకుంటోందన్నారు. రెవెన్యూ, ఇసుక, మందు శాఖల ద్వారా వచ్చే కోట్ల రూపాయలు కేటీఆర్ కుటుంబానికి పోతున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుబంధు రద్దు చేస్తారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రైతు భరోసా పేరుతో రైతులందరికీ ఎకరాకు ఏడాదికి రూ.15000, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రూ.12000 చెల్లిస్తామన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. మహిళలను గౌరవిస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఒకో ఇంటికి ఐదు లక్షలు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు.

కేంద్రంలో జీఎస్టీ, రైతు వ్యతిరేక చట్టాలు, కార్మిక చట్టాల వంటి ప్రమాదకరమైన విధానాలను తీసుకొస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. ప్రజాబలం గలిగిన మీరంతా గబ్బర్ సింగ్‌లే.. అని పిలుపునిచ్చారు. 2024లో కేంద్రంలో బీజేపీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రాజేష్ రెడ్డి, జగదీశ్వర్ రావు, కూచుకుల్ల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు 'బంధు'ల గోల...

(మొదటిపేజి తరువాయి)

వెళ్లినప్పుడు... ఈ బాధితులందరూ వారిని నిలేస్తున్నారు. 'మీ వాళ్లకు, మీకు అనుకూలంగా ఉన్న వాళ్లకు మాత్రమే స్కీములను ఇచ్చారు. మాకేమైనా ఇచ్చారా..? పోనీ ఎప్పటిలోగా ఇస్తారో చెప్పండి...' అంటూ ప్రశ్నిస్తుండటంతో నాయకులకు నోట మాట రావటం లేదు. ఇదే విషయాన్ని పలువురు లీడర్లు బీఆర్ఎస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు వినికిడి. 'పోయినసారి నిరుద్యోగ భృతి లాగా ఈసారి దళిత, బీసీ, మైనారిటీ బంధు పథకాలను ఎన్నికల ప్రణాళికలో చేరిస్తే బాగుండేది. ప్రజలకు కొత్త పథకాలపై కొంచెం ఆశలుండేవి.. మనకు రాజకీయ ప్రయోజనం కలిగేది...కానీ వాటిని ముందే ప్రకటించాం. ఆయా స్కీముల అమల్లో జరిగిన లోపాలు, లొసుగులు, వైఫల్యాలతో ఎలక్షన్లలో మన పరిస్థితి రివర్స్ అవుతోంది...' అని పలు జిల్లాలకు చెందిన నేతలు సీఎం కేసీఆర్ వద్ద వాపోయినట్టు సమాచారం.

వాస్తవానికి దళిత బంధు పథకాన్ని ప్రస్తుత శాసనసభ ఎన్నికల కోసమే కేసీఆర్ రూపొందించారని సమాచారం. దాన్ని ఇప్పటి మ్యానిఫెస్టోలో కూడా పొందుపరచాలని ఆయన భావించారు. కానీ అనుకోకుండా మధ్యలో హుజూరాబాద్ ఉప ఎన్నిక రావటంతో సీఎం వ్యూహం మార్చారు. ఆ ఎన్నిక తమ పార్టీకి ప్రతిష్టాత్మకం కావటం, అందునా హుజూరాబాద్‌లో ఎస్సీల ఓట్లు క్రియాశీలకంగా మారటంతో ఇప్పటి కోసం దాచిన 'దళిత బంధు' అస్త్రాన్ని కేసీఆర్ అప్పుడే వదిలారు.

తద్వారా ఈటల రాజేందర్‌ను ఓడించొచ్చని భావించి, అందులో విఫలమయ్యారు. ఆ తర్వాత ఆ నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధును విస్తరిస్తున్నామంటూ ప్రకటించారు. అదే పరంపరలో బీసీ, మైనారిటీ బంధు పథకాలను ప్రవేశపెట్టారు. అయితే అవి ప్రచారంలో అధికార పార్టీకి లబ్ధి చేకూర్చడం మాటేమోగానీ ప్రశ్నలై నిలదీస్తున్నాయి.

ఎన్నికల్లో ప్రజలు గెలవాలి

(మొదటిపేజి తరువాయి)

ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారని కోదాడ సభలో తానంటే, ఉత్తమకుమార్‌రెడ్డి ఎగిరి పడుతున్నాడని అన్నారు. అలూ లేదు సూలు లేదు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే నేనంటే నేనే ముఖ్యమంత్రినని డజన్ మంది ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌కు ఎద్దు ఎగసం ఉందో లేదో తెలియదు కానీ ఆయన ధరణి వద్దంటున్నాడన్నారు. అవి ఉంటే వద్దనడని అన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు సాగర్ ఎడమ కాలువకు అధికారులతో చర్చించి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

పంజాబ్‌ను తలదన్నే విధంగా 3 కోట్ల టన్నుల ధాన్యం పండించే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకున్నదని, రేషన్‌కార్డు దారులందరికి సన్నబియ్యం అందించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. రైతుబంధు దుబారాంటా..... మూడు గంటల కరెంటు చాలంట.. కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని ,వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. దళితుల్లో ఆత్మవిశ్వాసం ఉండేందుకు దళిత బంధు తెచ్చామన్నారు. కాంగ్రెస్ నాయకులు కోర్టు స్టే తేవడం వల్లనే డిండి లిఫ్టు పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. కొద్ది నెలల క్రితమే ఆ చిక్కులు పోయాయి అన్నారు. త్వరలో దిండి లిఫ్టు పనులు పూర్తయితే దేవరకొండ దరిద్రం పోతుందన్నారు. మా తండాలలో మా రాజ్యం -మా పరిపాలన అనే విధంగా తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. ఓ మంచి వ్యక్తిని గెలిపించుకుంటే అంతా మంచే జరుగుతదన్నారు.

మేమెన్నడూ అరాచకాలు చేయలేదు...

తెలంగాణ వచ్చిన పది సంవత్సరాల కాలంలో తెలంగాణాల్లో కర్ఫ్యూలు, మత కల్లోలాలు లేవని కేసీఆర్ అన్నారు. మేము ఏనాడూ అరాచకాలు చేయలేదన్నారు. లౌకికవాదానికి తమ పార్టీ నిదర్శనమని ,ముస్లిం సమాజం ఆలోచించాలని కోరారు. కెసిఆర్ బతుకున్నంతకాలం సెక్యురిలిజం కోసం బతికి ఉంటాడన్నారు. అభివద్ధికి ఆటంకం కలుగకుండా మరోసారి బిఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం..

(మొదటిపేజి తరువాయి)

రెండేండ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఇదిలా ఉంటే, ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. నవంబర్ 7న తొలిదశ పోలింగ్, నవంబర్ 17న రెండో దశ పోలింగ్ నిర్వహించనున్నారు. మిజోరంలో నవంబర్ 7, మధ్యప్రదేశ్‌లో నవంబర్ 17, రాజస్థాన్‌లో నవంబర్ 25, తెలంగాణలో నవంబర్ 30న పోలింగ్ జరగనుంది.

నైరాశ్యంలో కాంగ్రెస్

- అందుకే హింసను ప్రోత్సహిస్తోంది : మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నైరాశ్యంలో కూరుకుపోయిందని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అందుకే అది హింసను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే వీఎమ్ అబ్రహం తదితరులతో కలిసి మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డిపై హత్యాయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ రాష్ట్ర నేతల మాటలు, చర్యలు చూసి ఆ పార్టీ కార్యకర్తలు కూడా అలాగే తయారవుతున్నారని విమర్శించారు. ప్రజలను ఒప్పించి, మెప్పించాలి తప్పితే దాడులు సరికాదని హితవు పలికారు. నాగం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రాంతీయ పార్టీలతోనే నేతలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరటమనేది ఓ పాలపొంగులాంటిదని ఆయన ఎద్దేవా చేశారు. అక్కడ (కాంగ్రెస్‌లో) ఉదయం పార్టీలో చేరితే సాయంత్రానికల్లా టిక్కెట్ ఇచ్చేస్తున్నారనీ, తనకు మాత్రం పాపులారిటీ లేదంటూ పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రావుల మాట్లాడుతూ... ప్రజా సేవ అనేది బీఆర్ఎస్‌తోనే సాధ్యమనీ, అందుకే తాను ఆ పార్టీలో చేరానని చెప్పారు. పాలమూరు రాజకీయాల్లో అందరమూ కలిసి కట్టుగా పని చేస్తామని తెలిపారు.

ఎర్రకోటగా పిలవబడే నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం నేడు రంగులమయంగా మారింది. ఇక్కడ 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే పదిసార్లు వామపక్ష అభ్యర్థులు విజయం సాధించారు. ఇందులో రెండుసార్లు పీడీఎఫ్, 8సార్లు సీపీఐ(ఎం), మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి బీఆర్ఎస్ గెలుపొందింది. ఇక్కడి నుంచి సీపీఐ(ఎం) తరపున ఎమ్మెల్యేలుగా నర్రా రాఘవరెడ్డి, నోముల నరసింహయ్య గెలిచారు. శాసనసభ పక్షనేతలుగా వ్యవహరించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన నర్రా రాఘవరెడ్డి తనదైన వాగ్ధాటితో ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు.

పోరు గడ్డలో... గెలుపెవరిదో...





నియోజకవర్గాల పునర్విభజనతో మారిన నకిరేకల్ రాజకీయం

నకిరేకల్‌లో 14 సార్లు ఎన్నికలు..

- ఏడుగురు ఎమ్మెల్యేలు
- 10 ఎన్నికల్లో ఎర్రజెండాదే గెలుపు

8 పర్యాయాలు సీపీఐ(ఎం)దే విజయం

నల్లగొండ ద్విసభ్య నియోజకవర్గంలో ఉన్న నకిరేకల్ 1957లో నియోజకవర్గంగా ఆవిర్భవించింది. నాడు 57,440 ఓటర్లు ఉన్న నియోజకవర్గం 2023 నాటికి 2,44,467 ఓటర్లకు చేరుకుంది. 2009 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఓటర్ల సంఖ్య రెండు లక్షలకు పైగా పెరిగింది. ఐదేండ్లలో 17,196 మంది కొత్తగా ఓటర్లు పెరిగారు. ఈ నియోజక వర్గంలో ప్రధాన వృత్తి వ్యవ సాయం. కేతెపల్లి మండల సరి హద్దులో సుమారు 40 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే మూసీ ప్రాజెక్టు ఉంది.

1957లో నియోజకవర్గం ఏర్పాటు

నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. రామన్నపేట మండలం మినహా మిగతా ఐదు మండలాలగుండా 65వ నెంబర్ జాతీయ రహదారి పోతుంది. చిట్యాల, రామన్నపేట, నార్కట్ పల్లి మండలాల కేంద్రాల మీదుగా రైల్వే లైన్ ఉంది.

నవతెలంగాణ- నకిరేకల్

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో నకిరేకల్‌లో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారాయి. నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాలతో 126 గ్రామపంచాయతీలు ఉన్న నియోజకవర్గంలో మూసీ ప్రాజెక్టు, చెరువుగట్టు రామలింగేశ్వర ఆలయం, 65వ, 565వ, 365వ నెంబర్ల జాతీయ రహదారులు, నార్కట్‌పల్లి- అద్దంకి రాష్ట్ర రహదారి విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఓటర్ల సంఖ్యలో నల్లగొండ జిల్లాలో నకిరేకల్ నియోజకవర్గం ద్వితీయ స్థానంలో ఉంది.

సీపీఐ(ఎం) రికార్డు విజయాలు

నియోజకవర్గంలో మొత్తం 14సార్లు ఎన్నికలు జరిగితే సీపీఐ(ఎం) 8సార్లు గెలిచింది. 1957లో పీడీఎఫ్ అభ్యర్థి ధర్మభిక్షం, 1962లో సీపీఐ నుంచి నంద్యాల శ్రీనివాసరెడ్డి గెలుపొందారు. 1967లో నర్రా రాఘవ రెడ్డి, 1972లో కాంగ్రెస్ అభ్యర్థి మూసపాటి కమలమ్మ, ఆ తర్వాత 1977 నుంచి వరుసగా ఐదుసార్లు రాఘవ రెడ్డి సీపీఐ(ఎం) నుంచి గెలుపొంది 1999 వరకు ఎమ్మెల్యేగా, శాసనసభ పక్ష ఉపనేతగా, శాసనసభా పక్ష నేతగా పనిచేశారు. 1999 నుంచి 2009 వరకు నోముల నర్సింహయ్య రెండుసార్లు సీపీఐ(ఎం) ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నర్రా రాఘవరెడ్డి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారు. ఏక కాలంలో నియోజకవర్గంలో 68 గ్రామా లకు విద్యుద్దీకరణ చేయించిన ఘనత రాఘవరెడ్డికి దక్కింది. నల్లగొండ జిల్లా ఎడారిగా మారుతుందని ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కోసం ఆనాడు ఎన్టీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రూపకల్పన చేయడంలో నర్రా కీలక పాత్ర పోషించారు.

పునర్విభజనతో మార్పు..

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమ్యూనిస్టులకు పట్టు ఉన్న శాలిగౌరారం మండలంతోపాటు తోపుచర్ల పిర్కా, తిప్పర్తి మండలంలోని కొన్ని గ్రామాలు తొలగించడం, కాంగ్రెస్‌కు బలమున్న మండలాలు కలవడంతో పార్టీల బలాబలాలు మారిపోయాయి. పునర్విభజన తర్వాత నకిరేకల్ భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోకి చేరింది. 2009, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వేముల వీరేశం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చివరగా ఒకసారి..



2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుత ఎన్నికలకూ బీఆర్ఎస్ పార్టీ చిరు మర్తి లింగయ్యనే ప్రకటించింది. దాంతో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి పోటీలో నిలబడ్డారు. 2014, 2018 ఎన్నికల్లో కూడా ఈ ఇరువురి అభ్య ర్థుల మధ్యనే హోరాహోరీ పోరు జరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఇద్దరు పోటీ పడుతున్నారు. వామపక్షాలు ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కోవర్టులపై నజర్..!

- ప్రత్యర్థి వ్యూహ, ప్రతివ్యూహాల అమలుపై ఆరా..
- ప్రత్యర్థుల సమాచారంపై అభ్యర్థుల దృష్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రధాన పార్టీల్లో కోవర్టుల హైరానా మొదలైంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో కొత్తగా చేరుతున్న వారిపై ఫోకస్ పెడుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలన్న కాంక్షతో అభ్యర్థి తన బలంతో పాటు ప్రత్యర్థి బలాలను అంచనా వేసేందుకు ఎక్కువగా ప్రయారిటీ ఇస్తూ నిఘా పెడుతున్నారు. అక్కడ ఏం జరుగుతుందో.. వారి వ్యూహాలేమిటి.. ఎక్కడికి వెళ్తున్నారు.. ఎవరెవరిని కలుస్తున్నారో.. ఎప్పటికప్పుడూ సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలుస్తోంది. దీని కోసం తమ మనుషులను ఇతర పార్టీల్లోకి చేర్చేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. కోవర్టులతో ప్రత్యర్థి ఆలోచనలు, వ్యూహాలను తెలుసుకుని వారి కంటే ముందే అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికల సమయం ముంచుకోస్తుండటంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. సాధారణంగా ఏ ఎన్నికల్లోనైనా ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు, వినూత్న ప్రచారాలు, ఎత్తుగడలతో ముందుకెళ్తారు. కానీ ఈసారి సరికొత్త రాజకీయం తెరపైకి వస్తున్నట్టు అర్థమవుతోంది. తన పార్టీలోని మనుషులను ప్రత్యర్థి పార్టీలోకి చేర్చి అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునే ఎత్తుగడలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రత్యర్థి గెలుపు కోసం రచిస్తున్న వ్యూహాలేమిటి? బలం, బలహీనతలేమిటి? ఎవరెవరిని కలుస్తున్నారు.. తదితర అంశాలను కోవర్టుల ద్వారా ఎప్పటికప్పుడూ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యర్థి కదలికలను తెలుసుకోవడమే కాకుండా ముందే అవతలి అభ్యర్థి ప్రణాళికలను అమలు చేస్తుండటంతో సదరు అభ్యర్థి అవాక్కవుతున్నారు. గ్రేటర్‌లోని బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు బీజేపీలోనూ ప్రస్తుతం నూతన కార్యకర్తలపైనే దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులు, సీనియర్ నేతలు ప్రధాన పార్టీల్లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకోగా నూతన కార్యకర్తల ద్వారా అందిన సమాచారంతో ప్రత్యర్థి పార్టీ నేతలు అప్పటికప్పుడు సదరు నేతల ఇంటికి వెళ్లి పదవులు, డబ్బు ఆశ చూపి కొనసాగేలా చూసుకుంటున్నారని సమాచారం.

పదవులు.. డబ్బు ఆశ చూపి తమ వైపు..

ఇతర పార్టీల్లో చేరుతున్న కొత్త కార్యకర్తలతో ప్రత్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒక పార్టీ అభ్యర్థి డివిజన్ స్థాయిలో ఉన్న కీలక నేతలను, యువజన సంఘాలు, మహిళలను ఎలా తనవైపు తిప్పుకుంటున్నాడో.. వారికి ఎలాంటి తాయిలాలు ఇస్తున్నారో.. సదరు పార్టీలో డివిజన్, వార్డు, మండల స్థాయిలో కీలక నేతలెవరు.. వారికి అభ్యర్థికి మధ్య సత్సంబంధాలున్నాయా లేదా? వంటి అంశాలను మరో పార్టీ అభ్యర్థి కోవర్టు కార్యకర్తల ద్వారా సేకరిస్తున్నారు. తద్వారా వారి వ్యూహాలను పసిగట్టడంతో పాటు అవతలి పార్టీ అభ్యర్థితో డివిజన్, మండలస్థాయి కీలక నేతల మధ్య మనస్పర్థలు ఉంటే సదరు అభ్యర్థులు అక్కడ వాలిపోతున్నారు. పదవులు ఆశచూపి.. భారీగా తాయిలాలు ఇచ్చి తమవైపు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.



మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్ తనిఖీ

నవతెలంగాణ-సిద్దిపేట

మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్‌ని సిద్దిపేట జిల్లా పొన్నాల ప్రధాన రహదారి వద్ద ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి వాహనంతోపాటు ఆయన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు.

చందానగర్‌లో రూ.69 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-చందానగర్

ఎన్నికల తనిఖీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా చందానగర్ బస్టాండ్ వద్ద పోలీసులు రూ.69లక్షలు స్వాధీనం చేసుకున్నారు. విజేత సూపర్ మార్కెట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పరాసా బాలకృష్ణ నగదుతో వెళ్తుండగా.. మాదాపూర్ ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు చందానగర్ బస్టాండ్ వద్ద తనిఖీ చేశారు. బాలకృష్ణను విచారించగా అతని వద్ద రూ.69లక్షలు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డబ్బులను సీజ్ చేసి, ఐటీ శాఖకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.


తొలి మహిళా ప్రతిపక్ష నేత ఆరుట్ల

తెలంగాణ అగ్గిబరాటా కమలాదేవి

- అర్ధశతాబ్దం పైచిలుకు పోరాట చరిత్ర

ఆణిముత్యాలు..

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి. చిన్నతనంలోనే వివాహం అయినా భర్త ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదువుకుని ఇతరులకు సహాయం చేశారు. పాఠశాల, గ్రంథాలయాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో పాల్గొంటూ కమ్యూనిస్టు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆత్మరక్షణ విద్యలు నేర్చుకుని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గెరిల్లా దళంలో పనిచేశారు. మూడు సార్లు భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి ఆంధ్ర శాసన సభలో తొలి మహిళా ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు.



నవతెలంగాణ- ఆలేరుటౌన్

యాదాద్రి-భువనగిరి జిల్లా మంతపురిలో పల్లా వెంకటరాంరెడ్డి, లక్ష్మీ నరసమ్మలకు 1920 జూన్‌లో కమలాదేవి జన్మించారు. ఆమె అసలు పేరు రుక్మిణి. ఆమెకు పన్నెండో ఏట ఆరుట్ల రామచంద్రారెడ్డితో వివాహమైంది. ఆ తరువాత అమ్మాయిని హైదరాబాద్‌కు పంపించి చదివించాలని రామచంద్రారెడ్డి వారి మామకు చెప్పారు. వివాహానంతరం రుక్మిణికి కమలాదేవిగా పేరు మార్చారు. 1932లో చదువు కోసం కమలాదేవి హైదరాబాద్ వచ్చారు. ఆంధ్రోద్యమ పితామహుడు హనుమంత రావు కృషి వల్ల అమ్మాయిలకు పాఠశాల, హాస్టల్ ఏర్పాటైంది. మూడో తరగతిలో చేరిన కమలాదేవి.. ఆ హాస్టల్‌ను ప్రారంభించారు. చదువుకునే సమయం లోనే ఆంధ్ర మహిళాసభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరులో పాల్గొన్నారు. భారత స్వాతంత్రోద్యమ యోధురాలుగా, తెలంగాణ సాయుధ పోరాట వీరనారిగా ఘనకీర్తి సాధించిన నాయకురాలు ఆరుట్ల కమలాదేవి. ఆమెది అర్ధశతాబ్దం పైచిలుకు పోరాట చరిత్ర.



మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా..

1952లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి కమలాదేవి పోటీ చేసి, భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలు అంటే 15 ఏండ్లు అదే స్థానం నుంచి కమ్యూనిస్టు పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఉన్నారు. 1963-64 మధ్య ప్రతిపక్ష కమ్యూనిస్టు నాయకురాలుగా పని చేశారు. ఈ విధంగా ఆంధ్ర శాసనసభలో తొలి మహిళా ప్రతిపక్షనేతగా నిలిచారు.

గెరిల్లా దళంలో..

తెలంగాణలో నిజాం పాలకులు రజాకార్లనూ, రిజర్వు పోలీసులనూ గ్రామాల మీదకి ఉసిగొలిపి మారణహోమం సృష్టించారు. ఈ దుశ్చర్యలను ఎదుర్కోవడానికి వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వాన సాగింది. ఇదే సమయంలో ఏర్పడిన మహిళా గెరిల్లా దళంలో కమలాదేవి పనిచేశారు. ఈ పోరాటం జాతీయోద్యమ చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టించింది. జాగీర్దారులు, భూస్వాములు, ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న భూములనూ, వ్యవసాయ యోగ్యమైన అటవీ భూములనూ ఈ గెరిల్లా దళాలు హస్తగతం చేసుకొని, పేద రైతులకూ, ప్రజానీకానికీ పంచిపెట్టారు. భూస్వామ్య దోపిడీకాండకు వ్యతిరేకంగా సాగిన ఈ చారిత్రక పోరాటంలో కమలాదేవి ప్రధాన పాత్ర వహించారు. పురిటి బిడ్డను వదిలి ఉద్యమకార్యకర్తగా ఆమె గెరిల్లా పోరాటం సాగించి, అజ్ఞాతవాసం, ఆ తరువాత జైలు జీవితం గడిపారు. పోరాట పటిమల్లో ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికే కాక భవిష్యత్ తరాలకు మార్గదర్శకం. 1948లో స్వతంత్ర భారతంలో నైజాం రాష్ట్రం విలీనం అయిన తరువాత అప్పటి వరకూ అడవిలో ఉన్న వారందరూ ఆయుధాలు వదిలి జనజీవనంలోకి రావాలని భారత ప్రభుత్వం కోరింది. కానీ, తమ ఉద్యమాన్ని మరికొంత కాలం కొనసాగించాల్సి ఉంటుందనే భావనతో కొందరు ఉద్యమకారులు వెనక్కి రాలేదు. వారిలో కమలాదేవి ఒకరు.



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి చిన్నారి విరాళం

ఎన్నికల ప్రచార కార్యక్రమ ఖర్చుల కోసం..

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓ చిన్నారి ప్రచార కార్యక్రమానికి విరాళం అందజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల మండలం చల్‌గల్ గ్రామానికి వెళ్లిన జీవన్‌రెడ్డికి శ్రీనిత్య తన కిడ్డీ బ్యాంక్‌లో జమ చేసుకున్న రూ.4792 విరాళంగా అందజేసింది. దాంతో బాలికను ఎత్తుకుని జీవన్‌రెడ్డి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

పంచ్ తంత్రం!



ప్రజాస్వామ్య సౌధానికి పునాది "ఓటర్లు"..
రాజ్యాంగం రాసుకుంది నేతల కోసం కాదు?
ఓట్లువేసి అధికారాన్ని కట్టబెట్టేది ముమ్మాటికీ ప్రజల పురోభివృద్ధి కోసమే..
అమలుకాని హామీలతో కల్లబొల్లి మాటలతో
అధికారం చేపడుతాండ్లు..
ప్రజల నమ్మకం అమ్ముడైపోతోంది..
ప్రజలచైతన్యం అనైతిక రాజకీయ క్రీడల్లో
పరాజయం పాలౌతోంది..
లేనిది రాజకీయాల్లో నైతిక విలువలే!
ఓటును అంగడి సరుకును చేయకండి?
ప్రశ్నించే స్వేచ్ఛకు ప్రాణం పోయండి..
దేశ, రాష్ట్ర ఆర్థిక స్థితిని బట్టి హామీలు ఇవ్వండి..
మందు, మనీ, మటన్ అడిగిందెవడు!
ఎందుకిస్తాండ్లు?

\- మేదాజీ

పాలమూరులో అన్ని సీట్లూ మావే..

నాగం చేరికతో బీఆర్ఎస్ బలం పెరిగింది... : సీఎం కేసీఆర్

- గులాబీ తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి నాగం, పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి





బీఆర్ఎస్‌లో చేరిన విష్ణువర్ధన్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి పాలమూరు జిల్లాల్లోని పద్నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీ గెలుపు జెండా ఎగరేస్తుందని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అదెప్పుడో ఖాయమైందని చెప్పారు. మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సీఎం కేసీఆర్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాగం జనార్ధన్‌రెడ్డి 1969 ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆ సందర్భంగా జైలుకెళ్లిన చరిత్ర కూడా ఆయనకు ఉందన్నారు. నాగం చేరికతో తమ పార్టీ బలం పెరిగిందని చెప్పారు. పీజేఆర్ తనకు మంచి మిత్రుడనీ, ఆయన తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యుడిలాంటి వాడని అన్నారు. నాగం, విష్ణుల రాజకీయ భవిష్యత్ బాధ్యత తనదేనని హామీనిచ్చారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, విష్ణు ఇద్దరూ పాత, కొత్త అనే తేడా లేకుండా సమన్వయంతో పని చేసుకోవాలంటూ సూచించారు. త్వరలో నాగం ఇంటికి తానే స్వయంగా వెళతాననీ, అప్పుడు ఆయన వెంట పార్టీలోకి వచ్చిన కార్యకర్తలను కలుసుకుంటానని వివరించారు. కత్తిపోటుకు గురైన కొత్త ప్రభాకర రెడ్డి అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డారని చెప్పారు. అలాంటి హింసా రాజకీయాలను సహించేది లేదనీ, ఎవరినీ ఉపేక్షించబోమనీ హెచ్చరించారు. హేయమైన దాడులకు పాల్పడే వారికి ప్రస్తుత ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని సీఎం ఈ సందర్భంగా హెచ్చరించారు.

గంగుల ప్రచార వాహనంపై చెప్పు వేసిన టీచర్

కేసు నమోదు



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

కరీంనగర్ మండలంలోని గోపాలపూర్ గ్రామంలో మంత్రి గంగుల కమలాకర్ ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఎల్ఈడి స్క్రీన్ వాహనంపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెప్పు విసిరేశారు. దాంతో అతనిపై మంగళ వారం కేసు నమోదైంది. కరీంనగర్ రూరల్ పరిధిలోని గోపాలాపురం గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి గంగుల కమలాకర్ ప్రచారం నిర్వహించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లతో కూడిన వాహనాన్ని నిలిపారు. గంగుల కమలాకర్‌కు ఓటేయాలంటూ ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా ప్రచారం చేస్తున్న సమయంలో తెరపైకి మంత్రి ఫొటో రాగానే శ్రీరామోజు జగదీశ్వరాచారి అలియాస్ జగతి అనే ప్రభుత్వ టీచర్ తన చెప్పుతో స్క్రీన్‌పై కొట్టి దుర్భాషలాడాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన ఆరే ప్రశాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు ఉపాధ్యాయుడిపై ఐపీసీ సెక్షన్ 290బి, 209, 504సెక్షన్లలో కేసు నమోదు చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangana Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.